ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-4-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 79 పేజీలు: 8+16 వెల: 6.50



23న విసిలతో గవర్నర్ శుక్లా సమావేశం 3

దేశ ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రలు: మమత 5





5 బెంగాల్ మహిళలకు మమత వెన్నుపోటు
బంకురా ఎన్నికల ప్రచారసభలో ప్రధాని మోదీ ధ్వజం



ఇస్లామాబాద్‌కు అమెరికా బృందం





2 రెండో దఫా చర్చల కోసం స్టీవ్ విట్‌కాఫ్, జారేడ్ కుష్నర్ల పర్యటన
డీల్‌కు రాకుంటే ఇక ఇరాన్‌లో విధ్వంసమే: ట్రంప్





5 ద.కొరియాతో వ్యూహాత్మక సహకారం
భారత్‌లో మూడురోజుల పర్యటనకు వచ్చిన లి జే మ్యూంగ్
విదేశాంగ మంత్రి జైశంకర్‌తో చర్చలు


# వారిని గట్టెక్కించండి



ఆదివారం లోక్‌భవన్‌లో గవర్నర్ శుక్లాతో భేటీ అయిన సిఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

## గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరామ్ పేర్లు ఆమోదించండి

### డ్రగ్స్ మహమ్మారి అంతానికి కీలక నిర్ణయాలు

### మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థుల నుంచి ఇక ప్రమాణ పత్రాలు

### 12న గవర్నర్ ఆధ్వర్యంలో బహిరంగ సభ

### లోక్‌భవన్‌లో గవర్నర్ శుక్లాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్19:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఇద్దరు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పేర్లు ఆమోదించాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లాను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కోరారు. ప్రొఫెసర్.కోదండరామ్, అజారుద్దీన్ పేర్లు ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఏ సభలో సభ్యుడు కానప్పటికీ మంత్రిగా అజారుద్దీన్ కొనసాగుతున్నారు. ఆయన మంత్రి పదవి చేపట్టి ఈ నెలాఖరుకు ఆరు నెలలు పూర్తి కానుంది. 6 మాసాల్లోపు ఏదో ఒక సభలో సభ్యుడిగా ఉండాల్సిన అవసరం ఉంది. గవర్నర్ ఆమోదించకపోతే ఈ నెల 30 తర్వాత అజారుద్దీన్ పదవి కోల్పోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల అంశంతో పాటు విద్యా రంగానికి సంబంధించి పలు అంశాలు వారి మధ్య చర్చకు వచ్చినట్లుగా ముఖ్యమంత్రి కార్యాలయం ఎక్స్‌లో పేర్కొంది.యువత భవిష్యత్తును పట్టి పిడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అంతం చేయడమే లక్ష్యంగా లోక్‌భవన్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. యువతను, విద్యా వ్యవస్థలను మాదకద్రవ్యాల బారి నుంచి రక్షించేందుకు ప్రభుత్వం, లోక్‌భవన్ కలిసి కార్యాచరణ సిద్ధం చేస్తున్నాయి. దాదాపు గంటకు పైగా సాగిన ఈ సమావేశంలో గవర్నర్ పలు నిర్మాణాత్మక సూచనలు చేశారని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. విద్యార్థులు విద్యాసంస్థల్లో అడుగుపెట్టేతొలిరోజే డ్రగ్స్‌కు వ్యతిరేకంగా దృఢ నిశ్చయంతో ఉండాలని గవర్నర్ సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ పొందే సమయంలోనే మేము మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటాంవాటిని ప్రోత్సహించం అని విద్యార్థుల నుంచి అధికారికంగా ప్రమాణ పత్రం

>>2



## నేడే రెండో విడత రైతు భరోసా పంపిణీ

### కాటారంలో విడుదల చేయనున్న సిఎం

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాత వార్త:** యాసంగి పంట కోతలు ముమ్మరంగా సాగుతున్న సమయంలో వరికోత యంత్రాల అద్దెలు, ధాన్యం రవాణా, హమాలి తదితర సాగు ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్న రైతులకు ఉపశమనంగా రాష్ట్ర ప్రభుత్వం రెండోవిడత రైతు భరోసా నిధులను విడుదల చేయనుంది. సోమవారం సిఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా నిధులను విడుదల

>>2

# వడగళ్లతో రైతుల కడగండ్లు

### ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో తీవ్ర పంట నష్టం

### నేలకూలిన మామిడి, బొప్పాయి తోటలు

### కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

### హైదరాబాద్‌లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం



**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఆదివారం వడగళ్లు కురిశాయి. ముఖ్యంగా ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ఆకాశం మేఘావృతమై అకస్మాత్తుగా కురిసిన ఈ వర్షానికి తోడు బలమైన గాలులు వీయడంతో జనజీవనం స్తంభించిపోయింది. పలుచోట్ల పెద్ద పెద్ద వడగండ్లు పడటంతో చేతికి వచ్చిన పంటలు దెబ్బతిని రైతులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లపై నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడగా, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అదునుకాని సమయంలో ఆదివారం కురిసిన అకాలవర్షాలు, ఈదురుగాలుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా

>>2

# భారీ పేలుడు

### విరుధ్‌నగర్ బాణసంచా తయారీ ఫ్యాక్టరీలో ఘోర ప్రమాదం

### 20 మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలు

### ప్రధాని మోడీ, తమిళ సిఎం స్టాలిన్ దిగ్భ్రాంతి



ఆదివారం విరుధునగర్ జిల్లాలోని ఓ బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుడు దృశ్యం

**చెన్నై, ఏప్రిల్ 19:** తమిళనాడులో విరుధునగర్ జిల్లాలో ఓ బాణాసంచా తయారీ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 20 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం, విరుధునగర్ జిల్లా సాత్తూరు సమీపంలోని బాణసంచా తయారీ కేంద్రంలో కార్మికులు ఆదివారం మధ్యాహ్నం రసాయనాలు కలుపుతున్న సమయంలో మంటలు చెలరేగి వరుస పేలుళ్లు సంభవించాయి. పేలుడు ధాటికి ఫ్యాక్టరీలోని పలు గదులు దెబ్బతిన్నాయి. మృతుల్లో పలువురు మహిళా కార్మికులు ఉన్నట్టు తెలుస్తోంది. సమాచారం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటానా స్థలికి చేరుకుని మంటలను అదుపు

>>2

# 'మద్దతు' మాటల్లోనే!

## ప్రకటనలకే పరిమితమైన కేంద్ర ప్రభుత్వం

### కనీసం మొక్కజొన్న పంటైనా కొనుగోలు చేయాలి

### శనగ, పొద్దు తిరుగుడుపై ఉన్న 25% పరిమితిని ఎత్తేయాలి

### కేంద్రానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరో లేఖ



**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** రైతుల ఆదాయాన్ని పదేళ్లలో 2024 కల్లా రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఆ హామీని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. పంటలకు మద్దతు ధర ప్రకటించడం, ప్రతి సంవత్సరం పెంచడం వరకే కేంద్రం పరిమితమైందని దుయ్యబట్టారు. వాస్తవ కొనుగోళ్ల విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తెలంగాణలో విస్తృతంగా పండే మొక్కజొన్న పంట విషయంలో కూడా కేంద్రం కేవలం మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంటోందని విమర్శించారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వానికి ఆదివారం ఆయన మరోమారు లేఖ రాశారు. మక్కలకు మద్దతుధర ప్రకటించడమే కాకుండా ప్రతి సంవత్సరం పెంచుకుంటూపోయిన కేంద్రం ఆ మద్దతు ధర రైతులకు దక్కుతుందా లేదా అన్న విషయాన్ని పట్టించుకోవడం లేదని, వాటి కొనుగోళ్ల కోసం రాష్ట్రానికి ఏ మాత్రం చేయూత ఇవ్వడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరుతో రైతులు తమ పంటను ఎక్కడ అమ్ముకోవాలో తెలియని స్థితిలో పడుతున్నారని, బహిరంగ మార్కెట్లో మద్దతు ధర లభించక

>>2



ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో కేంద్ర మంత్రి శోభాకరండ్లజె. చిత్రంలో పార్టీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు, ఎంపి అరుణ

# మహిళలను వంచించిన 'ఇండి' కూటమి

### హైకమాండ్ అనుగ్రహం కోసమే ప్రధానిపై సిఎం అనుచిత వ్యాఖ్యలు

### మోడీ నాయకత్వంలోనే మహిళా సాధికారతకు పెద్దపీట: కేంద్ర మంత్రి శోభాకరండ్లజె

**హైదరాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** భారత మహిళల చరిత్రలో ఏప్రిల్ 17వ తేదీ ఒక చీకటి రోజుగా, బ్లాక్ డేగా మిగిలిపోయిందని, రాహుల్ గాంధీ నాయకత్వంలోని ఇండియా అలయన్స్ దేశంలోని మహిళలతో పాటు మొత్తం దక్షిణ భారతదేశాన్ని ఘోరంగా మోసం చేసిందని కేంద్రమంత్రి శోభా కరంద్లాజే మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు చిరకాలంగా కోరుకుంటున్న33శాతం రిజర్వేషన్ బిల్లుతో పాటు, దక్షిణ భారత రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేలా కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును తీసుకువచ్చిందని గుర్తు చేశారు. జనాభా నియంత్రణ పాటిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు భవిష్యత్తులో జనగణన తర్వాత ఎలాంటి అన్యాయం జరగకుండా రక్షణ కల్పించడమే ప్రధాని మోడీ ఉద్దేశమని ఆమె స్పష్టం చేశారు.

>>2







131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై కాంగ్రెస్ వైఖరికి నిరసనగా రాహుల్ గాంధీ నివాసం వద్ద ఆదివారం జరిపిన ప్రదర్శనలో నినాదాలు చేస్తున్న ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా

## నేడు మేడిగడ్డ డ్యామ్ సైట్‌ను పరిశీలించనున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్19:** సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. మధ్యాహ్నం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని సిఎం దర్శించుకోనున్నారు. కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనుల భూమిపూజ కార్యక్రమంలో సిఎం పాల్గొననున్నారు. అనంతరం మేడిగడ్డకు ముఖ్యమంత్రి చేరుకోనున్నారు. మేడిగడ్డ డ్యామ్ సైట్ ను పరిశీలించి అక్కడే ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం మీడియాతో మాట్లాడుతారు. అక్కడి నుంచి నేరుగా కాటారం మండలం నస్తురపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ముఖ్యమంత్రి చేరుకుంటారు. బహిరంగ సభ వేదికగా 'రైతు భరోసా' రెండో విడత నిధులను విడుదల చేస్తారు.

## నేడే రెండో విడత రైతు భరోసా పంపిణి

>> చేయనున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో నిర్వహించనున్న భారీ బహిరంగ వేదిక నుంచే కంప్యూటర్ బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో నేరుగా రైతు భరోసా నిధులను సిఎం జమ చేయనున్నారు. రెండో విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 45,11,947 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ఈ విడతలో మొత్తం రూ.5,653 కోట్ల నిధులను ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేయనుంది.

యాసంగి సీజన్ పెట్టుబడి రూపేణ గత నెల 23న సిద్ధిపేట జిల్లా నర్మెటలో జరిగిన సభలో మొదటి విడతలో 68, 89, 955 మంది రైతులకు సుమారు రూ.3, 446.94 కోట్లను సిఎం విడుదల చేశారు. ఆ విడతలో ఎకరం వరకు భూమి ఉన్న రైతులను పరిగణనలోనికి తీసుకుని ఎకరానికి రూ.6వేల చొప్పున మొత్తం 57, 44, 907 ఎకరాలకు ప్రభుత్వం రైతు భరోసా సాయం అందించింది. తాజాగా రెండో విడత నిధులను సోమవారం సిఎం విడుదల చేయనున్నఆరు. మొదటి విడతలో రైతులకు ఎకరం వరకు పెట్టబడి సాయం అందగా రెండో విడతలో రెండో ఎకరం వరకు సాయం అందిస్తారు. మొదటి, రెండో విడతలో కలిపి రైతు భరోసాకు ఇచ్చే నిధులు రూ.5653 కోట్లు అవుతాయని వ్యవసాయశాఖ వెల్లడించింది. రైతు భరోసా పథకానికి రూ.9వేల కోట్లను కేటాయించినందున సాధ్యమైనంత త్వరగా మూడో విడత నిధులను కూడా ప్రభుత్వం విడుదల చేయనుంది.

## వారిని గట్టెక్కించండి

>> తీసుకోవాలని సూచించారు. విద్యాసంస్థల్లో కేవలం చదువు మాత్రమే కాకుండా, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై నిరంతరం అవగాహన కల్పించాలని, విద్యార్థులతో సామూహిక ప్రమాణాలు చేయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి గవర్నర్ సూచించారు. మాదకద్రవ్యాల నివారణపై రాష్ట్రస్థాయిలో చైతన్యం తీసుకురావడానికి జూన్ 12న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గవర్నర్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ సభ ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు, యువతకు డ్రగ్స్ లేని సమాజం ప్రాముఖ్యతను వివరించనున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలపై రేవంత్ రెడ్డితో గవర్నర్ చర్చించారు. కేవలం డ్రగ్స్ అంశమే కాకుండా, రాష్ట్రంలోని విద్యా రంగంలో మౌలిక వసతులు, యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న విద్యావేత్తల పోస్టులు, ఉన్నత విద్యా ప్రమాణాల మెరుగుదలపై భేటీలో చర్చకు వచ్చినట్లుగా తెలిసింది. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా విద్యా సంస్థల పనితీరు ఉండాలని పేర్కొన్నారు. గవర్నర్ చేసిన ప్రతిపాదనల పట్ల రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలియజేశారు. ఆయన సూచించిన విధంగా అడ్మిషన్ల సమయంలో అఫిడవిట్లు తీసుకోవడం, విద్యార్థులతో ప్రమాణం చేయించడం వంటి అంశాలను తక్షణమే అమలు చేస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జూన్ 12న జరగబోయే కార్యక్రమానికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

కాగా, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి నెలకొన్న ఉత్కంఠను తొలగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో కొనసాగుతున్న మహమ్మద్ అజారుద్దీన్ పదవికి ఈ నెలాఖరుతో గడువు ముగియనుంది. రాజ్యాంగం ప్రకారం, ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ కాకుండా మంత్రిగా ప్రమాణం చేసిన వ్యక్తి, 6 నెలల లోపు ఏదో ఒక సభలో సభ్యుడిగా ఎన్నిక కావాలి. అజారుద్దీన్ మంత్రి పదవి చేపట్టి ఈ నెల 30 నాటికి ఆరు నెలలు పూర్తి కానున్నాయి. ఒకవేళ ఈలోగా గవర్నర్ ఆయన ఎమ్మెల్సీ నియామక ఫైల్‌పై సంతకం చేయకుంటే, ఆయన తన మంత్రి పదవిని కోల్పోయే ప్రమాదం ఉంది.

రాజ్యాంగపరమైన చిక్కులు రాకుండా గవర్నర్‌తో సిఎస్,ఏజీ చర్చలు శనివారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి గవర్నర్‌ను కలిసి రాజ్యాంగపరమైన చిక్కులు రాకుండా వివరణ ఇచ్చారు. గతంలో కోర్టులో ఉన్న సాంకేతిక ఇబ్బందులు తొలగిపోయినందున, తక్షణమే ఆమోద ముద్ర వేయాలని గవర్నర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఒకవేళ అజారుద్దీన్ ఎమ్మెల్సీ పదవి విషయంలో గవర్నర్ సానుకూల నిర్ణయం తీసుకోకపోతే మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాల్సి ఉంటుంది. తర్వాత రెండోసారి మంత్రిగా రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంటుంది. రెండోసారి మంత్రి అయ్యాక ఆయన 6 నెలలోగా ఎమ్మెల్సీ లేదా ఎమ్మెల్యేగా కావల్సి ఉంటుంది. లేని పక్షంలో మంత్ర పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఎమ్మెల్సీ లేదా ఎమ్మెల్యే కాకపోతే మూడోసారి మంత్రి అయ్యే అవకాశం ఉండదు.

## పవన్‌కు ప్రధాని ఫోన్

### థాంక్యూ మోడీజీ,మీ మాటలు నాకు బలాన్నిచ్చాయి: పవన్

### ఆందోళన చెందకండి... పవన్ ఆరోగ్యంగానే ఉన్నారు: చిరంజీవి

### పవన్ త్వరగా కోలుకోవాలి: జగన్, కెటిఆర్, ఎన్టీఆర్, అల్లుఅర్జున్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 19:** ఎపి డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. శుక్రవారం పాలనా పరమైన అంశాలపై అధికారులతో చర్చిస్తున్న సమయంలో పవన్ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఆయనకు జూబ్లీహిల్స్ లోని అపోలో వైద్యులు శనివారం సాయంత్రం శస్త్ర చికిత్స చేశారు. అయితే పవన్‌కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన అన్నయ్య మెగా స్టార్ చిరంజీవి తాజా అప్‌డేట్ ఇచ్చారు. పవన్ ఆరోగ్యంగా ఉన్నారని ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చిరు పేర్కొన్నారు. 'కళ్యాణ్ బాబుకు శస్త్ర చికిత్స విజయవంతంగా జరిగింది. ప్రస్తుతం పవన్ ఆరోగ్యం నిలకడగా ఉంది. బాగా కోలుకుంటున్నాడు. తను సాధారణ స్థితికి వచ్చేందుకు వారం సమయం పడుతుందని వైద్యులు చెప్పారు. పవన్ కోలుకోవాలని ప్రార్థించిన వారందరికీ ధన్యవాదాలు' అని చిరంజీవి ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోడీ పవన్ ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఫోన్‌లో యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు పవన్ స్పందిస్తూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ధన్యవాదాలు. సర్జరీ అనంతరం నా ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికి సమయం కేటాయించి మాట్లాడినందుకు కృతజ్ఞతలు. నా ఆరోగ్యం పట్ల మీ ఆందోళన, నేను త్వరగా కోలుకోవాలని మీరు తెలిపిన శుభాకాంక్షలు నాకు గొప్ప బలాన్ని ఇస్తున్నాయి. మీ మార్గదర్శకత్వం, మద్దతుకు ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటాను" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, ప్రముఖ నటులు ఎన్టీఆర్, అల్లు అర్జున్, సాయి దుర్గా తేజ్, రచయిత కోనా వెంకట్ తదితరులు పవన్ త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. పవన్ కళ్యాణ్ శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో, వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ స్పందించారు. పవన్ త్వరగా, సంపూర్ణంగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షించారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన పవన్ కళ్యాణ్‌కు శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు.

## వారం - వర్జ్యం

20-04-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, అశ్విని కార్తె
తదియ ఉ.7.28, చవితి తె.4.16,
రోహిణి రా.2.09
వర్జ్యం : సా.6.58-రా.8.24
దు.ము.12.31-మ.1.21,
2) మ.3.02-మ.3.52
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం** :సుదూరప్రాంత వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. కుటుంబంలోని పెద్దలనుండి సలహాలను తీసుకుంటారు.

**వృషభం**:అత్యంత అనుకూల వాతావరణములోనూ ప్రతిపనిలోనూ ఉత్సాహముతో ముందుకు వెళ్ళగలుగుతారు. వాహనసౌఖ్యం.

**మిథునం**: అదృష్టమునకు చాలాదగ్గరగానే రోజులు నడుస్తున్నట్లు తోస్తుంది. కుటుంబ అభివృద్ధి అన్నివిధముల బాగుంటుంది.

**కర్కాటకం**:నిర్మాణపనులు సంతృప్తికరముగా తోచవు. నిర్మాణ విషయములో నాణ్యత పరిశీలించుకోవాలి.

**సింహం**:మిత్రబృందంలో ఒకరి సలహామేరకు వ్యాపారవిస్తరణకుగాను నూతన పెట్టుబడులను పెడతారు.

**కన్య** :మీ అధికార పరిధి బాధ్యతలు పెరుగుతాయి. ఆరోగ్యంలో జాగ్రత్తలు అవసరం. వృత్తిలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**తుల** : మీ కార్యక్రమముల యొక్క అభివృద్ధికి ఆటంకములను కల్పించే యత్నములు జరుగుతాయి.

**వృశ్చికం**:ముఖ్యముగా మీ ప్రతిష్ఠను దెబ్బ తీసే యత్నములు అధికము కావచ్చును. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**ధనుస్సు**:ప్రయోజనములు తాత్కాలికముగా మీ చేతికి అందకపోయినా ఉనికికి మాత్రము ముప్పులేదు.శుభవార్తలు అందుకుంటారు.

**మకరం**: సంతాన పురోభివృద్ధి మానసిక ప్రశాంతతకు కారణం అవుతుంది. ఆర్థికంగా చెప్పుకోదగిన ఒడిదుడుకులు ఉండవు.

**కుంభం**: ఓర్పు, నేర్పులతోటి కార్యసాధన అవుతుంది. కొన్ని విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని లాభపడుతారు. వస్త్రలాభం.

**మీనం** : విద్యా, వాణిజ్యరంగములలో, ఆర్థిక విషయములో ప్రోత్సాహకర వాతావరణము సమకూరుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వడగళ్లతో రైతుల కడగండ్లు

>> వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ముఖ్యంగా కోతకు సిద్ధంగా ఉన్న వరి, మొక్కజొన్న పంటలు నేలవాలింది. వడగండ్ల దాటికి మామిడి, బొప్పాయి వంటి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మార్కెట్ యార్డులకు తరలించిన ధాన్యం అకస్మాత్తుగా కురిసిన వర్షానికి తడిసి ముద్దవ్వడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. కళ్లముందే పంట తడిసిపోవడంతో పెట్టుబడి కూడా దక్కదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అకాల వర్షాలు నిజామాబాద్ జిల్లాను కలవరపెడుతున్నాయి. రెండ్రోజులుగా అకాల వర్షాలతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురియడంతో పాటు పలుచోట్ల వడగళ్లు పడటంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలోని డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, జక్రాన్‌పల్లి, సిరికొండ, మోపాల్ మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా దాదాపు గంటకు పైగా వర్షం దంచికొట్టింది. ముఖ్యంగా ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లోని పలు గ్రామాల్లో వడగళ్ల వాన కురిసింది. రాళ్ల వాన దెబ్బకు చేతికి వచ్చిన వరి పంట నేలపాలైంది. అకాల వర్షం ధాటికి ఐకేపీ సెంటర్లు, మార్కెట్ యార్డుల్లో ఆరబోసిన ధాన్యం కుప్పలు నీటిపాలయ్యాయి. సరైన టార్పాలిన్లు లేకపోవడంతో ధాన్యం కొట్టుకుపోవడాన్ని చూసి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈదురు గాలుల ధాటికి పలుచోట్ల వరి చేలు నెలకొరిగాయి. కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో వాన పడటంతో గింజ రాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రంతో పాటు తాడ్వాయి, సదాశివనగర్, మాచారెడ్డి, దోమకొండ, బిక్కనూర్ మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వర్షం పడింది. పలు చోట్ల కల్లాల్లో వరి ధాన్యం తడిసిముద్దయ్యింది. కామారెడ్డి ప్రధాన బస్టాండ్ వద్ద భారీ వృక్షం నేల కొరిగింది. దీంతో బస్టాండ్ లోపలికి బస్సులు వెళ్లేందుకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. అకాల వర్షంతో ధాన్యం తడవుడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లిలో ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షం కురిసింది. గాలివాన బీభత్సానికి భారీగా పంట నష్టం జరిగింది. పలుచోట్ల కోతకు వచ్చిన వరిపంటకు నష్టం కలిగింది. వరికల్లాల వద్ద ఆరబోయిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోనూ వర్షం కురిసింది. రాజీవ్ నగర్ శివారులో తాడి చెట్టుపై పిడుగుపడింది. తాడి చెట్టు మంటల్లో కాలిపోయింది. ఆకాశం నుంచి నిప్పులు కురిసినట్టుగా పిడుగు పడటంతో తాడి చెట్టు పూర్తిగా దగ్ధమైంది. అదేవిధంగా.. సంగారెడ్డి, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, నిర్మల్, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోనూ పలుచోట్ల వర్షాలు కురిశాయి. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కుత్బుల్లాపూర్ పరిసరాల్లో భారి వర్షం కురిసింది. దీంతో రహదారులపైకి వాన నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఔటర్ రింగ్ రోడ్ పరిసరాల్లోనూ భారీవర్షం పడింది. ఎల్బీ నగర్‌తో పాటు మీర్‌పేట్, కర్మాన్‌ఘాట్ పరిసర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మూసాపేట్, బాలానగర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల వర్షంతో పాటు వడగండ్లు కూడా కురిశాయి. అకస్మాత్తుగా కురిసిన వర్షం వల్ల ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా కూకట్‌పల్లి, ఎల్బీనగర్ ప్రధాన రోడ్లపై వాహనాలు నెమ్మదిగా కదిలాయి. భయంకరమైన వర్షం ఉరుములు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కుత్బుల్లాపూర్,జీడిమెట్ల, సుచిత్ర, కొంపల్లి, గండిమైసమ్మ, దుండిగల్, మల్లంపేట్, బహుదూర్‌పల్లి,సూరారం, చింతల్,షాపూర్ నగర్, గాజుల రామారం, సికింద్రాబాద్, కంటోన్మెంట్‌లో కురిసింది.

**ఈ నెల 26వరకు రాష్ట్రానికి వర్ష హెచ్చరిక**

రానున్న 5రోజుల పాటు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తాజాగా హెచ్చరించింది. ఉపరితల అవర్తనం, ద్రోణి, క్యుములో నింబస్ మేఘాల ప్రభావంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాలతోపాటు రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి జల్లులు కురిసేఅవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఏప్రిల్ 26వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసే అవకాశం ఉందని తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతోపాటు వడగళ్ల వర్షం కురుస్తాయని వాతావరణశాఖ ఆరెంజ్ అలెర్ట్ జారి చేసింది.కొమురంభీం ఆసిఫాబాద్, జగిత్యాల, రాజన్న సిరి సిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సిద్ధిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని తెలిపింది. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా పగటిపూట ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. ఆదిలాబాద్, జగిత్యాల, జోగులాంబ గద్వాల్, కామారెడ్డి, కరీంనగర్, కొమరంభీమ్, మహబూబ్ నగర్, మంచిర్యాల, మెదక్, నాగర్ కర్నూల్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి జిల్లాల్లో ఎండలు దంచికొట్టనున్నాయి.

## ఇస్లామాబాద్‌కు అమెరికా బృందం

### రెండో దఫా చర్చలకోసం.. స్టీవ్ విట్‌కాఫ్, జారేడ్ కుష్నర్ల పర్యటన

### డీల్‌కు రాకుంటే ఇక ఇరాన్‌లో విధ్వంసమే: ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్ 19:** ఇరాన్ అమెరికాలమధ్య జరిగే రెండో విడత శాంతిచర్చలకోసం తమ బృందం ఇస్లామాబాద్‌కు సోమవారం వెళుతున్నదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌ప్రకటించారు. ప్రత్యేక రాయబారులు స్టీవ్ విట్‌కాఫ్, తన అల్లుడు జారేడ్‌కుష్నర్‌లు ఇస్లామాబాద్‌కువెళుతున్నట్లు తెలిపారు. ట్రంప్ తన ట్రూత్ సోషల్‌మీడియాలో ఈ అంశాలనుప్రకటించారు. అంతేకాకుండా సహేతుకమైన, ఒప్పందానికి రాకుంటే ఈ సారి ప్రతి ఇంధన ప్లాంట్, ప్రతి బ్రిడ్జిని పేల్చివేస్తామని, గతంలో ఏ ఒక్క యుద్ధంలోను జరగనంత నష్టం ఇరాన్‌కు కలుగచేస్తామని కూడా హెచ్చరించారు.

అయితే అందుతున్న వార్తలనుబట్టి చూస్తే ఉపాధ్యక్షుడు జెడివాన్స్ కూడా ఇస్లామాబాద్‌కువెళుతున్నట్లు తెలుస్తోంది.అయితే ట్రంప్ ఈ జెడివాన్స్ పర్యటనను ధృవీకరించలేదు. రెండువారాల కాల్పుల విరమణ ప్రతిపాదన గడువు ముగియడంతో ఇపుడు రెండో విడత చర్చలకోసం అమెరికా సిద్ధం అవుతోంది. అయితే ఇరాన్‌వైపునుంచి పాకిస్తాన్‌కు రానున్న ప్రతినిధిబృందం వివరాలు వెల్లడికాలేదు. అలాగే ఇరాన్‌నుంచి కూడా అధికారిక ప్రకటన కూడా ఏదీ విడుదలకాలేదు. డీల్ కుదరని పక్షంలో ఏ దేశం చేయనంతగా నష్టం ఇరాన్‌కు అమెరికా కలుగచేస్తుందని ట్రంప్ మీడియాసమావేశంలోకూడా ప్రకటించారు. డీల్‌లో ఎక్కువ భాగం అంశాలతో ఇరాన్ ఇప్పటికే అంగీకరించిందని ట్రంప్ వెల్లడించారు. హర్మూజ్ జలసంధిని మూసివేసి ఇరాన్ కాల్పుల విరమణను ఉల్లంఘించిందని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

రోజుకు 500 మిలియన్‌డాలర్ల నష్టం ఇరాన్‌కు జలసంధి మూసివేతవల్ల ఎదురవుతోందని, అమెరికాకు ఎలాంటి నష్టంలేదని ప్రకటించారు. ఒప్పందానికి రాకుంటే నేనుఇక మంచివాడిగా ఉండబోనని ట్రంప్ వెల్లడించారు. ఇరాన్ ఒప్పందానికి వస్తే గడచిన 47 ఏళ్లలో ఇరాన్‌కు గత అమెరికా అధ్యక్షులు ఎవ్వరూ చేయనంతగా మద్దతు ఉంటుందని, ఇపుడు బంతి ఇరాన్‌కోర్టులోనే ఉందని ప్రకటించారు. ఈనెల 22వ తేదీతో రెండువారాల కాల్పుల విరమణ గడువు ముగుస్తుంది. మొదటి విడత జరిగిన చర్చలు ఫలప్రదం కాలేదు. దీనితో ట్రంప్ రెండువారాల గడువు ఇచ్చారు. సోమవారం రాత్రికి అమెరికా ప్రతినిధిబృందం పాకిస్తాన్ చేరుకుంటుంది. చర్చలు జరగనున్న పాకిస్తాన్ సెరెనా హోటల్ వద్ద భారీ ఎత్తున బలగాలు ఇప్పటికే మోహరించాయి.



పశ్చిమ బెంగాల్‌లోని ఝార్‌గ్రామ్‌లో ఆదివారం ఎన్నికల ప్రచారం సందర్భంగా ఓ షాపులో మరమరాలను కొని రుచి చూస్తున్న ప్రధాని మోడీ

## 'మద్దతు' మాటల్లోనే!

>> ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం కేంద్రం విధించిన పరిమితులకు మించిన పంటలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడంతోపాటు మొక్కజొన్న పంటను కూడా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని మంత్రి వివరించారు. ఇందుకోసం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తుందని, దీనివల్ల రాష్ట్రంపై అదనపు భారం పడుతోందని పేర్కొన్నారు.

ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న పంట మొత్తాన్ని సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం, కనీసం యాసంగి సీజన్‌లో అయినా కేంద్రం కొనుగోళ్లలో అనుమతులు ఇస్తుందని ఆశించినా ఎలాంటి స్పందన రాలేదని తెలిపారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వమే 200కి పైగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, 1,20,000 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసినట్లు చెప్పారు. మార్కెట్ ధర మద్దతు ధర కంటే రూ.700 తక్కువగా ఉండటంతో రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి కొనుగోళ్లు ఆరంభించినట్లు లేఖలో తెలిపారు. మొక్కజొన్న పంటను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నాఫెడ్ ద్వారా కొనుగోలుకు అనుమతులు ఇవ్వాలని, శనగ, పొద్దుతిరుగుడు పంట కొనుగోళ్లపై ఉన్న 25 శాతం పరిమితిని ఎత్తివేసి, పూర్తిగా కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినప్పటికి ఎలాంటి స్పందన లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పండించిన పంట మొత్తాన్ని కొనుగోలు చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు అందించాలని కోరారు. మద్ధతు ధరకు మార్కెట్ ధరకు భారీ వ్యత్యాసం ఉన్నప్పుడు కూడా పంటల కొనుగోళ్లకు రాష్ట్రాలకు మద్ధతు ఇవ్వకపోవడం ఏ రకంగా రైతులు అర్థం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి తుమ్మల ప్రశ్నించారు. రైతు ఆదాయం రెట్టింపు చేస్తామన్న మాటలు ఏమయ్యాయో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పండిన పంటలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకుండా, కేంద్ర పరిమితులు విధించడం తగదన్నారు. ముఖ్యంగా అధికంగా వరి ఉత్పత్తి అయినప్పటికీ, ధాన్యం సేకరణను ప్రతీ సంవత్సరం తగ్గించడం, దొడ్డు బియ్యం సేకరణ విషయంలో మాట మార్చడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సోయాబీన్, చిక్కుడు, వేరుశనగ, పెసలు, పొద్దుతిరుగుడు వంటి పంటల విషయంలో మొత్తం ఉత్పత్తిలో కేవలం 25 శాతం మాత్రమే కొనుగోలు చేస్తామని కేంద్రం పరిమితులు విధించడం వల్ల, మిగిలిన పంటను మద్దతు ధర చెల్లించి రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆయన చెప్పారు. దీనివల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. ధాన్యం కొనగోళ్లకు కేంద్ర ప్రభుత్వం ప్రతి యేటా తగ్గిస్తున్న లెవి అడ్డంకిగా మారుతుందని, పత్తి విషయంలో కొత్త పద్ధతి తీసుకురావాలని చూస్తుందని, వీటిని కూడా తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించడాన్ని మంత్రి గుర్తుచేశారు.

## భారీ పేలుడు

>>చేస్తున్నారు. క్షతగాత్రులను విరుధునగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. బాణసంచా యూనిట్ గోవందనల్లూరుకు చెందిన ముత్తు మాణిక్యం అనే వ్యక్తికి చెందినదిగా తెలుస్తోంది.బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో పలువురు ప్రాణాలు కోల్పోవడంపై ప్రధానమంత్రి మోడీ, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా, సిఎం స్టాలిన్ ఆదేశాల మేరకు మంత్రులు రామచంద్రన్, తంగమ్ తెన్నరసు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. బాధితుల కుటుంబాలను ఓదార్చారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఎన్నికల కోడ్ ఉన్నందున మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను ప్రకటించలేమని మంత్రులు తెలిపారు.

## 'ఇండి' కూటమి

>> అయితే పార్లమెంటులో ఈ బిల్లులు విఫలమైనప్పుడు కాంగ్రెస్, ఇండీ అలయెన్స్ పార్టీల నాయకులు దేశ ప్రయోజనాలను మరిచి, ఆ వైఫల్యాన్ని పండుగలా జరుపుకున్నారని వారి నవ్వులు, హగ్‌లు దేశాన్ని ఉత్తర దక్షిణంగా విభజించే కుట్రకు నిదర్శనమని మండిపడ్డారు. దక్షిణ భారతానికి న్యాయం చేసే ఉద్దేశంతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో మాట్లాడారన్నారు. ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచుతామని, కేవలం ఒక గంట సమయం ఇస్తే కొత్త బిల్లును తీసుకువస్తామని ప్రతిపాదించినప్పటికీ, కాంగ్రెస్ మరియు ఇండీ అలయన్స్ పార్టీలు దాన్ని తిరస్కరించాయని శోభా కరంద్లాజే ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తమ రాజకీయ లాభాల కోసం, భవిష్యత్తులో ప్రాంతీయ విభేదాలను మరింత పెంచేలా వారు వ్యవహరించారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో గత పదేళ్లుగా మహిళా సాధికారతకు పెద్దపీట వేశామని.. విద్య, స్కాలర్‌షిప్‌లు, బీమా పథకాలతో పాటు ముద్ర లోన్లలో 60 శాతం, ఎంఎస్ఎంఈ సబ్సిడీల్లో 53 శాతం మహిళలకే అందించామని పేర్కొన్నారు. అటల్ బిహారీ వాజపేయి స్వయం సహాయక సంఘాల ఆలోచనను విస్తరించి, నేడు 3 కోట్లకు పైగా మహిళలను "లఖ్ పతి దీదీలు"గా తీర్చిదిద్దిన ఘనత నరేంద్ర మోడీ ప్రభుత్వానిదేనని, మహిళ చేతిలో డబ్బు ఉంటే కుటుంబానికి, దేశానికి మేలు జరుగుతుందని ఆమె అన్నారు. దక్షిణ భారత రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళలలో సీట్లు పెంచే ప్రతిపాదనను అడ్డుకోవడం ద్వారా ఇండియా కూటమి దక్షిణ భారతాన్ని మోసం చేసిందన్నారు. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) వల్ల తెలంగాణలో ఎంపి సీట్లు 17 నుండి 26కు, ఆంధ్రప్రదేశ్‌లో 25 నుండి 38కి పెరుగుతాయని, ఈ ప్రయోజనాన్ని ఇండీ కూటమి అడ్డుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకత్వం గురించి మాట్లాడుతూ, ఆ పార్టీలో కేవలం "ఖాన్దాన్" (వారసత్వ) రాజకీయాలే నడుస్తాయని, జార్కిహోళి కుమారైకు టికెట్ ఇవ్వడాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో తనను తాను "జాదూగర్" (మాంత్రికుడు) అని సంబోధించుకుంటూ అపరిపక్వంగా ప్రవర్తించారని విమర్శించారు. గత ఎన్నికల సమయంలో మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఆసరా పెన్షన్ల పెంపు, పెళ్లైన ఆడబిడ్డలకు తులం బంగారం వంటి ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుని మోసం చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. చివరగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం హైకమాండ్‌ను సంతోషపెట్టడానికే ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, హామీల అమలులో విఫలమై రాష్ట్ర ప్రజలను "పిక్ పాకెట్" చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ తీరు పూర్తిగా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని విమర్శించారు. మహిళలకు స్వరం ఉందని, వారికి చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించి, నిర్ణయాత్మక ప్రక్రియలో భాగస్వాములను చేసినప్పుడే సమాజానికి న్యాయం జరుగుతుందని, మహిళలను వంచించిన కాంగ్రెస్, ఇండీ అలయెన్స్ పార్టీలు దేశ ప్రజల ఆగ్రహం నుంచి తప్పించుకోలేరని కేంద్రమంత్రి శోభా కరంద్లాజే హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు, జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపి డికె అరుణ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి విజయలక్ష్మి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.మేకల శిల్పారెడ్డి , మీడియా ప్యానలిస్ట్ డా.ప్రభాగౌడ్ , తదితరులు పాల్గొన్నారు.

# అదుపు తప్పిన డ్రోన్

## పరిగి ఎమ్మెల్యేకు గాయాలు

**హైదరాబాద్,ఏప్రిల్ 19,ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో ఆదివారం డ్రోన్ అదుపు తప్పి పరిగి ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డివైపు దూసుకొని రావడమే కాకుండా ఆయన కాలికి తీవ్రగాయం చేసింది. కల్కచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతుల కోసం కొనుగోలు చేసిన డ్రోన్ ప్రదర్శన నిర్వహిస్తుండగా,డ్రోన్ గాలిలోకి ఎగిరిన కొద్దిసేపటికే సాంకేతిక లోపంతో ఆపరేటర్ నియంత్రణ కోల్పోవడంతో పలువురికి గాయాలైనాయి.అది అనూహ్యంగా అదుపు తప్పి ఎమ్మెల్యే బృందంపైకి దూసుకు వచ్చింది. రాంపూర్ సర్పంచ్ తిరుపతయ్యకు చేతి బొటనవేలు తెగిపోయింది. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి డ్రోన్ రెక్కలు బలంగా తగలడంతో ఎమ్మెల్యే కాలికి గాయమైంది. స్థానిక నేత తిరుమలపూర్ వెంకటయ్య గౌడ్ కాలికి కూడా దెబ్బతగిలి రక్తస్రావమైంది.గాయపడిన ఎమ్మెల్యేను ఆయన అనుచరగణంకు స్థానిక ప్రభుత్వఆసుపత్రిలో ప్రథమచికిత్స జరిపి మెరుగైన చికిత్సకు సిఫార్సుచేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యే సహా మిగిలిన ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. సాంకేతిక లోపం వల్ల జరిగిన ఈ అపశృతితో ఒక్కసారిగా కుల్కచర్లలో కలకలం రేగింది.

# అంగన్వాడీల్లో తగ్గిన హాజరు శాతం

## మే 1 నుంచి ఇంటికే సరకులు

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి ఎండలు భగ్గు మంటూ మండుతున్నాయి. దీంతో అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల హాజరు శాతం తగ్గింది. తప్పనసరి పరిస్థితుల్లో బాలింతలు, గర్భిణిలు తప్ప అంగన్వాడీ కేంద్రాలకు ఎవ్వరూ రావడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర సర్కార్ లబ్ధిదారులకు అంగన్ వాడీ సరులును ఇంటికే పంపించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మే 1 నుంచి 31వ తేది వరకు ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ప్రతీ రోజు ఉడకబెట్టిన గుడ్లు, బాలామృతం, పాలు, మురుకులు, అన్నం పప్పుతో కూడిన పోషకాహారం అందిస్తారు. ప్రస్తుతం ఎండలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ప్రతి మండలంలో 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో మే ఒకటి నుంచి అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వగా, పోషకాహార లోపం ఉండకూడదనే ఉద్దేశంతో ఇంటికే సరుకులు అందించనున్నారు. 3 నుంచి 5 ఏళ్ల పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు 30 గుడ్లు, ఏడు నెలల నుంచి మూడేళ్ల వారికి 16 గుడ్లు, ఆరు లీటర్ల పాలు, మంచి నూనె, కందిపప్పు, బియ్యం, ఇతర సరుకులను ఇంటింటికీ అందజేయనున్నారు. ఈ విధానం వర్షాకాల ప్రారంభమయ్యే జూన్ 1 నుంచి యథావిధిగా కేంద్రాలను ప్రారంభించడమే కాకుండా సరుకులన్నింటినీ అప్పటి నుండి అంగన్వాడీల్లోనే అందచేయాలని నిర్ణయించింది.

# రోడ్డు ప్రమాదంలో తల్లి, శిశువు మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు


**అడ్డాకుల, ఏప్రిల్ 19 ప్రభాత వార్త :** అడ్డాకుల మండల పరిధిలోని హెచ్ పి పెట్రోల్ బంక్ సమీపాన జాతీయ రహదారి 44 ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని వెనకనుంచి కారు ఢీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న తల్లి, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. ప్రమాద ఘటనపై స్థానిక ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం కంచిరావుపల్లి చెందిన ప్రకాష్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో దైవదర్శనం నిమిత్తం యాదగిరిగుట్టకు ఆదివారం ఉదయం బయలుదేరినట్టు తెలిపారు. అడ్డాకుల శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపాన జాతీయ రహదారిపై తమిళనాడు రాష్ట్రానికి చెందిన అరటి పండ్ల లోడుతో ఆగిఉన్న లారీని వెనకనుంచి ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందన్నారు. కారులో ప్రయాణిస్తున్న నందినితో పాటు నాలుగు నెలల కుమారుడు కన్నయ్య అక్కడికక్కడే మృతిచెందగా, గాయపడిన భర్త ప్రకాష్ రెడ్డిని వనపర్తి ప్రభుత్వఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేపట్టారు.

# ఛత్తీస్‌గఢ్‌లో చుక్కల జింకను కుక్కల దాడి నుంచి కాపాడి వండుకు తిన్న గ్రామస్తులు

## ఐదుగురి అరెస్టు.. జింక మాంసం స్వాధీనం

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** ఛత్తీస్ఘఢ్ రాష్ట్రంలో ఓ వన్యప్రాణి గ్రామస్తులకు ఆహారంగా మారిపోయింది. అడవిలో దారితప్పి దాహంతో గ్రామంలో వచ్చిన ఓ చుక్కల జింకను కుక్కలు వెంబడించగా కుక్కలను తరిమికొట్టి గాయాల పాలైన ఆ మూగజీవిని రక్షించిన గ్రామస్తులు ఆ తరువాత దానిని శుబ్బరంగా వండుకు తిన్నారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా దీనిపై వెంటనే స్పందించిన అటవీ శాఖ అధికారులు చుక్కల జింకను వండుకుతిన్న గ్రామస్తుల ఇళ్లపై దాడిచేసి ఐదుగురిని అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద మిగిలిపోయిన పది కిలోల జింక మాంసాన్ని సా ్వధీనం చేసుకున్నారు. వివరాలు ఇలావున్నాయి. రాయ్‌గడ్ జిల్లాలోని దెలారి అటవీ ప్రాంతం నుంచి ఓ చుక్కల జింక నాలుగు రోజుల క్రితం దాహంతో దారి తప్పి గ్రామంలోకి రాగా కొన్ని కుక్కలు దానిని వెంబడించాయి. దీంతో గ్రామస్తులు దీనిని గమనించి కుక్కలను తరిమికొట్టి వాటి బారి నుంచి జింకను కాపాడారు. అయితే అప్పటికే గాయాలపాలైన జింకను వారు అటవీ శాఖకు అప్పగించే బదులు దానిని అందరు కలిసి కోసుకుని త లా ఇంత మాంసం పంచుకుని వండుకుని తిన్నారు. అయితే ఈ గ్రామంలో కొందరి ఇళ్లలో జింక మాంసం వండుకున్నట్లు సమాచారం అందడం తో అటవీ శాఖ అధికారులు పోలీసులతో కలిసి శనివారం నాడు దాడిచేశారు. ఐదుగురి ఇళ్లలో జింక మాంసం వంటకం జరిగిందని నిర్ధారణ అయా ్యక దీనికి సంబంధించి ఆత్మారాం రాధియా, మయారాం రాధియా, హరిచరణ్ సాహో, తరుణ్ అగరియా, మోతిలాల్ అగరియాలను అటవీ శాఖ అధికారులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి పది కిలోల జింక మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 కింద కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రాయగడ్ జైలుకు తరలించారు.

# హాల్ టికెట్ ఇవ్వలేదని బిటెక్ విద్యార్థి ఆత్మహత్య



ప్రణీత్(ఫైల్)

**హాయత్‌నగర్, ఏప్రిల్ 19 ప్రభాత వార్త :** హాల్ టికెట్ ఇవ్వలేదని మనస్థాపంతో ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన హాయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. హాయత్ నగర్ ప్రాంతం రాఘవేంద్ర కాలనీలో నివాసముండే మయదారి రమేష్ కుమారుడు మయదారి ప్రణీత్ (21) శ్రీ ఇందు కళాశాలలో బీ.టెక్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలలో ప్రణీత్ హాజరు తక్కువగా ఉందని కారణం చూపుతూ ఏటి కృష్ణమూర్తి హాల్ టికెట్ జారీ చేయడానికి 5వేల రూపా యలు డిమాండ్ చేసాడు. తన ఆరోగ్య పరిస్థితి బాగోలేదని వివరించినప్పటికీ ప్రణీత్‌ను ఏటి అందరి ముందే అవమానించాడు. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రణీత్ 18నసాయంత్రం 6 గంటలకు తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుం బ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# 23న విసిలతో గవర్నర్ ఎస్‌పి శుక్లా సమావేశం

## వర్సిటీల్లో నియామకాలపై ప్రధానంగా చర్చ ఉండే అవకాశం



**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 19:** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఉపకులపతుల(వీసీ)తో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ నెల 23న సమావేశం కానున్నారు. తాను రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత యూనివర్సిటీ వీసీలతో ఇప్పటి వరకు మాట్లాడకపోవడంతో.. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీలతో సమావేశం కావాలని నిర్ణయించారు. రాష్ట్ర యూనివర్సిటీలకు గవర్నర్ ఛాన్సలర్‌గా వ్యవహరించనున్న సంగతి తెలిసిందే. కొద్ది రోజుల క్రితం తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి గవర్నర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యారంగంపై పలు అంశాలను గవర్నర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా వీసీలతో సమావేశం ఏర్పాటు చేయాలని ఛైర్మన్‌కి సూచించారు. ఆ తరువాత లోక్‌భవన్ నుంచి ఈ నెల 23న వీసీలతో సమావేశం ఏర్పాటు చేయాలని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌కి సమాచారం అందించారు. దీంతో రాష్ట్రంలోని 11 యూనివర్సిటీల రిజిస్ట్రార్లకు ఇదే సమాచారాన్ని చేరవేశారు. ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, పాలమూరు, తెలంగాణ, మహాత్మాగాంధీ, జేఎన్‌టియు, జేఎన్ఏఎఫ్ఏయు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వీసీలతో సమావేశం కావాలని గవర్నర్ భావిస్తున్నారని.. కాబట్టి వీసీలు అందరూ హాజరయ్యేలా చూడాలని కోరుతూ యూనివర్సిటీ రిజిస్ట్రార్లకు సమాచారం పంపించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీకి సంబంధించిన అంశాలపై గవర్నర్‌కు వివరించే అవకాశం ఉంది. మూడు రోజుల క్రితమే 5 యూనివర్సిటీలకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఈసీ)లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీసీల సమావేశంలో ప్రధానంగా యూనివర్సిటీల్లో నియామకాలతోపాటు ఉన్నత విద్యా సంస్థల్లో డ్రగ్స్ నియంత్రణ, ర్యాగింగ్ నియంత్రణ వంటి అంశాలపై గవర్నర్ ప్రధానంగా చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# రాష్ట్రంలో విద్యుత్ పీక్ లోడ్

**తలసరి వినియోగం 2,508 యూనిట్లు**

**జాతీయ సగటులో 70శాతం పెరుగుదల**

**గత ఆర్థికంలో 23,208 మెగావాట్ల నమోదు**

## రాష్ట్రంలో పరిశ్రమలు, ఐటీ విస్తరణతో భారీ డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** పరిశ్రమలు, ఐటీ తదితర రంగాల విస్తరణ కారణంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. తెలంగాణలో సగటు విద్యుత్ వినియోగం జాతీయ సగటుతో పోలిస్తే 70 శాతం పెరుగుదల నమోదైంది. దీంతో గరిష్ట విద్యుత్ వినియోగం (పీక్ లోడ్) తరచుగా అధికారిక అంచనాలను మించిపోతోంది. రాష్ట్ర విద్యుత్ శాఖ గణాంకాల ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ తలసరి విద్యుత్ వినియోగం 2,508 యూనిట్లుగా నమోదైంది. ఇది జాతీయ సగటు కంటే సుమారు 70 శాతం అధికం. జాతీయ స్థాయిలో, అదే ఆర్థికంలో వినియోగం 1,538 యూనిట్లుగా (కిలోవాట్‌గంటలు) ఉంది. రాష్ట్రానికి సంబంధించిన అది జాతీయ సగటు కంటే గణనీయంగా ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక గత ఏడాది 20,191 మెగావాట్లుగా ఉన్న రాష్ట్ర ఒప్పంద విద్యుత్ సామర్థ్యం 2024-25కు 20,844 మెగావాట్లుగా ఉంది. అది పెరుగుతూ 2025-26 సంవత్సరానికి 23,208 మెగావాట్లకు పెరిగింది. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పటి 7,778 మెగావాట్లతో పోలిస్తే ఇది మూడు రెట్లకు పైగా పెరుగుదలను సూచిస్తుంది. ఈ ఏడాది మార్చి 13న గ్రిడ్ 18,228 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌ను నమోదు చేయగా, అదే రోజు వినియోగం 34,108 మిలియన్ యూనిట్లకు చేరింది. గత తొమ్మిదేళ్లుగా టీజీ ట్రాన్స్‌కో ట్రాన్స్‌మిషన్ లభ్యత 99.98 శాతంగా కొనసాగుతోంది. ఇది విద్యుత్ అంతరాయం చాలా తక్కువగా ఉండటాన్ని, విద్యుత్ ప్రవాహం స్థిరంగా ఉండటాన్ని సూచిస్తుంది. గత మూడు ఆర్థిక సంవత్సరాలుగా జాతీయ ట్రాన్స్‌మిషన్ లభ్యత కూడా 99 శాతానికి పైగానే ఉంది. ట్రాన్స్‌కో యొక్క క్రెడిట్ రేటింగ్ గణనీయమైన క్రెడిట్ రిస్క్ తక్కువ క్రెడిట్ రిస్క్‌కి మెరుగుపడింది. ఇది మెరుగైన ఆర్థిక స్థితిని ప్రతిబింబించడంతో పాటు, రుణ వ్యయాలలో 0.25 శాతం తగ్గింపునకు వీలు కల్పించింది. అలాగే 2022-23లో 2.52 శాతం, 2023-24లో 2.43 శాతంగా ఉన్న ప్రసార నష్టాలు 2024-25 నాటికి 2.19 శాతానికి తగ్గాయి. కొత్త 400 కిలోవాట్, 220 కిలోవాట్ సబ్‌స్టేషన్లతో సహా అదనపు హై టెన్షన్ నెట్‌వర్క్‌లో పెట్టుబడులు పెట్టడం, వోల్టేజ్ స్థిరత్వాన్ని మెరుగుపరచడానికి, సాంకేతిక నష్టాలను తగ్గించడానికి కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటు చేయడం వల్లే ఈ తగ్గుదల సాధ్యమైందని అధికారులు తెలిపారు.

# బాలికలు, యువతులను మోసగిస్తున్న ఆ‘జాద్మ’ అరెస్ట్

## బాలిక నుంచి రూ. 9 లక్షలు, మరో యువతి నుంచి బంగారం వసూలు

## పోక్సో కింద అరెస్ట్ చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు



**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** వలపు వల విసిరి ప్రేమ పేరుతో ముగ్గులోకి దించి మోసం, లైంగిక దాడి, బెదిరింపులు, డబ్బు దోపిడికి పాల్పడే ఒక యువకుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. 2024 జూలైలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కొడూరి చంద్రశేఖర్ ఆజాద్ అలియాస్ అర్జున్ (28)కి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఒక బాలిక(15) పరిచయమైంది. ప్రేమ పేరుతో బాలికకు అతను దగ్గరయ్యాడు. బాలికకు దగ్గరవ్వడంతో విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అయినప్పటికి ఆజాద్ మళ్లీ బాలికను మాయమాటలు చెప్పి ప్రేమలోకి దించాడు. అతని మాయమాటలు నమ్మిన బాలిక కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇంటి డ్రైవర్ కృష్ణ, అతని భార్య సరస్వతి ఫోన్లను ఉపయోగించి ఆజాద్‌కు దగ్గరైంది. దీనిని అదునుగా భావించిన సరస్వతి వ్యవహారాన్ని తల్లిదండ్రులకు తెలియజేస్తానని బెదిరించడంతో భయపడిన బాలిక ఇంట్లో రూ. 9లక్షలు దొంగతనానికి పాల్పడి ఆమెకు అందజేసింది. దీనికితోడు ఆజాద్ సైతం వ్యక్తిగత అవసరాలు, స్టార్టప్ కంపెనీ ఏర్పాటు పేరుతో దాదాపు రూ. 13.11 లక్షలు బాలిక నుంచి తీసుకున్నాడు. బాలిక దగ్గరవ్వడంతో బాలికపై పలు మార్లు లైంగిక దాడికి సైతం పాల్పడ్డాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు పోక్సో కింద కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఇదే తరహాలో మరో యువతిని మోసగించాడు. గుంటూరుకు చెందిన ఒక యువతికి తన స్నేహితుడి ద్వారా చంద్రశేఖర అజాద్ పరిచయమయ్యాడు. పరిచయం కాస్త ప్రేమగా మారడంతో యువతి గతేడాది జూన్‌లో నగరానికి వచ్చింది. కళాశాల ప్రవేశం కోసం వచ్చిన యువతిని ఆజాద్ నేరుగా ఒక హోటల్‌కు తీసుకెళ్లాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అలాగే గుంటూరులో, కోకాపేటలోని మరో క్లబ్‌హౌజ్‌లోనూ ఇలానే నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఏడాది మార్చిలో మరో అమ్మాయితో ఆజాద్ ఉన్నట్లు గుర్తించిన యువతి అతన్ని నిలదీసింది. మాయమాటలతో ఆమెను బురిడి కొట్టించి నమ్మించి ఆమె వద్ద 5 గ్రాముల బంగారు గొలుసు తీసుకున్నాడు. కొద్ది రోజులకే మరో యువతితో కనిపించడంతో యువతి అతనిపై ఫిర్యాదు చేసింది. దీంతో జీరో ఎఫ్ఐఆర్‌గా కేసు నమోదు చేసి నార్సింగి ఠాణాకు బదిలీ చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకొన్న జూబ్లీహిల్స్ పోలీసులు అతన్ని విచారించారు. దాదాపు 12 మంది యువతులు, బాలికలను ఇలా ప్రేమ పేరుతో మోసగించి బెదిరింపులకు పాల్పడి, డబ్బు వసూలుకు పాల్పడినట్లు తెలిపారు. బెదిరింపులకు పాల్పడి రూ. 9 లక్షలు వసూలు చేసిన సరస్వతిపై సైతం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పోలీసు, రవాణా శాఖల్లో కదలికలు తెచ్చిన అరైవ్ అలైవ్

## రోడ్డు ప్రమాదాల నివారణకు ఇక నిరంతర కార్యక్రమాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ వారం రోజుల పాటు చేబట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమ ం పోలీసు, రవాణా విభాగాల్లో కదలికలు తెచ్చాయి. డిజిపిగా గత ఏడాది అక్టోబర్ నెలలో శివధర్ రెడ్డి బాధ్యతలు చేబట్టిన తరువాత రోడ్డు ప్రమా దాల నివారణకు కొత్తగా అరైవ్ అలైవ్ పేరిట కార్యక్రమం చేబట్టారు. ముందుగా పోలీసు శాఖ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో దీనిపై ప్రచారం చే బట్టగా ఇందులో రవాణా విభాగం పాల్గొంది. అనంతరం ఇందులో విద్యార్థులను, ఆయా ప్రాంతాలలోని ప్రముఖులను భాగస్వామ్యం చేయడంతో ఈ కార్యక్రమం మరింత వేగం పుంజుకుంది. ఈ ఏడాది జనవరి 12వ తేదీన అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో సిఎం రేవంత్ రెడిడన అ ధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు దేశ వా ్యప్తంగా అనేక కుటుంబాలను చిన్నాభిన్నం చేయడం తో పాటు జిడిపిలో మూడు శాతం నష్టాన్ని చేకూరుస్తుందని తెలిపారు. రాష్ట్రం వరకు వస్తే వీటిని కచ్చితంగా నివారించాల్సిందేనని, ఈ విషయం లో పోలీసు, రవాణా శాఖలు భాగస్వామ్యం అయితే సరిపోదని, ప్రజలు తమవంతు సహాయం అందించాలని ఆయన కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ చేబట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం మరింత వేగంగా సాగాలని కోరారు. దీని తరువాత ఈ నెల 10వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం పోలీసు, రవాణా విభాగాలు సంయుక్తంగా చేబట్టాయి. ఇందులో అన్ని విభాగాలు, అన్ని శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేశారు. మంత్రులు మొదలుకొని ఎంఎల్ఎలు, ఇతర ప్రజా ప్రతినిధులంతా ఇందులో పాల్గొని రోడ్డు ప్రమాదాల వల్ల జరు గుతున్న నష్టాలను ప్రజలకు వివరించి దీనిని నివారించాల్సిన అవశ్యకతను వెల్లడించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో అధికారులు విద్యార్థులపై ఎ క్కువ దృష్టి సారించారు. విద్యార్థి దశ నుంచే రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్‌పై అవగాహన కలిగించడం వల్ల వారు భవిష్యత్తులో తప్పిదాలకు దూరంగా వుండే వీలుంటుందని అధికారులు ఈ కార్యక్రమంలో విద్యార్థులు భారీగా హాజరయ్యేలా చూశారు. ఈ కార్యక్రమంలో ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనడం. స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ కార్యక్రమంలో ఇంత భారీగా హాజరవడం ఇదే మొదటిసారి అని చెప్పాలి. అరైవ్ అలైవ్ కార్యక్రమం ముగియడంతో ఇకముందు రోడ్డు ప్రమాదాల నివారణ విష యంలో పోలీసు, రవాణా విభాగాలు కఠినంగా వుండాలని నిర్ణయించాయి. వాహనదారులు తప్పిదాలకు పాల్పడకుండా చూడడం, డ్రంకన్ డ్రైవ్‌ను నిరంతరం నిర్వహిం చడం, మద్యం తాగి పట్టుబడ్డ వాహనదారులకు కఠిన శిక్షలు వేయించడం వంటివి చేయాలని రెండు విభాగాలు నిర్ణయించాయి. దీనివల్ల చాలావర కు రోడ్డు ప్రమాదాలు తగ్గుతామని రెండు విభాగాల అధికారులు చెబుతున్నారు. ట్రాఫిక్ నిబంధనల అమలుకు ఇకముందు నిరంతరం దాడులు ని ర్వహించాలని అధికారులు నిర్ణయించారు.

# మే 4 నుండి హజ్ యాత్ర

## హైదరాబాద్ నుండి 9,660 మంది యాత్రికులు

## యుద్ధ పరిణామాలపై ఎప్పటికప్పుడు సమాచారం

### హజ్ కమిటీ ఛైర్మన్ గులాం అఫ్జల్

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** హజ్ యాత్రకు తెలంగాణ హజ్ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. మే 4 నుండి హజ్ యాత్ర ప్రారంభం కానుంది. తెలంగాణ నుంచి 6,660 మంది, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి మరో 2,283 మందితో సహా మొత్తం 9,660 మంది యాత్రికులు హైదరాబాద్ నుంచి సౌదీ అరేబియాలోని జెద్దాకు విమానంలో వెళ్లనున్నారు. తెలంగాణ హజ్ కమిటీ ఛైర్మన్ సయ్యద్ గులాం అఫ్జల్ బియాబానీ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన యాత్రికులలో మహారాష్ట్ర (553), అండమాన్ నికోబార్ (1), అస్సాం (1), బీహార్ (26), ఛత్తీస్‌గఢ్ (42), జార్ఖండ్ (2), మధ్యప్రదేశ్ (4), ఒడిశా (96), తమిళనాడు (2), ఉత్తరప్రదేశ్ (3), మరియు పశ్చిమ బెంగాల్ (15) ఉన్నారని వివరించారు. తెలంగాణకు 11,557 ఆన్‌లైన్ దరఖాస్తులు అందగా, సుమారు 2,500 మంది వెయిటింగ్ జాబితాలో ఉన్నారని చెప్పారు. తెలంగాణ నుండి మరిన్ని ధరఖాస్తులు వచ్చే వీలుందన్నారు. కాగా ఈ సంవత్సరం హజ్ కమిటీ 25 నుండి 30 రోజుల చిన్న ప్యాకేజీని ప్రవేశపెట్టిందని తెలియచేశారు. యాత్రికులు మక్కాలో 20 నుండి 25 రోజులు, మదీనాలో 4 నుండి 5 రోజులు ఉండనున్నారని వెల్లడించారు. అందుకు అనుగుణంగా విమానాలు మే 19 వ తేదీ నుండి మే 21 మధ్య నడుస్తాయన్నారు. మదీనా నుండి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణాలు జూన్ 13వ తేదీ నుండి జూన్ 18 మధ్య ఉంటాయని పేర్కొన్నారు. అలాగే హజ్‌యాత్రికుల కోసం ఆహారం, రవాణా, వసతిని పర్యవేక్షించేందుకు ఉపకమిటీలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

## హైదరాబాద్‌లో కొనసాగుతున్న డ్రంకన్ డ్రైవ్ దాడులు

# 440 మంది మందుబాబుల పట్టివేత

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** జంటనగరాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రుల్లో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 440 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 376 మంది ద్విచక్ర వాహనదారులు, 21 మంది ఆటో డ్రైవర్లు, 43 మంది కార్లతో పాటు భారీ వాహనాల డ్రైవర్లు వున్నారు. పట్టుబ డ్డ వారిలో 91 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 200 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 79 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 31 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 18 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, 12 మంది 251 ను ంచి 300 పాయింట్ల వరకు, తొమ్మిది మంది 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరిని అరెస్టు చేసిన తరువా త వారి వా హనాలు జప్తు చేసి, కేసులు నమోదు చేశాక సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ మీడియాకు తెలిపారు. జంట న గరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికడతామని ఆయన వెల్లడించారు.

# సీతారామ ప్రాజెక్టుకు నీళ్లొదిలిన సిఎం రేవంత్

## అభివృద్ధిని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం: హరీష్ రావు



ఆదివారం ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న హరీష్‌రావు

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** రేవంత్ రెడ్డి పోవాలి.. కెసిఆర్ రావాలి అని తెలంగాణ ప్రజలందరూ కోరుకుంటు న్నారని రానున్న ఎన్నికల్లో అదే జరుగుతుందని రాష్ట్ర మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఆదివారం రాత్రి ఖమ్మంలోని మమత ఆసుపత్రి ఆవరణంలో జరిగిన ఓ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉచిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను వంచించిందని,ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్క హామీని అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఖమ్మం జిల్లాకు వరప్రదాయిని,6.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో కేసీఆర్ నిర్మించిన సీతారామ ప్రాజెక్టును రేవంత్ రెడ్డి పక్కన పడేశారని, దీనివలన ఆంధ్రకు నీళ్లను తరలించే కుట్ర జరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణకు ముఖ్యమంత్రినా లేక ఆంధ్రప్రదేశ్‌కు ప్రయోజనం కలిగించే వారా అనేది ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి ఇంట్లో ఉదయం పూట టిఫిన్‌చేసే రేవంత్ రెడ్డి ఏపార్టీ ప్రతినిధి అని హరీష్ రావు ప్రశ్నించారు. ఢిల్లీలో ఒకలా, రాష్ట్రంలో మరోలా, పక్క రాష్ట్రం వారితో మరోలా వ్యవహ రించే రేవంత్ రెడ్డిని తీరు ఏమిటో తెలంగాణ ప్రజలు తెలుసుకుంటున్నారని హరీష్ రావు వెల్లడించారు. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఒకలా, పొంగులేటి మరోలా మాట్లాడారని,అసలు విషయాలను తాము ప్రజల ముందు ఉంచితే అసెంబ్లీ నుండి తమను సస్పెండ్ చేశారని హరీష్ రావు వెల్లడించారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు మల్లు బట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డిలు ఏరోజైనా ఖమ్మం జిల్లా అభివృద్ధిపై ఒకే టేబుల్ మీద కూర్చొని మాట్లాడిన సందర్భం ఉందా అని ప్రశ్నించారు. ఒక మంత్రి కమీషన్ల కోసం పనిచేస్తున్నాడని, మరో మంత్రి భూములు ఆక్రమించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాడని, మరో మంత్రి కమీషన్లు దండుకుంటున్నాడని హరీష్‌రావు విమర్శించారు. ఖమ్మంలో వెలుగుమట్లలో 800 ఇండ్లను కూల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 300 మందికే పట్టాలి ఇచ్చిందనివారిలో అత్యధికమంది కాంగ్రెస్ కార్తలే కార్య కర్తలే ఉన్నారన్నారు. మిగిలిన 500మందికి ఎందుకు పట్టాలు ఇవ్వలేదని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడిఖమ్మం జిల్లాలోని పదికిపది సీట్లు బిఆర్ఎస్ గెలుచుకునేలా కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. అదేవిధంగా ఈ సభలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర,మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధు సూదన్ మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తదితరులు ప్రసంగించారు.ఈ సభలో మాజీ ఎమ్మెల్యేలు మచ్చ నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు కురాకుల నాగభూషణం, బొమ్మెర రామ్మూర్తి, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అభినవ గోబెల్స్ సిఎం రేవంత్ రెడ్డి

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** పార్లమెంట్‌లో బిల్లును అడ్డుకుని దక్షిణాదికి తీరని ద్రోహం చేశారని, అబద్దాలు, మోసాలనే నమ్ముకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినవ గోబెల్స్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. అబద్దాలు, మోసాలు చేసే వారినే ప్రజలు నమ్ముతారని బహిరంగంగా ప్రకటించిన రేవంత్ రెడ్డి ఆ అబద్దాల పునాదులపైనే ముఖ్యమంత్రి అయ్యారని విమర్శించారు. 100 రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని, రాష్ట్రంలోని ప్రతి మహిళలకు ప్రతినెలా రూ.2500లు చెల్లిస్తామని, తులం బంగారం, స్కూటీ ఇస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక తూట్లు పొడిచారని మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం మీడియాకు ఒక ప్రకటనను విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిజం చెబితే తల వెయ్యి ముక్కలవుతుందనే శాపం ఉన్నట్లుంది. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తరహాలోనే దొంగ హామీలు, పచ్చి అబద్దాలతో ప్రజలను మభ్యపెడుతూ పాలనను కొనసాగిస్తున్నారు. నిజాయితీగా పనిచేసే నాయకులపై బురద చల్లడం ఆయనకు అలవాటుగా మారింది. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లు ఆమోదం ద్వారా చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రతి రాష్ట్రానికి 50 శాతం ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెంచి దక్షిణాదికి న్యాయం చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం చిత్తశుద్ధితో పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెడితే ఇండీ కూటమి నేతలు బిల్లును అడ్డుకున్నారు. ఈ విషయంలో లేనిపోని విష ప్రచారం చేసి మహిళా బిల్లును అడ్డుకోవడంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. డీలిమిటేషన్‌తో దక్షిణాదికి నష్టం జరగబోతోందని తప్పుడు ప్రచారాలకు తెరదీసి ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెరగకుండా కుట్రలు చేశారు. జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే దక్షిణాదికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నది వాస్తవం. దీనిని దృష్టిలో ఉంచుకునే మోడీ ప్రభుత్వం ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచడం ద్వారా దక్షిణాదికి మేలు చేయాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్ణయించి రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెడితే, ఇండీ కూటమి పేరుతో అడ్డుకున్న కాంగ్రెస్ నేతలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. ఈ బిల్లును అడ్డుకోవడం ద్వారా రేవంత్ రెడ్డితోపాటు తమిళనాడు సీఎం స్టాలిన్ సహా ఇండీ కూటమి నేతలు దక్షిణాదికి ఉన్న అవకాశాలకు గండికొట్టారు. దక్షిణాదికి తీరని నష్టం చేశారు. ముఖ్యంగా కుటిల రాజకీయాలతో మహిళల కలలను కల్లలు చేశారు. మహిళా బిల్లును అడ్డుకుని ఏదో సాధించామని సంబురాలు చేసుకుంటున్నారు. తెలంగాణ మహిళలతోపాటు దేశంలోని 70 కోట్ల మహిళలెవరూ ఇండీ కూటమి చేసిన అవమానాన్ని ఎన్నటికీ మర్చిపోరు. అతి త్వరలోనే రేవంత్ రెడ్డిసహా



ఇండీ కూటమి నేతలు తగిన మూల్యం చెల్లించుకోవడం ఖాయం. మహిళలంతా ఏకమై రేవంత్ రెడ్డి సర్కార్‌ను గద్దె దించడం తథ్యం. కాంగ్రెస్ చేసిన మోసాలను తెలంగాణలోని గ్రామగ్రామానికి తీసుకెళ్లేందుకు తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు ఆధ్వర్యంలోని పార్టీ నాయకత్వం సిద్ధమవుతుందన్నారు.

వార్త

ఆనందం అనేది ఎక్కడి నుంచో మనస్సులోకి రాదు.
మనస్సులోనే పుట్టి వికసించి బయటకు వస్తుంది.
అది మన చేతుల్లోనే ఉంది.

న- ఎమర్సన్

# ఇంకా అందని ద్రాక్షేనా?

భారత ప్రజాస్వామ్య చరిత్రలో నేడు ఒక చిత్ర విచిత్రమైన అధ్యాయం నమోదైంది. మూడు దశాబ్దాలుగా అనేక మలుపులు తిరిగినమహిళా రిజర్వేషన్ బిల్లు మరోసారి భంగపాటుకు గురైంది. ఈసారి ఈ బిల్లుపై మూకుమ్మడి సానుకూలత ఉన్నా విశ్వాసంలో వీగిపోయింది. ఈ బిల్లును డీలిమిటేషన్ బిల్లుతో ముడిపెట్టినందునే శుక్రవారం నాటి సభలో తగిన ఓట్లు పడలేదు. విడివిడిగా ప్రవేశపెట్టి ఉంటే దేని జాతకం ఏమిటో విడివిడిగా తేలిపోయేది. మోడీసర్కారు హయాంలో ఓ బిల్లు సభలో వీగిపోవడం ఇదేతొలిసారి. మహిళా బిల్లు పట్ల ఆది నుంచీ సానుకూల వైఖరి కన బరుస్తున్న కాంగ్రెస్ తదితర పక్షాలు మద్దతు పలికి ఉండేవారు. అదే విషయం కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ వంటి అగ్ర నేతలు ముందుగానే చెప్పినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ , కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా వంటి నేతలు పెడచెవిన పెట్టడంతో విపక్షాలు తమ పంథాను ఓటింగ్‌లోనే స్పష్టంగా చాటుకున్నాయి. ఎలాంటి రాజ్యాంగ సవరణ బిల్లు నెగ్గాలన్నా విపక్షాల మద్దతు అవసరమేనన్నది దీనితో తేలిపోయింది. చట్ట సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. 2023 పార్లమెంటు ఆమోదించిన 106వ రాజ్యాంగ సవరణ చట్టానికి అనగా మహిళా రిజర్వేషన్ బిల్లుకు ధోకా ఉండదు. ఈ పరిస్థితుల్లో ఆనాటి బిల్లును అమలు చేస్తే తమ పార్టీకి ఎలాంటి అభ్యంతరం ఉండబోదని ఎఐసిసి అధ్యక్షుని హోదాలో రాహుల్ గాంధీ అన్నారు.నియోజక వర్గాల పునర్విభజన బిల్లు 2026, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు 2026, రాజ్యాంగ 131వ సవరణ బిల్లులను కలిపి ఆమోదించేందుకు 'రూల్ -66'ను పక్కన పెట్టడంతో చిక్కొచ్చిపడింది. విపక్షాల వ్యతిరేకత అంతా డీలిమిటేషన్ బిల్లు మీదనే. ఈ బిల్లు విజయవంతమైతే దాని పర్యవసానంగా దక్షిణాది రాష్ట్రాలలో అసెంబ్లీ, లోకసభ స్థానాలు మొత్తం మీద చూసుకుంటే జనాభా నిష్పత్తిలో తగ్గిపోతాయని, ఆ కారణం చేతనే తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీ ఆ బిల్లుపై పూర్తి వ్యతిరేకత వ్యక్తం చేసింది. దక్షిణాది వారిపై చిన్న చూపు కారణంగా ఆ బిల్లును వ్యతిరేకించాలని డిఎంకె ఇతరత్ర విపక్షాల మద్దతు కోసం ప్రయత్నించింది. వివిధ రాష్ట్రాలలో ఎన్నికలు జరుగుతున్న సమయంలో మహిళా సాధికారతకు తాము మాత్రమే పట్టం కట్టగలమని చెప్పి మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉన్నట్టుండి ఈ బిల్లును ప్రవేశపెడుతున్నారని విపక్షాలు సైతం విమర్శించాయి. భారతీయ జనతాపార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈ బిల్లులపై సానుకూల వైఖరి తెచ్చేందుకు చేయని ప్రయత్నం లేదు. ఆఖరికి ప్రధాని నరేంద్ర మోడీ ఆత్మ ప్రబోధం మేరకు తాము పెట్టేబిల్లులను గట్టెక్కించాలని సభ్యులనుకోరారు. ఒకవేళ ఈబిల్లులు ఓడిపోయినా మహిళా బిల్లుపై విపక్షాలకు ఆసక్తి లేదని చెప్పుకునే పరిస్థితుంటుంది. ఇప్పుడు అదే జరిగింది. బిల్లుల ఓటమికి కారణాలు ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో ఎవరివైఖరితో వారు ప్రచారం చేసుకో వీలుంది. నిజానికి ఈ బిల్లులు రెండూ నెగ్గాలంటే 352 ఓట్లు అవసరం. ఓటింగ్‌లో పాల్గొన్న మొత్తం సభ్యులు 528 మంది కాగా 298 మంది అనుకూలంగా, 230 మంది వ్యతిరేకిస్తూ ఓట్లు వేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులు మూడింట రెండు వంతులు ఓట్లు రాకపోయే సరికి మహిళా బిల్లుకు అనుబంధంగా ఉన్న రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. రాజ్యాంగ సవరణ బిల్లు జతచేయకుండా ఉంటేమహిళా రిజర్వేషన్ బిల్లు గెలిచేది. దీనితో మరో రెండు బిల్లులను ఉపసంహరించుకున్నారు. డీలిమి టేషన్ బిల్లు 2026ను తీవ్రంగా వ్యతిరేకించాలని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా బ్లాక్ ఇంతకు ముందే ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆ మేరకు తమ వైపునఉండే పక్షాల సభ్యులను హాజరు పరచడంలో విపక్ష కూటమి సఫలీకృతమైంది. ఒకవేళ మహిళా రిజర్వేషన్ చట్టంగా పిలువబడే 'నారీ శక్తి వందన అధినియం'ను పలు సవరణలతో 2029 నాటికిఅమలులోకి వచ్చి ఉండేది. నియోజక వర్గాల పునర్విభజన ద్వారా మరికొందరు మహిళలకు సీట్లు కేటాయించే అవకాశం ఏర్పడి ఉండేది. విడివిడిగా రెండు వేర్వేరు సమయాల్లో అవి నెగ్గినా మహిళా లోకానికి మంచి అవకాశమే. కానీ తొలి అడుగే సరిగ్గా పడకపోవడం విచారకరం. 2023 లోనే రాజ్యాంగంలో ఆర్టికల్ 334( ఎ)పొందుపరిచారు. అప్పుడు ఆ బిల్లును అదే రూపంలో ప్రవేశపెట్టి ఉంటే తాము మద్దతునిస్తామని ఒక దశలో ఇండియా కూటమి నేతలు అభిప్రాయపడ్డారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు 2026 విషయంలోనూ ప్రభుత్వం రాజకీయ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నందునదక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల వారికి అన్యాయం జరుగు తుందని ఆది నుంచీ ఆరోపిస్తున్న స్థితిలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానంపై స్పష్టత లోపించింది. దేశం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని 2011 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన చేపట్టాలని నిర్ణయించినా డీలిమిటేషన్ కమిటీ నివేదిక వచ్చే వరకు ఈ బిల్లు లోగుట్టు తెలియదు.అందుకే విపక్షాలు అన్ని రాష్ట్రాల లో 50శాతం సీట్లు పెంచుతామని బిల్లులో పెడితే ఇండియాబ్లాక్ పక్షాలు అంగీకరించి ఉండేవి. రాజకీయ పరం గా చర్చనీయాంశమైన డీలిమిటేషన్ చట్ట సవరణలో ఉన్న అస్పష్టత కారణంగా నేటి సభలో బిల్లులు వీగిపోయాయి.పునర్విభజన ప్రస్తావన లేకుండా ఇప్పుడున్న 543 సీట్లకే పరిమితం చేసి మహిళా బిల్లు అమలు చేసేటట్లయితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నది విపక్షాల వ్యాఖ్య.



విజయానికి రెండు ప్రధాన సూత్రాలున్నాయి. ఆచరణకు ముందు ఆలోచించాలి. ఆ తరువాత ఆలోచనలను ఆత్మవిశ్వాసంతో ఆచరణలో పెట్టాలి.

రవీంద్రనాథ్ ఠాగూర్



మనిషికి మనసును మించిన మహాశత్రువు వేరొకరు లేరు. అందుకే మనస్సును జయిస్తే ప్రపంచాన్ని జయించవచ్చు.

గురునానక్

# సాంకేతిక దర్యాప్తుతోనే నేరాలకు అదుపు!

**ఈ ఫేక్ యాప్‌లను అరికట్టడానికి స్మార్ట్‌ఫోన్ల తయారీదారులే కొన్ని సాంకేతిక చర్యలు తీసుకోవచ్చు. ఫైనాన్షియల్ యాప్స్‌ను టెస్ట్ చేసే విషయంలో ఒరాకిల్ సాండ్ బాక్స్ ద్వారా సెక్యూర్ అప్లికేషన్‌ను స్మార్ట్ ఫోన్లు తయారు చేసేవారు కొనుగొనటానికి ఒక ప్రొసీజర్‌ను ఫోన్లలోనే ప్రవేశపెట్టడంతో ఇలాంటి యాప్స్ వాడకం చేయలేకపోవడం వల్ల ఫేక్ యాప్స్ నిష్క్రమిస్తాయి. ఇది ఎంతవరకు సాధ్యపడుతుందో సాంకేతిక పరిజ్ఞానం లేనివారు చెప్పటం కష్టం కానీ ఇలాంటి సెక్యూర్ చర్యల ద్వారా ఫేక్ యాప్స్ మోసాలు తగ్గే అవకాశం ఉంది. కొత్త చట్టాలు ఇలాంటి నేరాలు అరికట్టడానికి చేయటంతోపాటు కఠిన శిక్షలు అమలుపరిస్తే యంత్రణకు అవకాశం ఉంది.**



రావులపాటి సీతారాం రావు

మనదేశంలోనే మోసగాళ్లకు కొదవ లేదనుకుంటే, పక్క దేశాల నుంచో,ఇక్కడకు వచ్చి అమాయకులను, విద్యావంతులను, చాలా తెలివిగలవారమని చెప్పుకొనే వారిని కూడా తలలు వంచుకొనే రీతిలో మోసాలుచేసి, ధనికులవుతూ, చిద్విలాసంగా పబ్బం గడుపుకుంటున్నారు. పరువు పోవటం మాట అటుంచి, ఒక్క క్షణంలో సంపాదించిన డబ్బంతా పోగొట్టుకొని లక్షాధికారులు భిక్షాధికారులుగా మారుతున్నారు. ఇలాంటి మోసాలకు రకరకాల పేర్లు వాడుకలో ఉన్నాయి. సైబర్ మోసాలన్న పేరు విరివిగా ఈమధ్యకాలంలో వినపడుతున్నది. సైబర్‌మోసాలు అత్యంత లాఘవంగా నైపుణ్యం ఉట్టిపడేలా చేసి, ప్రభుత్వాలనూ పోలీసు వారిని కూడా బురిడీలు కొట్టించి కొంత కాలం ఎదురులేని రీతిలో ఈ నేరస్థులు రాజ్యాలు ఏలారు. ఇప్పుడిప్పుడే వీరి బండారాలు బయటపడి, చాలా మంది నేరస్థులు ఇక్కడా, ఇతర దేశాలలో జైళ్ల పాలయ్యారు. కొంతలో కొంత తగ్గుముఖం పట్టడంతో మరో రకమైన నేరం ముందుకొచ్చింది. తెలివైన మోసగాళ్లు, మోస ప్రక్రియను సాధికారికంగా పరిపూర్ణ స్థాయికి తీసుకొనిపోయి డిజిటల్ నేరాలు చేయటంలో పరిణితి సాధించారు. పోలీసులు కూడా ఉలిక్కి పడే రీతిలో 'డిజిటల్ అరెస్టులు' ఆన్ లైన్‌లోనూ, వాట్సాప్‌ల్లోనూ తలపెట్టి ఔరా! ఇలాంటి అరెస్టు గురించి మా మాన్యువల్స్‌లో కూడా లేదే అని చట్టాలను అమలు చేసే వారిని కోర్టులను కూడా ముక్కు మీద వేలేసుకొనేట్లు చేశారు. ఈ నేరస్థుల గొప్పతనం వీడియోల్లో ప్రత్యక్షంగా పోలీసు స్టేషన్లు, కోర్టులూ, ఇన్‌కం టాక్స్, సిబిఐ అధికారులను చూపించి బ్యాంకుల నుంచి తమ ఖాతాల్లోకి, బాధితులను బెదరించి, భయపెట్టి, డబ్బును పైసా కూడా అకౌంట్లలో మిగలనివ్వకుండా ట్రాన్స్‌ఫర్ చేయించుకొని ఆ ఖాతా మిథ్యగా నాటకాలు ఆడి తప్పించుకోవటం! ఈ నేరాలు కూడా కొంతకాలం జరిగి ప్రస్తుతం ప్రభుత్వ చర్యల వల్ల నియంత్రణలోకి వచ్చిన దాఖలాలు ఉన్నాయి. షేర్లు, లాభాలు, చిన్న మొత్తాలలో మీ ఖాతాల్లో చూపించి ఆ పేరిట షేర్లలాభాలు వచ్చాయని పెద్దమొత్తాలు మిస్మరైజ్ చేసి నొక్కేయటం ఇదీ ఒక రకమైన సైబర్ నేరంగా చాలా మందిని దివాలా తీయించింది. ప్రస్తుతం బహుళ సంఖ్యలో లోన్ యాప్స్‌తో జరిగే సైబర్ నేరాలు విస్తృత స్థాయిలో ప్రచారంలోకి వచ్చాయి. పోలీసులకు మరో వినూత్న ప్రక్రియను 'లోన్‌యాప్స్' సైబర్ మోసంగా మార్చి నేరస్థులు బాధితులకు దగ్గర నుంచి డబ్బు గుంజి చట్టానికి దొరకకుండా తప్పించుకొని తిరుగుతుండటం! ఈ కొత్త సైబర్ నేర ప్రక్రియను గురించి ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేరళం రాష్ట్రంలోనే నాలుగు నెలల కాలంలో తిరువనంతపురం రూరల్ పోలీసు లిమిట్స్‌లో 35 నేరాలు నమోదు అయ్యాయి. నితిన్‌రాజ్ అనే డెంటల్ స్టూడెంట్ (కొనసూర్) అయిదు అంతస్తుల బిల్డింగ్ నుంచి దూకి ఆత్మహత్య చేసుకోటానికి కారణం ఒక యాప్ ద్వారా తీసుకున్న అప్పును తీర్చేవిషయంలో ఒత్తిడిని(అప్పు యాప్ ద్వారా వచ్చిన వారు) భరించలేకనే ఇలాంటివి మన తెలుగు రాష్ట్రాలలో కూడా వెలుగులోకి వచ్చాయి. యాప్స్



ను ఒకసారి ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే కంటాక్ట్‌లిస్టులు, ఫొటోగ్యాలరీలు, జిపియస్ డాటా, ఫోన్‌దారుడి ఫోన్ నుంచి సంగ్రహిస్తారు. ఆ డాటాను సర్వర్స్‌కు ఎగుమతి చేస్తారు. ఎక్కువగా ఉత్తరదేశంలో ఈ నేరస్థుల డాటా చిక్కటం జరుగుతుందని ఇప్పటి వరకు ఇలాంటి నేరాల్లో చేసిన దర్యాప్తులో తేలింది. ఈ డాటా సర్వర్స్ ద్వారా ఇతర దేశాలకు కూడా ఎగుమతి అవుతున్న దాఖలాలు ఉన్నాయి. పొరపాటున రీపేమెంట్ (అప్పు యాప్ ద్వారా తీసుకున్న తర్వాత) ఆలస్యం అవుతే ఇక మొదలువుతుంది. అప్పు తీసుకున్న వాడికి నరకయాతన! ఆ వేధింపులను మామూలు వ్యక్తే కాదు అనుభస్తుడైనా భరించటం కష్టం. భయంకరంగా తిట్టడం మొదలెట్టారు. తీసుకున్న వాడినే కాదు ఫోన్ లిస్టులో ఉన్న ప్రతి వారికి ఫోన్ చేసి, చెప్పకూడని విషయాలు కూడా చెప్పటానికి ప్రయత్నించి, అప్పు తీసుకున్న వాడి జీవితాన్ని బజారులో పడేస్తారు. పరువు పోయిన ఆ అప్పు తీసుకున్న వ్యక్తి ముఖం చూపించలేక ఆత్మహత్యే శరణ్యమనుకుంటాడు. ఇలాంటి కేసుల్లో ఈ విషయాలు ఎక్కువగా పోలీసుల దర్యాప్తులో తెలుస్తున్నాయి. పర్సనల్‌గా తెలియక హామీ ఉన్న వ్యక్తులను కూడా ఈ నరకయాతనను తప్పించుకోలేరు. దానితో అప్పు తీసుకున్న వ్యక్తిపై భరించలేనంత ఒత్తిడి పెరుగుతుంది. అప్పు తీర్చటానికి మార్గం లేక ప్రాణాలు తీసుకోక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. ఎక్కువగా చిన్న చిన్న అవసరాలకు విద్యార్థులు ఇలాంటి యాప్‌ల్లో అప్పులు తీసుకొని బాధలు భరించక తప్పటం లేదు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా డిజిటల్ లెండింగ్ గైడ్‌లైన్స్ ఇచ్చినా పాటించే వారు ఎక్కువగాలేరు. ప్రిడేటెడ్ యాప్స్, రెగ్యులేటెడ్ స్టేటస్ లేకుండానే అప్పులు ఇస్తున్నాయి. నాన్ బ్యాంకింగ్‌లో ఫైనాన్షియల్ కంపెనీలలో పార్టనర్ షిప్ ఉందని ఈ యాప్‌ల నిర్వాహకులు ఫేక్ సమాచారంతో ఫండ్స్‌ను అందుబాటులోకి తెస్తారు. ఈ ఫేక్ యాప్స్ మోసాలలో చిక్కుకొని బయట పడటం కష్టంగా బాధితులు భావించటంతో విపరీత పరిణామాలు సంభవిస్తున్నాయి. ఈ ఫేక్ యాప్‌లను అరికట్టడానికి స్మార్ట్‌ఫోన్ల తయారీదారులే కొన్ని సాంకేతిక చర్యలు తీసుకోవచ్చు. ఫైనాన్షియల్ యాప్స్‌ను టెస్ట్‌చేసే విషయంలో ఒరాకిల్ సాండ్ బాక్స్ ద్వారా సెక్యూర్ అప్లికేషన్‌ను స్మార్ట్ ఫోన్లు తయారు చేసేవారు కొనుగొనటానికి ఒక ప్రొసీజర్‌ను ఫోన్లలోనే ప్రవేశపెట్టడంతో ఇలాంటి యాప్స్ వాడకం చేయలేకపోవడం వల్ల ఫేక్‌యాప్స్ నిష్క్రమిస్తాయి. ఇది ఎంతవరకు సాధ్యపడుతుందో సాంకేతిక పరిజ్ఞానం లేనివారు చెప్పటం కష్టం కానీ ఇలాంటి సెక్యూర్ చర్యల ద్వారా ఫేక్ యాప్స్‌మోసాలు తగ్గే అవకాశం ఉంది. కొత్త చట్టాలు ఇలాంటి నేరాలు అరికట్టడానికి చేయటంతోపాటు కఠిన శిక్షలు అమలు పరిస్తే నియంత్రణకు అవకాశం ఉంది. ఒక్కొకప్పుడు యాప్స్ కనుగొని తొలగించటం జరిగితే మరో పేరుతో ఇలాంటి యాప్స్ పుట్టు కొస్తున్నాయి. అన్ని ఆర్థిక యాప్స్ ఎన్‌క్రిప్ట్ కాబడినవని సర్టిఫికేట్ పొందాలని రిజర్వు బ్యాంకు నిబంధన చేస్తే వెలు గులోకి వచ్చిన ఫేక్ ఆర్థిక యాప్‌లను బ్లాక్‌లిస్ట్ చేస్తే కొంతమేర ఇలాంటి సైబర్‌నేరాలు అరికట్టవచ్చు. ఈ నేర పరిధిని నియంత్రించటానికి పోలీసులు మాత్రమే చేయగలరు అన్న విశ్వాసాన్ని ప్రక్కన పెట్టి, సాంకేతిక నిపుణులు, సైబర్ క్రైమ్‌ను పసిగట్టే నాలెడ్జి ఉన్న వారితోపాటు పోలీసులు దర్యాప్తు చేయడానికి తగుశిక్షణ ఉండక తప్పదు. నేరాలూ, నేరస్థులు,కొత్త పద్ధతులతో విరాజిల్లుతూ పరిధిని విస్తృత పరుచుకుంటుంటే ప్రభుత్వాలు, పోలీసులూ నిపుణులూ నైపుణ్యతను పెంపొందించుకొని ఒక అడుగు నేరస్థులకంటే ముందే వేయక తప్పదు.

# పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న అపార్ట్‌మెంట్లు

నల్ల రవి కుమార్

నేటి ఆధునిక కాలంలో ఆకాశమే హద్దుగా ఎదుగుతున్న కాంక్రీటు వనాలు నగరాల స్వరూపాన్ని మార్చేస్తున్నాయి. అభివృద్ధికి చిహ్నాలుగా పిలవబడే ఈ హైరైజ్ అపార్ట్మెంట్లు నిజానికి ఒక అందమైన అబద్ధం లాంటివి. మెరిసే గాజు కిటికీలు, ఎత్తు నుంచి కనిపించే దృశ్యాలు ఆకర్షణీయంగా అనిపించినా, వాటి వెనుక దాగి ఉన్న పర్యావరణ విధ్వంసం, జీవనశైలి సంక్షోభం, ఆర్థిక అస్థిరతను మనం గమనించాల్సి ఉంది. పర్యావరణ కోణంలో చూస్తే, ఈ ఆకాశహర్మ్యాలు భూమిపై విపరీతమైన భారాన్ని మోపుతున్నాయి. ఒక సాధారణ ఐదు అంతస్తుల భవనంతో పోలిస్తే, హైరైజ్ నిర్మాణాలకు వాడే సిమెంట్, స్టీల్ గ్లాస్ పరిమాణం అత్యధికం. ఈ పదార్థాల తయారీలో వెలువడే కార్బన్ ఉద్గారాలు పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తాయి. అంతేకాకుండా, గాజు గోడల వల్ల ఉత్పన్నమయ్యే వేడిని తగ్గించడానికి వాడే భారీ ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థలు నగరాల్లో 'హీట్ ఐలాండ్' ప్రభావాన్ని పెంచుతున్నాయి. గాలి, వెలుతురు కోసం ప్రకృతిపై కాకుండా కేవలం విద్యుత్ యంత్రాలపైనే ఆధారపడటం వల్ల ఇవి ఇంధన భక్షక కేంద్రాలుగా మారుతున్నాయి. జీవనశైలి పరంగా చూస్తే, ఈ ఎత్తైన భవనాలు మనుషుల మధ్య సామాజిక దూరాన్ని పెంచుతున్నాయి. నేలకు దూరంగా, పదుల అంతస్తుల పైన నివసించే వారిలో ఒంటరితనం, మానసిక ఒత్తిడి పెరుగుతున్నట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. కింద ఉన్న పచ్చదనాన్ని చూడాలన్నా, కాసేపు మట్టిలో నడవాలన్నా లిఫ్టుల మీద ఆధారపడాల్సిందే. అత్యవసర పరిస్థితుల్లో, ముఖ్యంగా అగ్నిప్రమాదాలు లేదా భూకంపాలు సంభవించినప్పుడు ఈ భవనాల నుండి ప్రాణరక్షణ పొందడం అత్యంత కఠినమైన సవాళ్లు. పిల్లలకు ఆడుకోవడానికి కావాల్సిన



సహజమైన వాతావరణం, వృద్ధులకు అవసరమైన కమ్యూనిటీ స్పేస్ ఇక్కడ కేవలం కృత్రిమంగానే కనిపిస్తాయి. ఆర్థిక విశ్లేషణ కూడా ఈ హైరైజ్ సంస్కృతికి వ్యతిరేకమైన ఫలితాలనే ఇస్తుంది. భవనం ఎత్తు పెరిగేకొద్దీ దాని నిర్వహణ ఖర్చులు భారీగా పెరుగుతాయి. లిఫ్టుల నిర్వహణ, నీటిని పైకి పంపింగ్ చేయడం, నిరంతర విద్యుత్ సరఫరా కోసం చేసే ఖర్చు మధ్యతరగతి జీవికి పెనుభారంగా మారుతుంది. కాలక్రమేణా భవనం పాతబడే కొద్దీ దాని మరమ్మత్తులు చేయడం అసాధ్యంగా మారుతుంది. పునర్నిర్మాణం విషయానికి వస్తే, వందల కుటుంబాలు ఉండే ఒకే టవర్ను కూలగొట్టి మళ్ళీ కట్టడం అనేది ఆర్థికంగా, సాంకేతికంగా ఒక పీడకలగా మారుతుంది. భారతదేశం వంటి అధిక జనాభా గల దేశాల్లో భూమి కొరత ఉందనే సాకుతో హైరైజ్ భవనాలను సమర్థిస్తుంటారు. కానీ నిజానికి, పటిష్టమైన ప్రణాళిక ఉంటే 5 లేదా 6 అంతస్తుల భవనాలే అత్యంత సమర్థవంతమైనవి. వీటివల్ల జనసాంద్రతను క్రమబద్ధీకరించవచ్చు, అదే సమయంలో ప్రజలకు నేలతో అనుబంధాన్ని, తక్కువ ఖర్చుతో కూడిన నివాసాన్ని అందించవచ్చు. అల్ప,మధ్య ఆదాయ వర్గాలకు ఇవి ఆర్థికంగా అందుబాటులో ఉండటమే కాకుండా, పర్యావరణానికి తక్కువ హాని కలిగిస్తాయి. మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలపై కూడా భారం తక్కువగా ఉంటుంది. అభివృద్ధి అంటే కేవలం ఆకాశాన్ని తాకడం కాదు, నేలకు హత్తుకుని జీవించడం. మనం నిర్మించుకునే ఇళ్లు కేవలం తలదాచుకునే గూళ్లు మాత్రమే కాదు, అవి రేపటి తరానికి మనం అందించే ఆరోగ్యకరమైన వాతావరణానికి పునాదులు కావాలి. ఈ క్రమంలో హైరైజ్ వ్యామోహం నుండి బయటపడి, సుస్థిరమైన, మానవీయమైన తక్కువ అంతస్తుల నిర్మాణాల వైపు అడుగులు వేయడమే వివేకవంతమైన చర్య. మన నగరాలు కాంక్రీటు అడవుల్లాకాకుండా, ప్రాణవాయువునిచ్చే పచ్చని ఒడుల్లా ఉండాలంటే విధాన కర్తలు తమ ఆలోచనా ధోరణిని మార్చుకోవాలి.

# పాలనా వ్యవస్థలో కొరవడిన నైతికత, పారదర్శకత!

ముద్దం నరసింహ స్వామి

భారతదేశం ఆర్థికంగా వేగంగా ఎదుగుతున్న దేశాల జాబితాలో ముందంజలో ఉన్నప్పటికీ, సామాన్య ప్రజల జీవితాల్లో అదే స్థాయిలో నాణ్యతా మార్పు కనిపించకపోవడం ఒక పెద్ద విరుద్ధావస్థగా నిలుస్తోంది. జీడీపీ పెరుగుతోంది, స్టార్టప్స్ పెరుగుతున్నాయి, అంతరిక్ష సాంకేతికతలో దేశం కొత్త రికార్డులు సృష్టిస్తోంది, ప్రపంచ వేదికలపై భారత్ ప్రభావం పెరుగుతోంది. అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కొరత, పట్టణాల్లో అసమానతలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, సేవల ఆలస్యం వంటి సమస్యలు ఇంకా ప్రజల దైనందిన జీవితాలను కష్టతరం చేస్తున్నాయి. ఈ విరుద్ధతకు ప్రధాన కారణాలపై అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తన స్వీయ అనుభవాల గ్రంథం ఏ ప్రామిస్డ్ లాండ్‌లో చేసిన వ్యాఖ్యలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. స్థానిక అధికార యంత్రాంగంలోని అవినీతి, మార్పుకు ప్రతిఘటించే సంకుచిత బ్యూరోక్రసీ భారత ప్రగతికి అడ్డంకిగా మారిందని ఆయన విశ్లేషించారు. నిజానికి ఈ వ్యాఖ్యలు కేవలం ఒక విదేశీ నాయకుడి అభిప్రాయంగా మాత్రమే కాకుండా, భారతీయ సమాజంలో చాలామంది అనుభవిస్తున్న వాస్తవ పరిస్థితుల ప్రతిబింబంగా కూడా కనిపిస్తాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ యంత్రాంగం ప్రజల సేవకులుగా ఉండాలి. కానీ చాలా సందర్భాల్లో అదే యంత్రాంగం ప్రజలకు భయానకంగా మారుతోంది. సాధారణ సర్టిఫికేట్ పొందాలన్నా, భూమి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నా, పింఛను పొందాలన్నా లేదా సంక్షేమ పథకాల ప్రయోజనం పొందాలన్నా అనవసరమైన ఆలస్యం, మధ్యవర్తులజోక్యం, లంచాల ఒత్తిడి వంటి సమస్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితులు ప్రజలలో ప్రభుత్వంపై విశ్వాసాన్ని తగ్గిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులను మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ కర్మయోగి' వంటి కార్యక్రమాలు ఒక సానుకూల ప్రారంభంగా చెప్పవచ్చు. 'నాగరిక్ దేవోభవ' అనే భావనను ముందుకు తీసుకువస్తూ ప్రజలను కేంద్రంగా పెట్టుకున్న పాలనా సంస్కృతిని అభివృద్ధి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడం ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన బాధ్యతగా ఆయన పేర్కొనడం ప్రస్తుత పరిస్థితుల్లో అత్యంత ప్రాముఖ్యత కలిగిన సందేశంగా భావించాలి. అయితే ఈ పిలుపు కేవలం ప్రసంగాల్లోనే కాకుండా కార్యాచరణలో కూడా ప్రతిఫలిస్తేనే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగం అంటే ఒక హోదా మాత్రమే కాదు, ఒక బాధ్యత. ప్రజల పన్నుల రూపంలో వచ్చిన డబ్బుతో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించబడుతున్నాయి. రిజర్వ్ బ్యాంక్ నివేదిక ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే సంవత్సరానికి లక్షల కోట్ల రూపాయలను జీతాల రూపంలో ఖర్చు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా భారీ మొత్తాన్ని జీతభత్యాల కోసం కేటా



యిస్తోంది. ఈ మొత్తమంతా ప్రజల కష్టార్జిత సంపాదన నుంచే వస్తోంది. కాబట్టి ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల పట్ల మరింత బాధ్యతతో వ్యవహరించడం అనివార్యం. ఇప్పటికే సుప్రీంకోర్టుకూడా ప్రభుత్వసేవలో కొనసాగేవారు నిజాయితీ, విశ్వసనీయత, చిత్తశుద్ధి కలిగినవారే కావాలని స్పష్టంగా పేర్కొంది. అయినప్పటికీ వ్యవస్థలో ఇంకా అవినీతి, నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగం కొనసాగుతుండటం ఆందోళనకరం. కొన్ని సందర్భాల్లో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడానికి కూడా భయపడే పరిస్థితి ఏర్పడింది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదు. అవినీతి అనే సమస్యకేవలం ఆర్థిక నష్టాన్ని మాత్రమే కలిగించదు. అది సమాజంలో అసమానతలను పెంచుతుంది. న్యాయం పొందే అవకాశాలను తగ్గిస్తుంది. నిజాయతీగా జీవించే వారిని నిరుత్సాహపరుస్తుంది. లంచం ఇవ్వగలిగినవారికి మాత్రమే సేవలు అందే పరిస్థితి ఏర్పడితే ప్రజాస్వామ్య వ్యవస్థ మూలసూత్రాలే దెబ్బతింటాయి. సామాన్య ప్రజలు ప్రభుత్వాన్ని తమదిగా భావించే భావన క్రమంగా తగ్గిపోతుంది. ఇంకా ఒక ముఖ్యమైన సమస్య వ్యవస్థలో ఉన్న నైపుణ్యాల లోపం. ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతోంది. కానీ ప్రభుత్వ వ్యవస్థలో చాలా చోట్ల ఇప్పటికీ పాత విధానాలే కొనసాగుతున్నాయి. డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చినప్పటికీ వాటి అమలు సమర్థవంతంగా జరగడంలేదు. శిక్షణా కార్యక్రమాలు సరైన స్థాయిలో లేకపోవడంవల్లఉద్యోగుల పనితీరు మెరుగుపడటం లేదు. 'మిషన్ కర్మయోగి' వంటి కార్యక్రమాల ద్వారా ఈలోటును పూరించాల్సిన అవసరం ఉంది. పాలనా వ్యవస్థలో పారదర్శకత పెరగాలంటే టెక్నాలజీ వినియోగం కీలకం. ఆన్‌లైన్ సేవలు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్, సోషల్ ఆడిట్ వ్యవస్థలు వంటి చర్యలు అవినీతిని తగ్గించడంలో సహాయపడతాయి. అయితే టెక్నాలజీ ఒక్కటే సరిపోదు. ఉద్యోగుల మనస్తత్వంలో మార్పురావాలి. ప్రజలను కస్టమర్లుగా కాకుండా భాగస్వాములుగా చూడాలి. ప్రజలసమస్యలను పరిష్కరించడం ఒక బాధ్యతగా భావించాలి. ప్రభుత్వ యంత్రాంగంలోసంస్కరణలు తీసుకురావాలంటే నియామకాల నుంచి పదోన్నతుల వరకు ప్రతి చోటా పారదర్శకత ఉండాలి. పనితీరును ఆధారంగా చేసుకుని ప్రోత్సాహకాలు ఇవ్వాలి. నిర్లక్ష్యంగా పనిచేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో నిజాయితీగా పనిచేసే ఉద్యోగులను ప్రోత్సహించాలి. వారి సేవలను గుర్తించి గౌరవించాలి. ప్రజల భాగస్వామ్యం కూడా పాలనాసంస్కరణల్లో కీలకపాత్ర పోషిస్తుంది. సోషల్ మీడియా, ప్రజా వేదికలు, గ్రామసభలు వంటి మార్గాల ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం కల్పించాలి. ప్రభుత్వ నిర్ణయాల్లో ప్రజల సూచనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుంది. భారతదేశం 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించాలంటే కేవలం ఆర్థిక వృద్ధిసరిపోదు. పాలనా వ్యవస్థలో నైతికత,పారదర్శకత, సమర్థత కూడాపెరగాలి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. ప్రభుత్వ సేవలువేగంగా, నాణ్యంగా అందాలి. అప్పుడేప్రజలు ప్రభుత్వంపై విశ్వాసం పెంచుకుంటారు. దేశఅభివృద్ధిలో భాగస్వాములుగా ముందుకు వస్తారు. భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పాలనావ్యవస్థలో మార్పు అవసరం. అవినీతిని నిర్మూలించడం, నైపుణ్యాలను పెంపొందించడం,ప్రజల పట్ల గౌరవంతో వ్యవహరించడం వంటి అంశాలు అమలు లోకి వస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రజా స్వామ్యంలో ప్రజలే ప్రభువులు అన్నసూత్రాన్ని కార్యరూపం లోకి తీసుకురావడం ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యంగా మారినప్పుడే భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతుంది.

# ప్రజావాక్కు



## మతోన్మాద పార్టీలకు గుణపాఠం

ఈరోజు పార్లమెంటులో 131 వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కారకులకు అభినందనలు.డీలిమిటేషన్ వలన ప్రయోజనం లేదని తెలిసిపోయింది.పార్లమెంటు సభ్యులు ,శాసనసభ్యులు సంఖ్య పెరిగినంత మాత్రాన ప్రజలకు ఒరిగేది ఏమీలేదు.జీతాల పేరుతో ,అలవెన్సుల పేరుతో పెన్షన్ల పేరుతో ప్రజాధనం వృథా తప్ప ప్రయోజనంఉండదు.సేవచెయ్యాలనుకుంటే ఇప్పుడున్న సంఖ్య సరిపోతుంది. బీజేపీ తన సొంతప్రయోజనం కోసమే డీలిమిటేషన్ తీసుకొచ్చింది అని ప్రజలు తెలుసుకున్నారు. దానికి తగ్గట్టుగానే ప్రతిపక్ష సభ్యులు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారు.

- నార్నే వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## సోలార్ విద్యుత్‌పై దృష్టిసారించాలి

భారతదేశం ఇంటర్నేషనల్ సోలార్ అలియాన్స్‌ను ప్రతిపాదించడంతో పాటుప్రభుత్వ కార్యాలయాలలో విద్యుత్ అందించడం అది కుడా తిరిగి రూపొందించగలిగే లేదా తిరిగి పొందగలిగే రూపంలోనిది కావడం. ఫాసీల్ ఫ్యూయల్ కాకుండా తిరిగి పొందగలిగే వనరుల నుండి విద్యుత్ తయారు చేయడం ముఖ్యం. అంత మాత్రమే కాదు భూమి మీద వేడి పెరగడం కాలుష్య కాసారాలుగా నగరాలు మారడం గమనించవచ్చు. దానికి ఢిల్లీ ఒక ప్రత్యక్ష ఉదాహరణ. ఇలా మారడానికి కారణం ఏమిటి అని ఆలోచించకుండా ఎక్కువ ఆదాయం కలిగిన దేశాలు ఉదాహరణకు అమెరికావంటి దేశాలు బాధ్యతరాహితంగా మారడం గమనించవచ్చు. అన్ని దేశాలు బాధ్యతగా ఆలోచించాలి ఆ దిశగా అడుగులు వేయాలి.

- బి. అవినాష్, జనగామ

## దోమల బెడదను నివారించాలి

రాష్ట్రంలో దోమలు అధికంగా విహరిస్తూ ఉన్నాయి. దీంతో ప్రజలకు డెంగీ, మలేరియా, టైఫాడ్ వంటి జ్వరాలు వచ్చే అవకాశాలున్నాయి. సాయంత్రం వేళ బయట వాకింగ్ చేస్తున్న పెద్దలు, బయట ఆడుతున్న పిల్లలు విపరీతమైన దోమలతో ఇబ్బంది పడుతున్నారు. దోమల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలి.వేసవికాలం నేపథ్యంలో వేడి నుండి ఉపశమనానికై ఆరుబయటకువస్తారు కావునా దోమల నుండి కాపాడాల్సిన భాధ్యత ప్రభుత్వానిదే.

- ఎం. సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

## కొత్త నిబంధనలు

పోస్టల్ సేవింగ్స్ వంటి ఖాతాలేమైనా రద్దు చేసుకోవాలంటే మదుపరులను పోస్టల్ శాఖ వారుకాలం చెల్లిన నిబంధనలతో ఇబ్బంది పెడుతున్నారు. ఖాతాదారులు తమ ఖాతా తెరిచే వేళ జీవితభాగస్వామినైనా పిల్లలైనా నామినీగా తెలుపుతారు. ఒకవేళ ఖాతా తెరిచిన వ్యక్తి మధ్యలో చనిపోతే ఆ డిపాజిట్ సొమ్ము నామినీకి చెల్లించాలి. సందేహం వస్తే మిగతా వారసుల నుండి అంగీకారపత్రం తీసుకోవాలి. వీటిల్లో అక్రమాలకు ఆస్కారం వుండదు. ఏమైనా తేడా వస్తే బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి. కాని చనిపోయిన వ్యక్తి నామినీకి డిపాజిట్ సొమ్ము చెల్లించకుండా, పోస్టల్ అధికారులు నామినీకి తెలిసిన ఇద్దరు వ్యక్తులు ఆధార్, పాన్ జిరాక్స్ కాపీలతో సంబంధిత పోస్టాఫీసుకి వచ్చి సంతకం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈబిజీ జీవితంలోబయట సాక్షులు తమ పనులు మానుకొని ఆఫీసులచుట్టూ తిరగాలంటే ఎంతో ఇబ్బంది.

- టి.సాంబశివరావు, గుంటూరు

## కాలుష్య నియంత్రణ

నగరాల్లో రోజురోజుకు వాయు కాలుష్యం పెరిగిపోతున్నది. కట్టెలు, వ్యవసాయ వ్యర్థాలు వల్ల ఏ హానీ లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో గాలిలోకి ప్రవేశించి వాతావరణాన్ని కలుషితం చేసే పొగలు చాలా ప్రమాదం. కొన్ని ఆ ప్రాంతాల్లో ఉన్న వారికి తక్షణమే శ్వాసకోశ ఇబ్బందితో ప్రమాదం వస్తుంది. ఇండ్ల మధ్య చెట్ల ఆకులను కాల్చడం వల్ల కూడా పొగ వస్తుంది. దీంతోకూడా ఇబ్బందులుఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వీధి చివరి ఇటువంటి మంటలు ఎన్నో కనిపిస్తున్నాయి. వాటిలో ప్లాస్టిక్ వస్తువులు వేసే పనివల్ల అందరికీ ముప్పు అని గుర్తెరగాలి.

- జి.కృష్ణకుమార్, నల్గొండజిల్లా

## అలవాట్లు మార్చుకోవాలి

ఆధునిక సమాజం ఎంతో పురోగమిస్తున్నకొద్దీ రోగాలు కూడా ముసురుకుంటున్నాయి. సామాన్యుడి నుండి కోటీశ్వరుడి వరకు జీవన శైలి వ్యాధుల బారిన పడుతున్నారు. పాతకాలం రోజులే బాగుండే అని. తాత ముత్తాతలను గుర్తు చేసుకొంటున్నారు. కానీమారిన జీవన శైలిని మార్చుకొనేందుకు ఇష్టపడట్లేదు. మనం తినే ఆహారం,తాగే పానీయాలు, శారీరక శ్రమతగ్గడం, వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం, ప్లాస్టిక్ భూతం, మద్యపానం ధూమపానం లాంటి వ్యసనాలు ఆరోగ్యాన్ని కాటేస్తున్నాయి. చిరుప్రాయంలోనే ప్రాణాంతకమైన జబ్బులతో అకాల మరణం పాలు చేస్తున్నాయి.

-టి. మురళీ మోహన్, హైద్రాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ద.కొరియాతో వ్యూహాత్మక సహకారం

## భారత్‌లో మూడురోజుల పర్యటనకు వచ్చిన లి జే మ్యూంగ్

## విదేశాంగ మంత్రి జైశంకర్‌తో చర్చలు

## నేడు ప్రధాని మోడీతో మ్యూంగ్ భేటీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 19:** మధ్యప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దక్షిణకొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ మూడురోజుల భారత పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. ఆదివారం ఉదయం లీజే మ్యూంగ్ ప్రత్యేక విమానంలో ఢిల్లీలోని పాలెం ఎయిర్ బేస్ విమానాశ్రయం చేరుకోగా, భారత ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. భారత్‌తో ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం, వ్యూహాత్మక సహకారాన్ని విస్తరించడం లక్ష్యంగా దక్షిణకొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ పర్యటన కొనసాగుతుందని ఆ దేశజాతీయ భద్రతా సలహాదారు వి సంగ్ లాక్ తెలిపారు. అలాగే ఇంధన స్థిరత్వంపై దృష్టి సారిస్తూ, వాణిజ్యం, సాంకేతికత, వ్యూహాత్మక దౌత్య సంబంధాలను పెంపొందించేందుకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో శిఖరాగ్ర చర్చలు జరుపనున్నారు. ఆదివారం ఢిల్లీ చేరుకున్న దక్షిణకొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ మొదటి రోజు భారత్‌లోని కొరియన్ కమ్యూనిటీ సభ్యులతో సమావేశమయ్యారు. అనంతరం విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్‌తో భేటీ అయ్యారు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీతో జరిగే శిఖరాగ్ర చర్చల అజెండాను ఖరారు చేశారు. గత ఏడాది జీ7, జీ20 శిఖరాగ్ర సమావేశాల సందర్భంగా జరిగిన చర్చల తర్వాత భారత ప్రధాని, దక్షిణకొరియా అధ్యక్షుడు ముఖాముఖిగా కలుసుకోవడం ఇది మూడవసారి. ఓడల నిర్మాణం, సముద్ర పరిశ్రమలు, కృత్రిమ మేధ స్సు, రక్షణ వంటి రంగాలలో ఆర్థిక సహకారాన్ని విస్తరించడంపై, అలాగే మధ్యప్రాచ్య పరిస్థితులతో ముడిపడి ఉన్న ఇంధన సరఫరా గొలుసులోని అనిశ్చితికి ప్రతిస్పందనలను సమన్వయం చేయడంపై ఈ శిఖరాగ్ర సమావేశం దృష్టి సారిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో లీ జే మ్యూంగ్‌కు అధికారికంగా సైనిక వందనంతో స్వాగతం పలుకుతారు. అనంతరం ఆయన రాజ్ ఘాట్ సందర్శించి మహాత్మా గాంధీకి నివాళి అర్పిస్తారు. హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోడీతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. రక్షణ, సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో కీలకఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. అనంతరం భారత మండపంలో జరిగే ఇండో-కొరియా బిజినెస్ ఫోరమ్‌లో సుమారు 200 మంది కొరియా పారిశ్రామికవేత్తల తో కలిసి పాల్గొంటారు. సాయంత్రం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమవుతారు. కొరియన్ ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ తయారీదా రులకు కీలకమైన ఉత్పత్తికేంద్రం, ప్రధాన విని యోగదారుల మార్కెట్ అయిన భారతదేశంలో కొరియన్ కంపెనీల కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడానికి, కొత్త అవకాశాలను అన్వేషించడానికి ఆయన ఒక బిజినెస్ ఫోరమ్‌లో కూడా పాల్గొ ననున్నారు. లీ మంగళవారం వియత్నాంలోని హనోయికి అధికారిక పర్యటనకు బయలుదేరనున్నారు.



## ఇటలీలో కాల్పులు.. ఇద్దరు భారతీయుల మృతి

**అమృతసర్, ఏప్రిల్ 19:** ఇటలీలో బెర్గామో ప్రావిన్స్‌లోని కోవోలో ఇద్దరు భారతీయులు హత్యకు గురయ్యారు. వైశాఖి ఫెస్టివల్ సందర్భంగా గురుద్వారా మాతా సాహిబ్ కౌర్ జీ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. అధికార వర్గాల కథనం ప్రకారం, రాగిందర్ సింగ్(48), గుర్మీత్ సింగ్ (48) ఇద్దరూ గురుద్వారా నుంచి బయటకు వస్తుండగా, దుండగుడు కాల్పులు జరిపి, పరారయ్యాడు. తుపాకీ కాల్పుల్లో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కాల్పులకు పాల్పడినది కూడా భారతీయుడిగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. వీరి మధ్య గత కొంతకాలంగా ఘర్షణలు చోటు చేసుకున్నాయని, ముందస్తు ప్రణాళిక ప్రకారమే, నిందితుడు కాల్పులు జరిపి పరారయ్యాడని అధికారులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఘటన జరిగిన ప్రదేశం నుంచి పోలీసులు పది షెల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కాల్పుల్లో మరొకరికి కూడా బుల్లెట్లు తగిలినట్లు తెలుస్తోంది.

## పహాల్గావ్ భయానకంపై అమెరికాలో భారత్ ఛాయాచిత్ర ప్రదర్శన..

**క్యాపిటల్‌హిల్(యుఎస్), ఏప్రిల్ 19:** జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. అమాయక పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. హిందువులే లక్ష్యంగా ఈ దాడి జరిగింది. ఈ ఘటనలో 25 మంది



మరణించారు. వీరిలో ఇండియాతోపాటు నేపాల్‌కు చెందిన వారు కూడా ఉన్నారు. పర్యాటక ప్రాంతంలో ఆనందంగా గడుపుతున్న పర్యాటకుల్ని ఉగ్రవాదులు హతమార్చారు. ఈ ఘటన ఇండియాతోపాటు ప్రపంచవ్యాప్తంగా సంచలనం కలిగించింది. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదులే ఈ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన జరిగి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా భారత్ ఈ ఘాతుక దృశ్యాలను ప్రపంచానికి చూపించాలని భావించింది. పాకిస్తాన్ ఉగ్రవాద వైఖరిని మరోసారి ప్రపంచానికి చూపాలనుకుంటోంది. దీనిలో భాగంగా పహల్గాం ఘటనపై అమెరికాలోని క్యాపిటల్ హిల్ ప్రాంతంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయబోతుంది. పహల్గాం దాడి జరిగి ఏడాది పూర్తైన సందర్భంగా అమెరికాలోని భారత రాయబార కార్యాలయం ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయబోతున్నట్లు అక్కడి రాయబారి వినయ్ మోహన్ ఖ్వాత్రా తెలిపారు. దీనికి ద హ్యూమన్ కాస్ట్ ఆఫ్ టెర్రరిజం అనే పేరు పెట్టారు.

## కోల్‌కతా డిసిపి నివాసం, పలు ప్రాంతాల్లో ఇడి దాడులు

**కోల్‌కత్తా, ఏప్రిల్ 19:** పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న వేళ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు కలకలం సృష్టించాయి. కోల్‌కతాలో ఆదివారం తెల్లవారుజామున ఈడీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. కోల్‌కతా పోలీస్ డిప్యూటీ కమిషనర్ (డీసీపీ) శంతను సిన్హా బిస్వాస్ నివాసంతో పాటు పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. గతంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నియోజకవర్గంలోని కీలకమైన కాళీఘాట్ పోలీస్ స్టేషన్‌లో బిస్వాస్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయడం గమనార్హం. దక్షిణ కోల్‌కతాలోని బల్లిగంజ్ ప్రాంతంలో సంచలనం సృష్టించిన సోనా పప్పు సిండికేట్ కేసు దర్యాప్తులో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయని ఈడీ వర్గాలు తెలిపాయి. అక్రమ వసూళ్లకు పాల్పడిన ఈ కేసులో ప్రధాన నిందితుడు బిశ్వజిత్ పోద్దార్ అలియాస్ సోనా పప్పు ఇంకా పరారీలోనే ఉన్నాడు.

# దేశ ప్రజలను తప్పదోవ పట్టించే కుట్రలు

## మోడీ విమర్శలకు మమత ఘాటైన స్పందన



**కోల్‌కత్తా, ఏప్రిల్ 19:** మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన రాజ్యాంగసవరణ బిల్లు వీగిపోవడంపై ప్రధానిమోడీ చేసిన వ్యాఖ్యలకు పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలతో స్పందించారు. ప్రధాని మోడీపై ఆమె సోషల్ మీడియాలో ఘాటైన పోస్టుపెట్టారు. ప్రధాని ఈ సమస్యను నిజాయితీగా పరిష్కరించడానికి బదులు దేశాన్ని తప్పుదోవ పట్టించాలని చూడటం చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మహిళలకు అధిక రాజకీయ ప్రాతినిధ్యాన్ని ఇచ్చిందని స్పష్టం చేశారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ రెండింటిలోనూ టీఎంసీకి అత్యధిక మంది మహిళా ప్రతినిధులు ఉన్నారని గుర్తు చేశారు. టీఎంసీ తరఫున లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల్లో 37.9 శాతం మంది మహిళలు ఉన్నారని, అదే సమయంలో రాజ్యసభకు 46 శాతం మహిళా సభ్యులను నామినేట్ చేసినట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్లను టీఎంసీ వ్యతిరేకించలేదని అలాంటి ప్రశ్న ఎన్నడూ తలెత్తలేదని దీదీ తేల్చి చెప్పారు. తన స్వార్థ రాజకీయ అజెండా కోసం మోదీ సర్కార్ మహిళలను ఒక రక్షణ కవచంగా వాడుకుంటూ డీలిమిటేషన్ బిల్లును ముందుకు తీసుకురావడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మమతా బెనర్జీ స్పష్టం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చడాన్ని ఈ దేశాన్ని విభజించడాన్ని ఇతర రాష్ట్రాల ఖర్చుతో బీజేపీ పాలిత రాష్ట్రాలకు అధిక ప్రాతినిధ్యం కల్పించేలా రాజకీయ సరిహద్దులను తిరిగి గీస్తూ, అధికారాన్ని హస్తగతం చేసుకోవడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తేల్చి చెప్పారు. ఇది సమాఖ్య వ్యవస్థపై, ప్రజాస్వా మ్యంపై దాడిగా ఆమె అభివర్ణించారు. మోడీసర్కార్ ఇలా చేస్తుంటే తాము మౌనంగా చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లపై మోడీ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే 2023 సెప్టెంబర్ 28వ తేదీన మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందిన తర్వాత దాదాపు 3 ఏళ్లపాటు ఎందుకు వేచి చూసిందని ప్రశ్నించారు. ప్రస్తుతం దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నప్పుడు ఎందుకు హడావుడిగా తీసుకువచ్చారని నిలదీశారు. అంతేకాకుండా మహిళా రిజర్వేషన్ల బిల్లును డీలిమిటేషన్‌తో ఎందుకు జత చేశారని అడిగారు. దశాబ్దాలుగా మహిళల పక్షాన నిలబడిన పార్టీ తృణమూల్ కాంగ్రెస్ అని తేల్చి చెప్పారు. ఇక ముందు కూడా మహిళల వైపే నిలబడుతుందని స్పష్టం చేశారు. అదే సమయంలో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన ప్రసంగంపైనా మమతా బెనర్జీ మండిపడ్డారు. ఇంకోసారి జాతిని ఉద్దేశించి ప్రసంగించినప్పుడు పార్లమెంట్ నుంచి మాట్లాడే ధైర్యం చేయాలని ప్రధానికి హితవు పలికారు. పార్లమెంటులో అయితే నిశిత పరిశీలనకు, సవాలుకు, జవాబుదారీతనానికి లోబడి ఉంటారని పేర్కొన్నారు. ఇలా కెమెరా ముందు మాట్లాడటం అంటే అది పిరికితనం, కపటత్వం, రెండు నాలుకల ధోరణి అని మండిపడ్డారు. అధికారం చేతుల నుంచి జారిపోతుందని మోడీ గుర్తించారని అందుకే దాన్ని కాపాడుకునేందుకు వారు ఎంతకైనా తెగించడానికి సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు.

# యెడప్పాడిలో టివికె అభ్యర్థి నామినేషన్ తిరస్కృతి

## స్వతంత్ర అభ్యర్థికి మద్దతు తెలిపిన టివికె విజయ్



**యెడప్పాడి, ఏప్రిల్ 19:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ సేలం జిల్లాలోని ఎడప్పాడి నియోజకవర్గంలో అనూహ్య రాజకీయ పరిణామం చోటు చేసుకుంది. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగంపార్టీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైంది. దాంతో ఒక స్వతంత్ర్య అభ్యర్థికి టీవీకే మద్దతు ప్రకటించింది. టీవీకే చీఫ్ విజయ్ తీసుకున్న ఈ నిర్ణయం ఆ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఎడప్పాడి నుంచి టీవీకే తరఫున దాఖలైన నామినేషన్‌ను అధికారులు తిరస్కరించడంతో పార్టీ శ్రేణులు నిరాశకు గురయ్యాయి. ఈ తరుణంలో అధ్యక్షుడు విజయ్ ఆకస్మిక నిర్ణయం తీసుకున్నారు. యెడప్పాడిలో స్వతంత్రఅభ్యర్థిగా బరిలో ఉన్న ప్రేమ కుమార్‌కు పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని ఎక్స్ వేదికగా ప్రకటించారు. ప్రేమకుమార్ తన చిరకాల మిత్రుడని, గతంలో తన అభిమాన సంఘం నిర్వాహకుడిగా పనిచేశాడని, సోదర సమానుడని విజయ్ తన పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేమకుమార్‌కు అండగా నిలవాలని పార్టీ ఏకగ్రీవంగా నిర్ణయించిందని విజయ్ తెలిపారు. ఎడప్పాడిలోని పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు, ఓటర్లు ప్రేమ్‌కుమార్‌కు కేటాయించిన టెలివిజన్ సెట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజయ్ విజ్ఞప్తి చేశారు. బ్యాలెట్‌లోని గుర్తును, దాని సీరియల్ నెంబర్‌ను గుర్తించి ఓటు వేయాలని కోరారు. టీవీకే అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైనప్పటికీ ప్రేమకుమార్‌ను టీవీకే ప్రతినిధిగానే భావిస్తున్నామని అన్నారు. ఆయన గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజయ్ తన సందేశంలో పేర్కొన్నారు. పార్టీ ఎదుగుదలను అడ్డుకోవాలని చూస్తున్న వారికి ప్రేమకుమార్ గెలుపు ఒక గుణపాఠం అవుతుందని విజయ్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఏఐఏడీఎంకే సీనియర్ నేత ఎడప్పాడి కే పళనిస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో టీవీకే మద్దతుతో బరిలో నిలిచిన స్వతంత్ర్య అభ్యర్థి కారణంగా పోటీ మరింత ఆసక్తి రేపుతోంది.

# ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ విజేతగా గోవా సుందరి

## సాధ్వి సతీష్ సెయిల్‌కు మిస్ ఇండియా వరల్డ్ కిరీటం



**భువనేశ్వర్, ఏప్రిల్ 19:** ఫెమినా 61వ మిస్ ఇండియా వరల్డ్ పోటీల్లో విజేతగా గోవా సుందరి సాధ్వి సతీష్ సెయిల్ నిలిచింది. రజనిగంధ పెరల్స్, కెఐఐటి భువనేశ్వర్‌లు సంయుక్తంగా ఈ ఫెమినా మిస్ ఇండియా ప్రపంచ సుందరి పోటీలను నిర్వహించారు. భువనేశ్వర్‌లో జరిగిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా వచ్చిన అభ్యర్థులమధ్య సాధ్వి సతీష్ గట్టిపోటీ ఎదుర్కొంది. ఈపోటీల్లో రాజ్‌నందిని పవార్ మొదటి రన్నరప్‌గా నిలిచింది. గోవాకు చెందిన మోడల్, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తగా రాణిస్తోంది. గతంలో కూడా అనేక ఫ్యాషన్‌షోల్లోను, బ్రాండ్ల ప్రచారాల్లోను పాల్గొంది. కాలిఫోర్నియా బుర్రిటోకు ఆమె బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచింది. నిర్మాణరంగంలోను, అభివృద్ధిరంగంలోను సహభాగ స్వామిగా ఒక కంపెనీని కూడా ప్రారంభించింది. మోడలింగ్‌కెరీర్‌తోపాటు బిజినెస్‌పరంగా కూడా సాధ్విసతీష్ రాణిస్తోంది. ఈ పోటీల్లో పాల్గొనన అనుభవం స్నేహం, అభ్యర్థులమధ్య అవగాహన పరస్పరం పంచుకోడానికి వేదిక అయిందని ఆమె వ్యాఖ్యానించింది. అంతకుముందు మిస్ ఇండియా వరల్డ్ విజేత నికితా పోర్వాల నుంచి ఆమె కిరీటం అందుకుంది. గత ఏడాదిసుందరి సాధ్వి సతీష్ సెయిల్‌కు కిరీటాన్ని అలంకరించింది. భారత్ తరపున ఆమె 2027లో జరిగే మిస్ వరల్డ్‌పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

# భారత్‌తో మా బంధం ఐదువేల యేళ్లనాటిది..

## డాక్టర్ అబ్దుల్ మజిద్ హాకీమ్ ఇలాహి



**టెహ్రాన్; ఏప్రిల్ 19:** హర్మూజ్ జలసంధిని దాటేందుకు ప్రయత్నించిన రెండు భారతీయ నౌకలపై ఐఆర్జీసి జరిపిన కాల్పులు ఇపుడు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను రాజేసాయి. అదృష్టవశాత్తు ఈ కాల్పుల్లో నౌకలోని ట్యాంకర్లు, సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు తెలుస్తుండగా దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూనే ఢిల్లీలోని ఇరాన్ రాయబారికి సమన్లు జారీ చేసింది. ఈక్రమంలోనే తాజాగా ఇరాన్ కూడా ఈ దాడులపై స్పందించింది. తాము ఇండియాను లక్ష్యంగా చేసుకోలేదని, తమకు మద్దతు ఇవ్వని దేశాలపైనే దాడులకు పాల్పడుతున్నట్లు స్పష్టం చేసింది. భారత దేశంతో తమ బంధం అత్యంత దృఢంగా ఉందని చెప్పింది. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన భారత విదేశాంగ శాఖ ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని పిలిపించి గట్టి హెచ్చరికలు జారీ చేసింది. విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఈ సందర్భంగా భారత్ తరపున తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నౌకల భద్రత, నావికుల రక్షణ విషయంలో భారత్ రాజీ పడదని స్పష్టం చేశారు. గతంలో భారత్‌కు వస్తున్న నౌకల సురక్షిత ప్రయాణానికి ఇరాన్ సహకరించిందని గుర్తు చేస్తూ తక్షణమే ఈ ఉద్రిక్తతలను తగ్గించి సాధారణ స్థితిని పునరుద్ధరించాలని కోరారు. ఈ ఉద్రిక్తతల మధ్య భారత్‌లో ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి డాక్టర్ అబ్దుల్ మజిద్ హాకీమ్ ఇలాహి చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. జాతీయ వార్తా సంస్థతో మాట్లాడిన ఆయన భారత్, ఇరాన్ మధ్య సంబంధాలు అత్యంత దృఢంగా ఉన్నాయని ఉద్ఘాటించారు. మా మధ్య ఉన్న బంధం కేవలం రాజకీయమైనది కాదు. ఇది 5 వేల ఏళ్ల చరిత్ర, సంస్కృతి, నాగరికతతో ముడిపడి ఉంది. భారత్ ప్రధాని మోడీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌ల మధ్య చర్చలు విజయవంతంగా సాగాయని పేర్కొన్నారు. నౌకలపై కాల్పుల ఘటన గురించి తనకు పూర్తి వివరాలు తెలియవని, ఈ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# బెంగాల్ మహిళలకు మమత వెన్నుపోటు

## బంకురా ఎన్నికల ప్రచారసభలో ప్రధాని మోడీ ధ్వజం

**కోల్‌కత్తా, ఏప్రిల్ 19:** పశ్చిమ బెంగాల్‌లోని మహిళలకు మమతా బెనర్జీ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని ప్రధాని మోడీ విమర్శించారు. కాంగ్రెస్‌తో కలిసి మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిందన్నారు. బెంగాల్‌లోని బంకురాలో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోడీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ ప్రభుత్వంపై విమర్శలు కురిపించారు. పశ్చిమ బెంగాల్ ప్రజలకు పలు హామీలు ఇచ్చారు. పశ్చిమ బెంగాల్ మహిళలు తమకు 33 శాతం రిజర్వేషన్లు కావాలని కోరుకుంటున్నారు. 2029 నుంచి ఇది అమలులోకి రావాలని కోరుకున్నారు. నేను కూడా ఇందుకు ప్రయత్నించా. టీఎంసీ మాత్రం దీన్ని వ్యతిరేకించింది. పార్లమెంట్‌లో ఏం జరిగిందో అందరూ చూశారు. కాంగ్రెస్ పార్టీతో కలిసి మహిళలకు టీఎంసీ వెన్నుపోటు పొడిచింది. బెంగాల్ ఆడబిడ్డలు ఎమ్మెల్యేలు, ఎంపీలు కాకూడదని టీఎంసీ కోరుకుంటోంది. వారి మహా జంగిల్ రాజ్యాన్ని అడ్డుకుంటారనే మమతా బెనర్జీ పార్టీ ఇదంతా చేస్తోంది. ప్రజలు జంగిల్ రాజ్యాన్ని ఓడించాలి. గిరిజనుల అభ్యున్నతి కోసం బీజేపీ పని చేస్తోంది. తొలిసారి ఒక గిరిజన మహిళను రాష్ట్రపతిని చేసిన పార్టీ బీజేపీ. ఈరోజు ప్రపంచం అంతా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును గౌరవిస్తోంది. కానీ, రాష్ట్రపతిని టీఎంసీ ప్రభుత్వం అవమానించిందని ప్రధాని మండిపడ్డారు. ద్రౌపది ముర్ము బెంగాల్ పర్యటనకు వచ్చినప్పుడు ఎలా అవమానించారో తెలుసు. ఈ చర్య ద్వారా గిరిజన తెగల్ని కూడా ఆ పార్టీ అగౌరవపరిచింది. టిఎంసి నిత్యం గిరిజనుల్ని అవమానిస్తూనే ఉంది. రాష్ట్రపతిని అవమానించడాన్ని గిరిజనులు ఎప్పటికీ మర్చిపోరు. గిరిజనుల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ కేటాయిస్తాం. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే పేద మహిళలకు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తాం. ఉచితంగా డయాలసిస్ నిర్వహిస్తాం అని మోడీ వ్యాఖ్యానించారు. పశ్చిమబెంగాల్‌లో ఈనెల 23,29 తేదీల్లో ఎన్నికలు జరగబోతున్న సంగతి తెలిసిందే.

# మంటల్లో పశ్చిమాసియా

## బాబ్ ఎల్ మాండెబ్ జలసంధిని మూసేస్తాం..




### అమెరికాకు హౌతీల హెచ్చరిక

**సనా,ఏప్రిల్ 19:** అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కలిసి తమపై చేస్తున్న దాడులకు ప్రతీకారంగా ప్రపంచ చమురు రవాణాకు కీలకంగా ఉన్న హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ప్రపంచ వ్యాప్తంగా గ్యాస్, ముడి చమురు రవాణా కొరత ఏర్పడటం ఇప్పుడు అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసిన సంగతి తెలిసిందే. కాల్పుల విరమణ నేపథ్యంలో హార్మూజ్ జలసంధిని తెరిచినట్లు ప్రకటించిన ఇరాన్ అమెరికా తీరుతో మళ్లీ మూసివేసినట్లు ప్రకటించింది. మరోసారి ప్రపంచ దేశాల్లో చమురు సంక్షోభ భయాలు నెలకొన్నాయి. హార్మూజ్ జలసంధి మూసివేతతోపాటు ఇపుడు మరో మరో జలసంధికి ప్రమాదం ఏర్పడింది. ట్రంప్ దూకుడు విధానాలు తగ్గించుకోకపోతే బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసివేస్తామని హౌతీలు ప్రకటించారు. యెమన్, జిబౌటి మధ్య ఉన్న బాబ్ అల్ మాండెబ్ జలసంధి ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తుంది. ఇది సూయజ్ కెనాల్‌కు వెళ్లే మార్గంలో ఉన్న మరో జలసంధి కావడం గమనార్హం. ప్రపంచశాంతికి భంగం కలిగించే చర్యలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొనసాగిస్తే తాము బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసివేస్తామని తాజాగా యెమెన్‌లోని హౌతీలు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇక ఈ బాబ్ అల్‌మాండెబ్ జలసంధిని తాము ఒక్కసారి మూసివేస్తే తిరిగి దాన్ని ప్రారంభింపచేయడం ప్రపంచంలోని ఏ ఒక్కరికీ సాధ్యం కాదని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలోనే హౌతీ ప్రభుత్వ విదేశాంగశాఖ ఉప మంత్రి హుస్సేన్ ప్రకటించారు. ప్రపంచ శాంతిని చెడగొట్టి ఉద్రిక్తతలు పెంచే అన్ని చర్యలను తక్షణమే డొనాల్డ్ ట్రంప్ ఆపాలని హౌతీలు వార్నింగ్ ఇచ్చారు. ప్రస్తుతం అమెరికా చేస్తున్న విధ్వంసం నుంచి వెనక్కి వెళ్లాలని ఈ యుద్ధంపై అమెరికాకు సహకరిస్తున్న దేశాలకు కూడా హౌతీలు హెచ్చరికలు చేశారు. అలా చేయడమే అందరికీ మంచిదని పేర్కొన్నారు. మరోవైపు ఇజ్రాయెల్‌తో లెబనాన్ చేసుకున్న ఏకపక్ష కాల్పుల విరమణ ఒప్పందం తీవ్ర అవమానకరమని హెజ్‌బొల్లా సెక్రటరీ జనరల్ నయీమ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ కాల్పుల విరమణకు హెజ్‌బొల్లా కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు.

## మీరే అనుమతిచ్చి..మీరే కాల్పులు జరుపుతున్నారు!


### ఇరాన్ ఐఆర్జీసీతో ట్యాంకర్ కెప్టెన్ సంభాషణలు లీక్



**టెహ్రాన్, ఏప్రిల్ 19:** హార్మూజ్ జలసంధిని దాటేందుకు శనివారం ప్రయత్నించిన రెండు భారతీయ ట్యాంకర్లపై ఇరాన్ దళాలు జరిపిన కాల్పులకు సంబంధించి ఒక భారతీయ ట్యాంకర్ కెప్టెన్ ఇరాన్ నేవీతో జరిపిన సంభాషణ ఆడియో క్లిప్ వెలుగులోకి వచ్చింది. హార్మూజ్‌లో వెళ్లేందుకు మీరు అనుమతి ఇచ్చారు, ఇప్పుడు కాల్పులు జరుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సన్మార్ హెరాల్డ్ అనే ట్యాంకర్ కెప్టెన్ ఇరాన్ నేవీతో ఇలా మాట్లాడుతూ సెపా నేవీ! సెపా నేవీ! ఇది సన్మార్ హెరాల్డ్ అనే మోటార్ ట్యాంకర్. వెళ్ళడానికి మీరు నాకు అనుమతి ఇచ్చారు. మీ జాబితాలో నా పేరు రెండవది. మీరు నాకు వెళ్ళడానికి అనుమతి ఇచ్చారు. మీరు ఇప్పుడు కాల్పులు జరుపుతున్నారు. నన్ను వెనక్కి తిరగనివ్వండి అని అన్నారు. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) సిబ్బంది కాల్పులు జరుపడంతో భారత్‌కు చెందిన ఆ రెండు ట్యాంకర్లు తమ మార్గాన్ని మార్చుకున్నాయి. ఇందులో ఒకటైన సూపర్ ట్యాంకర్ సుమారు 20లక్షల బ్యారెళ్ల ఇరాకీ చమురును తీసుకువెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. రెండు నౌకలను పశ్చిమం వైపు మళ్లిస్తున్న సమయంలో ఐఆర్జీజీసీ గన్‌బోట్లు కాల్పులు జరిపినట్లు ఆడియో ఇంటర్‌సెప్ట్‌లు సూచించాయి. ఈ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మరోవైపు హార్మూజ్ జలసంధిలోని వాణిజ్య నౌకలకు ఐఆర్జీసీ హెచ్చరిక జారీ చేసింది. ఓడలన్నిటికీ గమనిక, చర్చలలో అమెరికా ప్రభుత్వం తన నిబద్ధతను నెరవేర్చడంలో విఫలమైనందున, హార్మూజ్ జలసంధిని మరోసారి పూర్తిగా మూసివేస్తున్నాం. ఏ రకమైన లేదా ఏ దేశానికి చెందిన ఓడ కూడా హార్మూజ్ జలసంధి గుండా వెళ్ళడానికి అనుమతించబోమని ఇరాన్ పేర్కొంది.

## మాపై దాడికి దిగితే శత్రువుల జీవితంలో అదే పెద్ద తప్పు

### అమెరికా, ఇజ్రాయెల్‌కు ఇరాన్ హెచ్చరిక



**టెహ్రాన్, ఏప్రిల్ 19:** పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ వాతావరణం నెలకొంది. తమపై దాడికి ప్రయత్నిస్తే అది శత్రువుల జీవితంలో అతిపెద్ద తప్పు అవుతుందని అమెరికాను ఇరాన్ తీవ్రంగా హెచ్చరించింది. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తమ జోలికి వస్తే చూస్తూ ఊరుకోబోమని, పూర్తి బలం తో విరుచుకుపడతామని ఇరాన్ సైనిక ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ముందుగా ఎవరిపైనా దాడి చేయబోమని, కానీ తమ సార్వభౌమత్వానికి భంగం కలిగిస్తే మాత్రం ప్రతిస్పందన ఊహకు అందదని తేల్చిచెప్పారు. ఇప్పటికే కీలక ప్రాంతాల్లో క్షిపణి వ్యవస్థలను మోహరించినట్లు ఇరాన్ వెల్లడించింది. కొంతకాలంగా ఇరాన్ అణు కార్యక్రమాలు, రక్షణఒప్పందాలపై అమెరికాఅభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. దీనికి తోడు పశ్చిమాసియాలోని కీలక జలసంధుల్లో అమెరికా నౌకాదళం గస్తీ పెంచడం వివాదాన్ని మరింత తీవ్రతరం చేసింది. దీనికి ప్రతిగా ఇరాన్ తన సైనిక శక్తిని ప్రదర్శిస్తూ, అత్యాధునిక డ్రోన్లు, సుదూర క్షిపణులను ప్రదర్శనకు ఉంచింది. ఇరాన్ హెచ్చరికలతో ప్రపంచ దేశాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. చిన్న పొరపాటు జరిగినా అది పెద్దయుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని విశ్లేష కులు అభిప్రాయపడుతున్నారు. ఐక్యరాజ్యసమితి శాంతియుత పరిష్కారానికి పిలుపునిస్తున్నప్పటికీ, ఇరు దేశాలు వెనక్కి తగ్గడం లేదు.

## కాల్పుల ఘటనను ప్రశ్నించిన జర్నలిస్టును 'ఔట్' అన్న ట్రంప్



**వైట్‌హౌస్, ఏప్రిల్19:** ఇరాన్‌పరిధిలో ఉన్న హార్మూజ్‌జలసంధిమీదుగా వస్తున్న రెండు భారత నౌకలపై జరిగిన దాడిపై వైట్‌హౌస్ మీడియా సమావేశంలో ఒక ప్రశ్నవేసిన ఓ జర్నలిస్ట్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఓ జర్నలిస్ట్ హార్మూజ్ జలసంధిలో భారత జెండా కలిగిన నౌకలపై కాల్పులు జరిగాయి. దీని గురించి ఏమంటారు అని ప్రశ్నించారు. దాంతో ట్రంప్ కోపం పట్టలేకపోయారు. దురుసుగా అవుట్ అన్నారు. అందుకు సం బంధించిన వీడియోను శశాంక్ మట్టు అనే వ్యక్తి ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఆ వీడియో కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దాంతో ట్రంప్ ప్రవర్తనపై నెటిజన్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా భారతీయులు ట్రంప్ తీరును తీవ్రంగా తప్పుబడుతున్నారు. ట్రంప్ కారణంగానే ప్రపంచ దేశాలకు ఆయిల్,గ్యాస్ కష్టాలు వచ్చాయని మండిపడుతున్నారు. హార్మూజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. హార్మూజ్ తెరుచుకోవటంతో ప్రపంచ దేశాలు ఊపిరి పీల్చుకున్నాయి. హార్మూజ్ దిగ్బంధనం కొనసాగిస్తామని ట్రంప్ ప్రకటించటంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్ మళ్లీ జలసంధిని మూసి వేసింది. హార్మూజ్ జలసంధి గుండా వెళ్తున్న రెండు భారత వాణిజ్య నౌకలపై ఐఆర్‌జీసీకి చెందిన ఇరాన్ గన్‌బోట్లు కాల్పులు జరిపాయి.

# మేడిగడ్డకు మరమ్మతులు.. రంగంలోకి స్టీరింగ్ కమిటీ

## 14 రకాల పరీక్షల తర్వాత బ్యారేజీ పటిష్టతపై అంచనా

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ బ్యారేజి పునరుద్ధరణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. బ్యారేజి పటిష్టతను శాస్త్రీయంగా అంచనా వేసేందుకు పక్కా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు, అవసరమైన అనుమతులు, ఫైనల్ డ్రాయింగ్స్ ఖరారు చేసేందుకు ఒక ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీని కూడా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. బ్యారేజి పునాదులు, నిర్మాణం ఏ మేరకు దెబ్బతిన్నాయనేది తేల్చడానికి అయుదు ప్రధాన విభాగాల్లో మొత్తం 14 రకాల పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జియో టెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షలతోపాటు నిర్మాణ దృఢత్వాన్ని పరీక్షి చే నాన్ డిస్ట్రక్టివ్ టెస్టులు, హైడ్రాలిక్, హైడ్రోలాజికల్ అధ్యయనాన్ని చేపట్టనున్నారు. బ్యారేజి ప్రస్తుత పటిష్ట స్థితిని అంచనా వేసే స్ట్రక్చరల్ హెల్త్ మానిటరింగ్ పరీక్షలు కూడా ఈ షెడ్యూల్‌లో ఉన్నాయి. ఈ భారీ కసరత్తును కేవలం రెండు నెలల కాలవ్యవధిలోనే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్‌కు చెందిన సైంటిస్టుల బృందం క్షేత్రస్థాయిలో పరీక్షలను ప్రారంభించింది. ప్రతిరోజూ జరుగుతున్న పరీక్షల పురోగతిపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు నివేదికలను తెప్పించుకుంటోంది. పనులను అత్యంత ప్రాధాన్యతతో పర్యవేక్షిస్తోంది. నిపుణుల కమిటీ ఇచ్చే ఈ నివేదిక ఆధారంగానే మేడిగడ్డ బ్యారేజి భవిష్యత్తు కార్యాచరణ, శాశ్వత మరమ్మతులపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.



పూజ కార్యక్రమంలో పాల్గొన్న చినజీయర్‌స్వామి, నిర్వాహకులు

## ఎకోరైజ్ ప్రాజెక్టును ప్రారంభించిన చినజీయర్‌స్వామి

**హైదరాబాద్ (అత్తాపూర్) ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్‌లో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ ప్రతిష్టాత్మక నివాస ప్రాజెక్టు ఎకోరైజ్‌కు ఆదివారం ఘనంగా శ్రీకారం చుట్టారు. త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి వారి దివ్య సమక్షంలో వారి మంగళాశాసనాలతో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ మంచి ఇల్లు కోరుకుంటారు కానీ నిజమైన ప్రశాంతత మనస్సులోనుంచే రావాలని ఆ ప్రశాంతతను కలిగించే వాతావరణం కలిగిన ఇళ్లు నిర్మించడమే ముఖ్యమని అన్నారు. నేడు పరశురామ జయంతతి, రేపు అక్షయ తృతీయ ఇంతటటి పుణ్యదినాల్లో ఇలాంటి శుభకార్యాన్ని ప్రారంభించడం శ్రేయస్కరమని ఆశిర్వదించారు. అనంతరం నిర్వాహకులఉు ప్రాజెక్టు గురించి వివరించారు. ప్రకృతి సౌందర్య ఆధునిక సౌకర్యాల సమ్మిళితంగా రూపుదిద్దుకుంటున్న ఈ ఎకోరైజ్ ప్రాజెక్టు ఆకర్షిణీయంగా నిలుస్తుందని ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉండటంతో గచ్చిబౌలి, హైటెకి సీటి ,శంషాబాద్ విమానాశ్రయాలకు సులభంగా చేరుకునే సౌలభ్య ఉందని తెలిపారు. నాణ్యమైన సేవలు అందించాలని లక్ష్యంతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.



ఆదివారం ఉద్యమకారిణి సత్తెమ్మ పాడె మోస్తున్న కెటిఆర్

## తెలంగాణ ఉద్యమకారిణి సత్తెమ్మకు కెటిఆర్ ఘన నివాళి

**వేములవాడ టౌన్, ప్రభాతవార్త:** వేములవాడ నియోజకవర్గం అగ్రహారానికి చెందిన ప్రముఖ ఉద్యమకారిణి తెలంగాణ సత్తెమ్మ మృతి పట్ల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్రసంతాపం వ్యక్తం చేస్తూ ఆమె భౌతికదేహానికి నివాళులర్పించడమే కాకుండా స్వయంగా పాడె మోశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో సత్తెమ్మ చురుకైన పాత్ర పోషించారు. ఉద్యమ సమయంలో ప్రతిరోజూ పాల్గొంటూ, 'జై తెలంగాణ' నినాదమే ఊపిరిగా జీవించిన ధీరవనిత ఆమె. స్వరాష్ట్ర సాధన కోసం సత్తెమ్మ చేసిన పోరాటం, ఆమె అంకితభావం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కెటిఆర్ కొనియాడారు. వేములవాడ మండలం అగ్రహారం ఆర్అండ్ఆర్‌కాలనీలో జరిగిన సత్తెమ్మ అంత్యక్రియలలో కెటిఆర్‌తో పాటు వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, మాజీ జెడ్పీ చైర్మన్ తుల ఉమ, నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, ఇతర పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని సత్తెమ్మకు కన్నీటి వీడ్కోలు పలికారు.

## మోడల్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్‌కు 82 శాతం హాజరు

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 194 మోడల్ స్కూల్స్‌లో 6వ తరగతిలో ప్రవేశాలతోపాటు, 7 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఖాళీల్లో సీట్లను భర్తీ చేయడం కోసం నిర్వహించిన తెలంగాణ స్టేట్ మెడల్ స్కూల్స్ అడ్మిషన్ టెస్ట్‌ను ఆదివారం ప్రశాంతంగా నిర్వహించినట్టు మోడల్ స్కూల్ అడిషనల్ డైరక్టర్ ఎస్ శ్రీనివాసాచారి తెలిపారు. పరీక్షకు 82.02 శాతం మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు. అడ్మిషన్ టెస్ట్‌కి 37,216 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 30,526 మంది హాజరయ్యారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం 208 పరీక్షా కేంద్రాలను, 7 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్ల కోసం నిర్వహించే పరీక్షకు 204 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 37,216 మంది దరఖాస్తు చేసుకున్నారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం 23,958 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 19,584 మంది(81.74శాతం) పరీక్షకు హాజరయ్యారు. 7వ తరగతిలో ప్రవేశాలకు 5117 మంది దరఖాస్తు చేసుకుంటే వారిలో 4281 మంది(83.66శాతం) హాజరయ్యారు. 8వ తరగతిలో చేరడానికి 4709 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 3908 మంది(82.99శాతం) పరీక్షకు హాజరయ్యారు. 9వ తరగతిలో చేరడానికి 2820 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 2277 మంది(80.74శాతం) హాజరయ్యారు. 10వ తరగతిలో చేరడానికి 612 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 476 మంది(77.78శాతం) పరీక్షకు హాజరయ్యారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 208 కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. 7 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేయడానికి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 204 కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు.

## కవిత పార్టీకి కార్మికులు మద్దతివ్వండి

### 25న మేడ్చల్‌లో పార్టీ ప్రకటన: రియాజ్ అహ్మద్

**నస్పూర్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** తెలంగాణ ఆడబిడ్డ కల్వకుంట్ల కవిత ఏర్పాటు చేయనున్న నూతన పార్టీకి సింగరేణి కార్మికులు, రాష్ట్ర ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఆదివారం మంచిర్యాల జిల్లా నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్ అద్వయ కన్వెన్షన్‌లో ఈనెల 25న కవిత కొత్త పార్టీని ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఈ పార్టీకి హెచ్ఎంఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సింగరేణి సమస్యల పరిష్కారం, కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఈ పార్టీ పనిచేస్తుందని వివరించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి సంస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని రియాజ్ అహ్మద్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సంస్థకు 50 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. కొత్త గనులు ఏర్పాటు చేయలేని స్థితిలో యాజమాన్యం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా కార్మికుల జీతాల కోసం ఓవర్ డ్రాఫ్ట్ తీసుకొని వడ్డీలు కట్టడం దారుణమన్నారు.

# ఆర్‌టిసికి అపాయింటెడ్ డేట్ ఇవ్వండి

## రవాణా మంత్రి పొన్నంకు ఐఎన్‌టియుసి నేతలు సంజీవరెడ్డి, ఎం రాజిరెడ్డి లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** ఆర్టీసికి వెంటనే అపాయింటెడ్ డేట్ ఇచ్చి ప్రభుత్వంలో విలీనం చేసుకోవాలని, ఉద్యోగులను మిగులు ఉద్యోగులుగా చూపుతూ వేధించడం మాను కోవాలని, ఆర్థికపరంగా ఎన్నో రోజుల నుంచి రావాల్సిన బెనిఫిట్స్, వేతన సవరణ వంటి కార్యక్రమాలు చేపట్టాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆర్టీసి జెఎసి కన్వీనర్ ఐఎన్‌టియుసి నాయకులు జి.సంజీవరెడ్డి,ఎం రాజిరెడ్డిలు డిమాండ్ చేస్తూ లేఖ రాశారు. ఆర్.టి.సి.లో ఎలక్ట్రిక్ బస్సులు రావడం వల్ల ఎక్సెస్ పేరుతో సిటీలో ఉన్న డ్రైవర్, కండక్టర్, మెకానిక్ అదనపు సిబ్బందిగా చూపుతూ వేరే రీజన్‌లకు పంపించాలని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకొని వారిని సిటీలోనే కొనసాగించాలని కోరారు. ఆర్.టి.సి.లో మహాలక్ష్మి ్మ స్కీము ప్రవేశపెట్టిన తర్వాత డ్రైవర్ కండక్టర్ల పై రాస్తున్న అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలనీ డిమాండ్ చేశారు. చట్ట వ్యతిరేక డ్యూటీలను రద్దు పరిచి ఎం.టి.డబ్ల్యూ యాక్ట్ ప్రకారం సవరించాలని పేర్కొన్నారు. డిపోలలో కార్మికులపై అధికారుల, సూపర్‌వైజర్‌ల వేధింపులు మానుకోవాలని, హైకోర్టు ఆదేశాల ప్రకారం, బ్రీత్ ఎనలైజర్ కేసులలో సదరు డ్రైవర్‌ను గవర్నమెంట్ హాస్పిటల్ కు పంపి గవర్నమెంట్ డాక్టర్ నిర్ధారించబడిన తర్వాతనే చర్యలు తీసుకోవాలనీ కోరారు. ఆర్.టి.సి.లోని వివిధ కేటగిరిలో ఉన్న ఖాళీలను రెగ్యులర్ ప్రాతిపదికన వెంటనే భర్తీ చేయడంతో పాటు బ్రెడ్ విన్నర్స్ స్కీమ్ లో తీసుకుని రిక్రూట్‌మెంట్ చేసుకునే వారిని రెగ్యులర్ ప్రాతిపదికని తీసుకోవాలీనీ జూనియర్ అసిస్టెంట్ పరీక్షలు రాసి పాసైన సంస్థ ఉద్యోగులను వెంటనే జూనియర్ అసిస్టెంట్‌గా నియమించాలని లేఖలో పేర్కొన్నారు. తార్నాక హాస్పిటల్‌లో ఉద్యోగులకు నాణ్యమైన వైద్య సదుపాయాన్ని అందించడంతోపాటు ఉద్యోగుల తల్లిదండ్రులను కూడా రిఫరల్ హాస్పిటల్ కు పంపి వైద్య సదుపాయం కల్పించాలనీ సూచిం చారు. గ్రేటర్ హైదరాబాద్ జోన్ అకౌంట్స్ విభాగంలో ప్రవేశపెట్టిన సెంట్రలైజేషన్ విధానాన్ని రద్దు పరచి పాత పద్ధతి లోనే కొనసాగించాలనీ సూచించారు. వాంట్ ఆఫ్ డ్రైవర్ సందర్భంలో కండక్టర్ కు వాంట్ ఆఫ్ కండక్టర్ సమయంలో డ్రైవర్లకు అటెండన్స్ ఇవ్వడంతోపాటు, స్పేర్ డ్యూటీ లో ఉన్న డ్రైవర్ కండక్టర్లకు డ్యూటీ దొరకని పక్షంలో అటెండెన్స్ ఇవ్వాలని కోరారు. డబుల్ డ్యూటీ కి డబుల్ వేతనం చెల్లించాలీనీ, ఆర్. పి. ఎస్ 2013,2017 కు సంబంధించిన పి.ఎఫ్ రికవరీ డబ్బులను కార్మికుల ఖాతాలలో వెంటనే డిపాజిట్ చేయడం ద్వారా రిటైర్ అయిన ఉద్యోగులకు పి.ఎఫ్ పెన్షన్ పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ను లేఖలో పేర్కొన్నారు.

# టారిఫ్ శ్లాబ్‌ల పద్ధతిని మార్చాలి

## విద్యుత్ డిస్కంలకు నియంత్రణ కమిషన్ ఆదేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** రూఫ్‌టాప్ సోలార్ వినియోగదారులకు భారీ ఊరటనిస్తూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. నెట్ మీటర్ ఉన్న సోలార్ రూఫ్‌టాప్ వినియోగదారుల కోసం, నికర వినియోగం అంటే దిగుమతులు మైనస్ ఎగుమతులు ఆధారంగా టారిఫ్ శ్లాబులను లెక్కించే పాత బిల్లింగ్ పద్ధతికి తక్షణమే తిరిగి మారాలని విద్యుత్ నియంత్రణ కమిషన్ రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ కంపెనీలకును ఆదేశించింది.

రాష్ట్రవ్యాప్తంగా ఇంటి పైకప్పు సౌర ఫలకాల వినియోగాన్ని ప్రోత్స హించడం, విద్యుత్ బిల్లింగ్‌లో పారదర్శకతను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. గతంలో, బిల్లింగ్ పద్ధతిలో మార్పు కారణంగా సౌర వినియోగదారులకు బిల్లులు పెరిగాయి. దీంతో వినియోగదారులు మరియు హరిత ఇంధన న్యాయవాదుల నుండి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. తప్పుల బిల్లింగ్ పద్ధతి కారణంగా ఈ వినియోగదారుల నుండి ఇప్పటికే వసూలు చేసిన అదనపు మొత్తాలను సర్దుబాటు చేయాలని దక్షిణ, ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలను ఆదేశించింది. వాపసులు లేదా క్రెడిట్‌లను తదుపరి మూడు బిల్లింగ్ సైకిళ్లకు వర్తింపజేయాలని కమిషన్ తన ఉత్తర్వులో పేర్కొంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, తెలంగాణ పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహిస్తున్న తరుణంలో ఈ ఆదేశం వెలువడటం విశేషం. ఈ మార్పులను వెంటనే అమలు చేసి, అమలు చేసినట్లు నివేదించాలని డిస్కామ్‌లకు ఆదేశాలు జారీ చేయబడ్డాయి.

## పిసిసి ప్రోటోకాల్ చైర్మన్‌గా హర్కర వేణుగోపాల్‌రావు నియామకం

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** అఖిలభారత కాంగ్రెస్ కమిటీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సూచనలకు అనుగుణంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రోటోకాల్ కోఆర్డినేషన్ కమిటీని పునర్వ్యవస్థీకరణ చేశారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ 8 మందితో కూడిన ప్రోటోకాల్ సమన్వయ కమిటిని ఆదివారం ప్రకటించారు.

ప్రోటోకాల్ చైర్మన్‌గా హర్కర వేణుగోపాల్ రావు(ప్రభుత్వ సలహాదారు)ను తిరిగి నియమించారు. వైస్ చైర్మన్‌గా కిశోర్ రెడ్డి, కన్వీనర్‌గా ఎం.ఏ. ఫహీమ్ నియ మితుల య్యారు. అలాగే సభ్యులుగా ఎన్.భానుప్రకాష్ రెడ్డి, కెవి ప్రసాద్, సురజ్ తివారి, సుదిని మహేందర్, అల్లం రాకేష్ నియ మితులయ్యారు.

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తున్న బిజెపి

## ఎన్ఎస్‌యుఐ జాతీయ అధ్యక్షుడు వినోద్‌జాఖర్

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** కర్ణాటక బిజెపి ఎంపి తేజస్వి సూర్య పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాపనను పాకిస్తాన్‌తో పోల్చుతూ చేసిన అవమానకర వ్యాఖ్యలు చేయడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయనీ తెలంగాణ బిజెపి నాయకులు కూడా మౌనంగా ఉండటం బాధకరంగా ఉందని ఎన్ఎస్‌యుఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్ అన్నా రు. ఆదివారం గాంధీభవన్ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్ తెలంగాణ పర్యటన సందర్భంగా, ఎన్ఎస్‌యుఐ తెలంగాణ నాయకుడు వినయ్ పటేల్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో నిరసన కార్యక్రమం నిర్వహిం చబడింది. ఈ సందర్భంగా వినోద్ కర్ణాటక బిజెపి ఎంపి తేజస్వి సూర్య పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాపనను పాకిస్తాన్‌తో పోల్చుతూ చేసిన అవమానకర వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయనీ ఈ వ్యాఖ్యలను ఎన్ఎస్‌యుఐ తీవ్రంగా ఖండిస్తుందనీ చెప్పారు. తెలంగాణ స్వాభిమానాన్ని అవమానించే ప్రతి ప్రయత్నాన్ని విద్యార్థి శక్తి తిప్పికొడుతుందనీ హెచ్చరిం చారు. ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు సహజమే కానీ, తెలంగాణను తక్కువ చేసి చూపే వ్యాఖ్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం అన్నారు. తెలంగాణ గౌరవం కోసం, విద్యార్థుల హక్కుల కోసం, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుంది! తెలంగాణ ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూడటం మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈ నేపథ్యంలో, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలు, తెలంగాణపై చూపు తున్న వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. బిజెపి నాయకులు నరేంద్ర మోదీ, కిషన్ రెడ్డి, బండి సంజయ్ మరియు తేజస్వి సూర్య వంటి నేతల వైఖరిపై తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తూ, వారి విధానాలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు.

## భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



# మహిళా రిజర్వేషన్‌కు ఇండి అలయెన్స్ వ్యతిరేకం కాదు.. డీలిమిటేషన్‌కు వ్యతిరేకం

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** మహిళా రిజర్వేషన్‌కు ఇండియా కూటమిపై బిజెపి దేశ వ్యాప్తంగా దుష్ప్రచారం చేస్తోందనీ, మేము మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు డీలిమిటేషన్ కు మాత్రమే వ్యతిరేకమనీ భువనగరి ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. గాంధీ భవన్‌లో ఆదివారం మాట్లడుతూ 2027 జనగణన తర్వాత డీలిమిటేషన్ జరగాలికానీ ప్రధానమంత్రి మోడీ తమిళనాడు, బెంగాల్ ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం 16,17,18 తేదీల్లో ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు పెట్టారనీ దుయ్యబట్టారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్, ఇండియా కూటమి వ్యతిరేకం కాదు కానీ ప్రధానమంత్రి నరేంద్రమోడీ శనివారం జాతినుద్దేశించి ప్రసంగిస్తూ దేశ మహిళలను తప్పుదారిపట్టించే విధంగా మాట్లాడారని విమర్శించారు. మాహిళా రిజర్వేషన్ల బిల్లు 2023 లోనే ఆమోదం పొందిందనీ 2024 తర్వాత మహిళా రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయలేదనీ ఆయన ప్రశ్నించారు. 543 లోక్‌సభ స్థానాలకు 33శాతం మహిళా రిజర్వేషన్లు అమ లు చేయాలని కాంగ్రెస్ అలయన్స్ ఉద్దేశ్యమని చెప్పారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లను అమలుచేస్తామని చెప్పిందే మోడీ, అమిత్‌షాలని ఆయన గుర్తుచేశారు. 33 శాతం రిజర్వేషన్లు ఇప్పుడు అమలు చేసినా మాకు ఇబ్బంది లేదు డీలిమిటేషన్ చేయాలంటే అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకోవాలని కోరారు. ఉత్తర భారతం, దక్షిణ భారతం మధ్య అంతరం లేకుండా డీలిమిటేషన్ చేయండనీ కోరారు. గతంలో ఇందిరాగాంధీ, వాజ్‌పాయ్ అను సరిం చిన విధానాలను అమలు చేయండనీ సూచిం చారు. డీలిమిటేషన్‌ను ఇష్టం వచ్చినట్లు చేసుకుని ఎప్పటికీ అధికారంలో ఉండాలని బిజెపి భావిం చడం వలనే మేము వ్యతిరేకించామనీ తెలిపారు. ఎస్.ఐ.ఆర్‌ను ఏవిధంగా అమలుచేసి తమ ఇష్టం వచ్చినట్లు ఓట్లు తొలగించారో డీలిమిటేషన్ ద్వారా తమ ఇష్టం వచ్చినట్లు చేసుకోవాలని ప్రయత్నం మోడీ షా ద్వయం చేశారనీ ఆరోపించారు.

# సంచార కులాలకు డిఎన్‌టీ సర్టిఫికెట్లు

## జాతీయ డిఎన్‌టీ బోర్డుతో బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** తెలంగాణలోని సంచార, అర్ధసంచార, డీ నోటిఫైడ్ ట్రైబ్స్ (డీఎన్‌టీ) కులాలకు సర్టిఫికెట్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్ తెలిపారు. రాష్ట్రంలోని డీఎన్‌టీ, సంచార, అర్ధసంచార కులాలను సమగ్ర అధ్యయనం ద్వారా గుర్తించి రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేశామన్నారు. ఈ సిఫారసులను ప్రభుత్వ ఆమోదించిన తదుపరి ఆయా కులాల వారికి డీఎన్‌టీ సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లుగా తెలిపారు. కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన డీనోటిఫైడ్, సంచార, అర్ధసంచార జాతుల అభివృద్ధి, సంక్షేమ బోర్డు (జాతీయ డీఎన్‌టీ బోర్డు) ఆధ్వర్యంలో సంచార, అర్ధ సంచార జాతుల కోసం చేపడుతున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ డీఎన్‌టీ బోర్డు సభ్యులు భారత్భాయ్ బాబుభాయ్ పాట్ని, ప్రవీణ్ శివాజి రావ్ ఘుగే బీసీ కమిషన్‌తో భేటీ అయింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సీడ్ పథకంలో అర్హులను గుర్తించడానికి డీఎన్‌టీ సర్టిఫికేట్ల జారీ గురించి చర్చించారు.

ఇందులో రాష్ట్రంలో తమ ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను గూర్చి బోర్డు సభ్యులకు వివరించారు. అనంతరం జాతీయ డీఎన్‌టీ బోర్డు సభ్యులు మాట్లాడుతూ దేశంలో ఇటివరకు 7 రాష్ట్రాలలో మాత్రమే డీఎన్‌టీ సర్టిఫికేట్లు జారీ చేస్తున్నారని, మిగతా రాష్ట్రాలలో కూడా డీఎన్‌టీ సర్టిఫికేట్లు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా రాష్ట్రాలను సందర్శించి, సంబంధిత అధికారులకు అవగాహన కల్పిస్తున్నట్లుగా పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలుచేస్తున్న ఈ పథకంలో విద్యార్థులు వివిధ ప్రవేశ పరీక్షలు, ఉద్యోగ సంబంధిత పరీక్షల కోసం శిక్షణ పొందడానికి స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తున్నట్లుగా వివరించారు.. ఉపాధికల్పన, గృహ నిర్మాణం తదితర అంశాల కోసం లబ్దిదారులకు ఆర్థిక సాయం అందిచనున్నట్లు చెప్పారు. ఇందులో డీప్యూటీ డైరెక్టర్ యు.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె.మనోహర్‌రావు, ప్రత్యేక అధికారి ఎన్.సునీత తదితరులు పాల్గొన్నారు.

# వంచన, అసత్యాలతో కూడిన ప్రధానమంత్రి ప్రసంగం

## ఎక్స్ వేదికగా మల్లు రవి ఆరోపణలు

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ వంచన, అసత్యాలతో జాతిని ఉద్దేశించి ప్రసంగించారని ఎంపి మల్లురవి ఆరోపణలు చేశారు. ఎక్స్ వేదికగా ఆయన ట్వీట్ చేస్తూ భారత ప్రధాని హోదాలో ఇంత అసత్యాలతో కూడిన దిగజారుడు ప్రసంగం వస్తుందని అనుకోలేదని, గతంలో ఎవరు ఇలాంటి వంచనపూరిత ప్రసంగం ఎవరు చేయలేదని భవిష్యత్ ప్రధానులు కూడా బహుశా చేయరని ఆయన వ్యంగ్యమాడారు. కాంగ్రెస్, టిఎంసి, డిఎంకె, సమాజ్‌వాది పార్టీలు 16,17 తేదీల్లో కూడా ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సీట్లలో 33శాతం రిజర్వేషన్ మహిళలకు రిజర్వుచేయడానికి బిల్లును మార్పుచేయాలని సూచించామని గుర్తుచేశారు. 2027 తరువాత జనాభాలెక్కల ప్రాతిపదికన నియోజకవర్గాలను పునర్విభజన చేద్దామని సూచించామని కూడ తెలిపినా మూడింట రెండో వంతు బలం లేకపోయినా పశ్చిమబెంగాల్, తమిళనాడు ఎన్నికలలో లబ్ధిపొందేందుకు మాత్రమే రాజ్యాంగసవరణ131 బిల్లును తీసుకొచ్చి దేశ మహిళ మహిళలను మోసగించాలని ఆయన వ్యక్తంచేశారు.

మహిళల మనోభావాలతో ఆటలాడకుండా వారి ఆత్మస్థైర్యం పెంచడానికి ఇప్పటికైన ప్రియాంకగాంధి చెప్పినట్లు ప్రస్తుత సంఖ్యలోనే మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించి రిజర్వుడు స్థానాలను గుర్తించి నోటిఫైడ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు, దీనికోసం వెంటనే పార్లమెంట్‌ను సమావేశపరచాలని కోరారు. దక్షిణభారతదేశంలో సీట్ల సంఖ్య తగ్గించి రాజకీయాధిపత్యంతో ఇక్కడి వనరులను సంపదను కొల్లగొట్టాలనే దురుద్దేశ్యంను బిజెపియేతర పక్షాలు కశ్మీర్ నుంచి కన్యాకుమారిదాక ఏకమై భగ్నంచేశాయని ట్వీట్‌లో ఆయన వివరించారు.




ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సముద్రాల వెంకట రంగరామానుజాచార్య స్వామి

## ఘనంగా కందాడై రామానుజాచార్యులు 83వ తిరునక్షత్ర మహోత్సవం

**హైదరాబాద్ (సైదాబాద్), ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** ఉ.వే.పం.శ్రీమాన్ కందాడై రామానుజాచార్యులు 83వ తిరునక్షత్ర మహోత్సవాన్ని ఆదివారం సాయంత్రం సైదాబాద్ కాలనీలోని శ్రీ సుదర్శన లక్ష్మణ హనుమత్సమేత సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఉభయ వేదాంత పండిత పరిషత్తు కందాడై ప్రవచన పీఠము ఆధ్వర్యంలో డాక్టర్ ఆచార్య వేణు సభా నిర్వాహణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాస్త్ర రత్నాకర, మహామహోపాధ్యాయ ఉ.వే.ప్ర. డాక్టర్ సముద్రాల వెంకట రంగరామాను జాచార్య స్వామి, సభాధ్యక్షులుగా ఉ.వే.ప్ర.డాక్టర్ అప్పన్ డాక్టర్ అప్పన్ కందాడై పెరుమాళ్లాచార్యులు, ఆత్మీయ అథితులుగా డాక్టర్ ఎస్.శ్రీరంగాచార్యులు, చిలకమర్రి లక్ష్మీనాథాచార్యులు, సుదర్శనం శ్రీనివాసాచార్యులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కందాడై రామానుజాచార్యుల వారి గొప్పదనాన్ని, ఆయన వ్రాసిన పుస్తకాల గురించి వివరించారు. కందాడై రామానుజాచార్యుల వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సముద్రాల వెంకట రంగరామానుజాచార్య స్వామి మాట్లాడుతూ కందాడై రామానుజాచార్యులను కీర్తించడాన్ని బంగారాన్ని కీర్తించడంతో పోల్చుతూ ప్రసంగించారు.

త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామిచే శనివారం ఆవిష్కరింపబడిన స్మృత్యంజలి సంచికను తిరునక్షత్ర మహోత్స వానికి హాజరైన వారందరికి పంచిపెట్టారు. కాగా శ్రీ మద్భగవద్రామానుజాచార్యస్వామి వారి 1010వ వార్షిక తిరునక్షత్రోత్సవ ప్రవచానాలను ఈ నెల 20వ తేది సోమవారం నుండి 22వ తేది బుధవారం వరకు ప్రతి రోజు సాయంత్రం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉభయ వేదాంత పండిత పరిషత్తు కందాడై ప్రవచన పీఠము సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ, బిసి నిరుద్యోగులకు శిక్షణ

### 24 నుండి దరఖాస్తుల స్వీకరణ

### షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులు, వెనుకబడిన తరగతులు, మైనార్టీలకు చెందిన నిరుద్యోగ యువతకు అత్యాధునిక రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ట్రైకార్) నిర్ణయం తీసుకుంది. ఇందుకు గాను రాష్ట్రంలోని ఉట్నూరు, భద్రాచలం, ఏటూరునాగారం, మన్ననూరు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువకులకు శిక్షణ ఇవ్వనుంది.

ఒక్కో ఐటీడీఏ పరిధిలో 2,700 మంది చొప్పున 8,100 మందికి, అదేవిధంగా మైదాన ప్రాంతాల్లోని మరో 2,400 మందికి శిక్షణ అందించనున్నారు. ఇందుకు అర్హత కలిగిన ఎంపిక చేసిన నిరుద్యోగ యువతకు 20 నుంచి 100 రోజుల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రధానంగా ఆర్గానిక్ ఫార్మింగ్, బ్యూటీ థెరపిస్ట్, చెఫ్, జూనియర్ సాఫ్ట్వేర్ డెవలపర్, సోలార్ పంప్ టెక్నీషియన్, డ్రోన్ పైలటింగ్-రిపేరింగ్, ఈవీ-సోలార్ ప్యానెల్ ఇన్స్టాలేషన్, మల్టీ స్కిల్ టెక్నీషియన్, ఆప్టికల్ ఫైబర్ టెక్నీషియన్ తదితర కోర్సులు ఇందులో ఉన్నాయి.

ఆసక్తికలిగిన ఆయా కులాలకు చెందిన నిరుద్యోగ యువత ఈనెల 24 నుంచి తమ పరిధిలోని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యువత నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వచ్చే నెల నుంచి బ్యాచ్‌ల వారీగా శిక్షణను ప్రారంభించనున్నట్లు తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కో-పరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు.

## నైవేలీ లిగ్నైట్ సిఎండి ప్రసన్నకు ప్రైడ్ ఆఫ్ తెలంగాణ పురస్కారం

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎల్‌సిఐ) సిఎండి మోటుపల్లి ప్రసన్నకుమార్ ప్రతిష్టాత్మకమైన ప్రైడ్ ఆఫ్ తెలంగాణ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు దీనికి సంబంధించి పిఆర్ఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 4వ తెలంగాణ కాన్ఫరెన్స్ జాతీయ వేడుకల్లో ప్రసన్నకుమార్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ పురస్కారాన్ని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్. ప్రియాంక అందజేశారు. కాగా రాష్ట్రంలోని భద్రాచలం వాస్తవ్యుడైన ప్రసన్నకుమార్ ఇంధన రంగానికి చేసిన విశేషమైన సేవలు, ఎన్ఎల్‌సి ఇండియా లిమిటెడ్‌ను కార్యాచరణ నైపుణ్యం, సుస్థిరత, ఆవిష్కరణలు, దేశ నిర్మాణం వంటి రంగాలలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందచేశారు.



సోమవారం జగిత్యాలలో కెసిఆర్ బహిరంగ సభ జరిగే వేదిక ఇదే

## నేడు కెసిఆర్ ప్రజాఆశీర్వాద సభ.. షెడ్యూల్ ఇదే

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 19:** కాంగ్రెస్‌ను వీడి కారెక్కుతున్న సీనియర్ నేత జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించే ఘట్టానికి సభా ప్రాంగణం ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం సాయంత్రం 4:45 గంటలకు ఎర్రవల్లి నివాసం నుండి హెలికాప్టర్‌లో కేసీఆర్ జగిత్యాలకు బయలుదేరుతారు. జగిత్యాల కలెక్టరేట్ వద్ద ఉన్న హెలిప్యాడ్‌లో దిగి, అక్కడి నుండి నేరుగా కేసీఆర్ పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముఖ్య నాయకులతో గులాబీ బాస్ కీలక భేటీ నిర్వహిస్తారు. పార్టీ కార్యాలయం నుంచి సాయంత్రం 6 గంటలకు భారీ ర్యాలీగా కేసీఆర్ సభా ప్రాంగణానికి వెళ్తారు. అనంతరం జీవన్ రెడ్డికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తారు.

## మే 1 నుండి విబిజిరామ్‌జి పేరుతో ఉపాధిహామీ పథకం అమలు

**పనుల జాబితాపై రైతుల తీవ్రఅసంతృప్తి**

**వ్యవసాయానికి మేలు చేసే పలు పనులు తొలగింపుపై మండిపాటు**

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం నూతనంగా విబిజిరామ్‌జి పేరుతో తీసుకువచ్చిన ఉపాధిహామి పథకంపై అన్నదాతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పథకం పనుల జాబితాలో 266 రకాల పనులను చేర్చినప్పటికీ గతంలో రైతులకు ఎంతో మేలు చేసిన కొన్ని పనులను తొలగించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ముఖ్యంగా చెరువుల నుంచి పొలాలకు ఒండ్రుమట్టి తరలింపు, వ్యక్తిగత పొలాల్లో భూమిని చదును చేయడం, పిచ్చిమొక్కలు లేదా కంపచెట్ల తొలగింపు వంటి పనులకు ఇకపై అనుమతి ఉండదు.

ఒండ్రుమట్టి వల్ల పొలాలు సారవంతమవుతాయని ఈ తరహా పనులను మే 1 నుండి విబిజిరామ్‌జి పేరుతో అమలులోకి రానున్న ఉపాధిహామి పథకంలోనూ కొనసాగించాలని కోరుతున్నారు. ప్రస్తుతం చెరువు మట్టి తరలింపు పనులను మే నెల వరకు పొడిగించాలంటున్నారు. ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం మే 1 నుంచి పెను మార్పులు తీసుకురాబోతోంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం.. ఇకపై విబిజిరామ్‌జి (వికసిత్ భారత్ గ్యారెంటి ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్)గా కొత్త రూపు సంతరించుకోనుంది. కేవలం పేరు మార్పు మాత్రమే కాకుండా పని దినాల సంఖ్య, పనుల ఎంపిక అమలు తీరులో విప్లవాత్మక మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఉపాధిహామి ప్రస్తుత పనుల గడువు ఈ నెలాఖరుతో ముగియనుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉత్కంఠ నెలకొంది.

కేంద్రం ప్రవేశపెట్టిన ఈ కొత్త విధానం వల్ల కూలీలకు , గ్రామ పంచాయతీలకు కొన్ని ప్రయోజనాలు చేకూరనున్నాయి. ఇప్పటివరకు ఒక కుటుంబానికి ఏడాదికి 100 రోజుల పని కల్పించగా, కొత్త పథకంలో ఆ గడువును 125 రోజులకు పెంచారు. దీనివల్ల కూలీల వార్షిక ఆదాయం పెరగనుంది. గతంలో పనుల ఎంపికలో మండల స్థాయి అధికారుల జోక్యం ఎక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు గ్రామ అవసరాలను బట్టి అక్కడి పంచాయతీలే పనులను ఎంచుకునే అధికారం కల్పించారు. అంటే ఫుల్ పవర్స్ గ్రామ పంచాయతీలకే ఇచ్చారు. కేవలం మట్టి పనులకే పరిమితం కాకుండా అంగన్‌వాడి భవనాలు, స్కూల్ టాయిలెట్లు, సిసి రోడ్లు, డ్రైనేజిలు, చెక్ డ్యామ్‌ల వంటి శాశ్వత నిర్మాణాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అయితే కేంద్ర మార్గదర్శకాల ప్రకారం పాత పద్ధతిలో చేసే పనులన్నీ ఈ ఏప్రిల్ 30 లోపు పూర్తి చేయాల్సిందేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో ఈ వారం రోజుల్లోనే పనులు పూర్తి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు మాత్రం భూ అభివృద్ధి పనులకు మినహాయింపు లభించే అవకాశం ఉంది.

## సైబర్ నేరగాళ్లు, మ్యూల్ ఖాతాదారుల పట్టివేతకు ఆపరేషన్ ఆక్టోపస్-2

**తొమ్మిది రాష్ట్రాల్లో సిటీసైబర్ క్రైం పోలీసుల దాడులు**

**32 మంది బ్యాంకు అధికారులతోపాటు 52 మంది అరెస్టు**

**850 కేసులకు సంబంధించి రూ.150 కోట్ల అక్రమాల వెలికితీత**

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా జరుగుతున్న సైబర్ నేరాలపై హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు మరోమారు పంజా విసిరా రు. ఆపరేషన్ ఆక్టోపస్ 2 పేరిట తొమ్మిది రాష్ట్రాలలో సైబర్ క్రైం పోలీసులు నిర్వహించిన దాడుల్లో ఆయా ప్రాంతాలలో గల బ్యాంకుల్లో పనిచేస్తు న్న 32 మంది అధికారులతో పాటు 52 మంది నేరగాళ్లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా 850 కేసులకు సంబంధించి 150 కోట్ల రూపాయల అక్రమాలను పోలీసులు రట్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సైబర్ క్రైం డిసిపి అరవింద్ బాబు ఆదివారం మీడియాకు వెల్లడించారు. తెలంగాణలో వరుసగా జరుగుతున్న సైబర్ నేరాల నివారణను నడుం బిగించిన సైబర్ క్రైం పోలీసులు ఇందులో పాల్గొంటున్న ఇతర రాష్ట్రాల నే రగాళ్లపై మళ్లీ దాడులు చేశారు. పెట్టుబడుల స్కాంలు, ట్రేడింగ్ మోసాలు, డిజిటల్ అరెస్టుల సహా అనేక రకాల సైబర్ నేరాలు ఇటీవల కాలంలో దే శ వ్యాప్తంగా పెరుగుతుండడం తెలిసిందే. వీటి బాధితులు తెలంగాణలోనూ ఎక్కువగా వుంటున్నారు. దీనిపై దృష్టిసారించిన సైబర్ క్రై ం పోలీసులు గత ఫిబ్రవరి నెలలో ఆపరేషన్ ఆక్టోపస్ 1 నిర్వహించి 16 రాష్ట్రాలలో 117 మందిని అరెస్టు చేశారు. తాజాగా ఆపరేషన్ ఆక్టోపస్ 2 పేరిట మహా రాష్ట్ర, ఢిల్లీ, రాజస్తాన్, బెంగాల్, కర్నాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, బిహార్, తెలంగాణ రాష్ట్రాలలో 16 బృందాలతో వారం రోజుల పాటు దాడులు చేశారు.

దాడుల సందర్భంగా ఆయా ప్రాంతాలలో గల ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన 32 మంది అధికారులు, 15 మం ది మ్యూల్ ఖాతాదారులు, ఐదుగురు మధ్యవర్తులు పట్టుబడ్డారు. పటుబడ్డ నేరగాళ్లు దేశ వ్యాప్తంగా జరిగిన 850 సైబర్ నేరాలలో 150 కోట్ల రూపాయలను కాజేసినట్లు తేలింది. పట్టుబడ్డ బ్యాంకు అధికారుల్లో ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ నుంచి ఒక కెవైసి అప్రూవర్, మరో రిలేషన్‌షిప్ మేనేజర్ వుండగా బంధన్ బ్యాంకు నుంచి ఐదుగురు మేనేజర్లు వున్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి ముగ్గురు మేనేజర్లు, ఒక ప్రొబేషనరీ ఆఫీసర్, ఒక కెవైసి అప్రూ వర్, ఫెడరల్ బ్యాంకు నుంచి ఇద్దరు మేనేజర్లు, ఒక కెవైసి అప్రూవర్, ఒక గుమస్తా, ఐడిఎఫ్‌సి ఫర్స్ట్ బ్యాంకు నుంచి ముగ్గురు మే నేజర్లు, ఒక కెవైసి అప్రూవర్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ నుంచి ఒక ఫీల్డ్ ఆఫీసర్, నలుగురు మేనేజర్లు, ఒక కెవైసి అప్రూవర్, కర్నాటక బ్యాంకు నుంచి ఇద్దరు మేనేజర్లు, క రూర్ వైశ్యా బ్యాంకు నుంచి ఇద్దరు మేనేజర్లు, ఇక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ నుంచి ఒక రిలేషన్‌షిప్ మేనేజర్, హెచ్‌డిఎఫ్‌సి నుంచి ఒక కెవైసి అప్రూవర్ వున్నారు. దాడుల్లో పట్టుబడ్డ నిందితుల నుంచి 26 సెల్‌ఫోన్లు, 14 చెక్కు బుక్కులు, రెండు పెన్ డ్రైవ్‌లు, ఒక ల్యాప్ టాప్, 21 షెల్ కంపెనీల రబ్బరు స్టాంపులు స్వాధీనం చేసుకున్నారు. సైబర్ క్రైం డిసిపి అరవింద్ బాబు నేతృత్వంలో ఎసిపి శివమారుతి సహ ఇ తర అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నారు. కాగా సైబర్ నేరాల పట్ల అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని సైబర్ క్రైం డిసిపి అరవింద్ బా బు తెలిపారు. సైబర్ నేరగాళ్లకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే 1930కి ఫోన్ చేయాలని ఆయన కోరారు.

# డిగ్రీలో 45 శాతం సీట్లే భర్తీ!

**ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో నిండిన 37 శాతం సీట్లు**

**గురుకుల డిగ్రీ కాలేజీల్లోనూ పూర్తిస్థాయిలో భర్తీ కానివైనం**

**4,38,926 సీట్లుంటే.. 1,97,739 భర్తీ**

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో ఉన్న సీట్లలో 45 శాతం సీట్లు కూడా భర్తీ కావడం లేదు. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా ఇదేతంతు కొనసాగుతోంది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో కంటే ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మరీ దారుణంగా 40 శాతానికి మించి అడ్మి షన్లు కావడం లేదు. అయితే రాష్ట్రంలోని కొన్ని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో సీట్లు దొరకని పరిస్థితి ఉన్నప్పటికీ కొన్ని కాలేజీల్లో ఒక గ్రూపులో కనీసం 10 మంది కూడా చేరని కాలేజీలు సైతం ఉన్నాయి. అదేవిధంగా ప్రైవేటు కాలేజీల్లోనూ కొన్ని కాలేజీల్లో ఎక్కువ సీట్లు భర్తీ అవుతుంటే.. మరికొన్ని కాలేజీల్లో జీరో అడ్మిషన్లు కూడా ఉన్న పరిస్థితి నెలకొంది. గత ఏడాది 2025-26 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని 54 డిగ్రీ కాలేజీల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ నమోదయింది. అందులో ఒకటి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఉండగా.. మిగిలిన 53 ప్రైవేటు డిగ్రీ కాలేజీలు. గత ఏడాది సుమారు 100 ప్రైవేటు డిగ్రీ కాలేజీలు మూసివేసినట్టు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో 1057 డిగ్రీ కాలేజీలు ఉండగా.. అవికాస్త 2025-26 విద్యా సంవత్సరానికి 960కి చేరాయి. అంటే ఏడాదిలో 97 కాలేజీలు మూసివేసినట్టుగా అధికారిక లెక్కలు చెబుతున్నాయి. రాష్ట్రంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) పేరుతో అడ్మిషన్ల ప్రక్రియను గత 8 సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా గత ఏడాది 2024-25 దోస్త్, నాన్ దోస్త్ కాలేజీలు 1057 ఉండగా వాటిలో 4,57,724 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది అడ్మిషన్ల ప్రక్రియలో దోస్త్, నాన్ దోస్త్ కాలేజీలు 960 ఉన్నాయి. వాటిలో 4, 38,926 సీట్లు అందుబాటులో ఉన్నట్టు దోస్త్ అధికారిక లెక్కలు చెబుతున్నాయి. రాష్ట్రంలో 97 డిగ్రీ కాలేజీలు మూసివేసినప్పటికీ మొత్తం సీట్లలో గత ఏడాది కంటే ఈ ఏడాది కేవలం 18,798 సీట్లు మాత్రమే తగ్గాయి. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ఉన్న మొత్తం సీట్లలో 45 శాతానికి మించి అడ్మిషన్లు జరగడంలేదు. గత ఏడాది నాన్‌దోస్త్ కాలేజీలు 70 ఉండగా వాటిలో 40,603 సీట్లు ఉంటే.. అందులో 17,649 సీట్లు భర్తీ అయ్యాయి. ఈ ఏడాది నాన్ దోస్త్‌లో 58 కాలేజీలు ఉండగా వాటిలో 36,926 సీట్లు ఉన్నాయి. అందులో కేవలం 15,126 మంది విద్యార్థులు చేరారు. నాన్ దోస్త్‌లో ఉన్న రెండు ఎయిడెడ్ కాలేజీల్లో 1616 సీట్లు ఉంటే వాటిలో కేవలం 66 మంది మాత్రమే చేరినట్టు దోస్త్ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్సి, ఎస్టీ, బిసి గురుకుల డిగ్రీ కాలేజీల్లో సైతం 100 శాతం సీట్లు భర్తీ కావడం లేదు. బిసి గురుకులాల్లో అయితే కనీసం 40 శాతం సీట్లు కూడా భర్తీ కావడం లేదు. ఈ ఏడాది బిసి గురుకులాల్లో కేవలం 35 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. రాష్ట్రంలో 29 బిసి గురుకుల డిగ్రీ కాలేజీలు ఉండగా వాటిలో 9914 సీట్లు ఉండగా అందులో 2758 మంది చేరారు. ఎస్సి గురుకులాల్లో 28 డిగ్రీ కాలేజీల్లో 8080 సీట్లు ఉంటే వాటిలో 5259 మంది చేరారు. 22 ఎస్టి గురుకుల డిగ్రీ కాలేజీల్లో 5620 సీట్లు ఉంటే అందులో 3312 మంది చేరారు. ఎస్సి, ఎస్టి గురుకుల డిగ్రీ కాలేజీల్లో 45 శాతం మంది విద్యార్థులు చేరారు. మొత్తం 79 గురుకుల డిగ్రీ కాలేజీల్లో 23,614 సీట్లు ఉంటే వాటిలో 11,329 మంది చేరారు. రాష్ట్రంలో ఉన్న ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో అయితే కనీసం 40 శాతం సీట్లు కూడా భర్తీ కావడం లేదు. ఈ ఏడాది కేవలం 37 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. గత ఏడాది రాష్ట్రంలో 714 ప్రైవేటు డిగ్రీ కాలేజీలు ఉండగా వాటిలో 2,85,750 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయ్యే నాటికి 1,04,510 సీట్లు భర్తీ అయాయి. ఈ ఏడాది 628 ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 2,63,450 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 94,124 సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్రంలో 119 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 17,448 మంది చేరగా.. 34 ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కాలేజీల్లో 23,284 మంది చేరారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి అల్పాహార విందుపై కావాలనే ట్రోలింగ్

**క్లారిటీ ఇచ్చిన కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఏప్రిల్19:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అల్పాహార విందు ఇచ్చిన సంగతి తెలిసిందే. శనివారం ఉదయం ఢిల్లీలో కేంద్ర మంత్రి కుమారస్వామి, సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు ఎంపీలకు ఆయన విందు ఇచ్చారు. ఇది కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించిన రేవంత్‌కి విందు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ స్పందించారు. ఢిల్లీలో జరిగిన ఈ విందు కార్యక్రమం రాజకీయపరంగా కాకుండా పరిపాలనా అవసరాల దృష్ట్యా జరిగిందని తెలిపారు.

తెలంగాణకు తమ శాఖ నుంచి 2,500 ఎలక్ట్రిక్ బస్సుల మంజూరు కోసం ఇప్పటికే ఆమోదం తెలిపామని చెప్పారు. ఈ బస్సులను త్వరగా విడుదల చేయాలని ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి వినతిపత్రం అందించేందుకు వచ్చారన్నారు. ఈ మేరకు తమ నివాసంలో జరిగిన అల్పాహార విందుకు హాజరయ్యారని స్పష్టం చేశారు.

ఈ అంశాన్ని సోషల్ మీడియాలో కావాలనే ట్రోలింగ్ చేస్తున్నారని కేంద్ర మంత్రి ఆక్షేపించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భూపతిరాజు మాట్లాడుతూ.. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించి ప్రతిపాదించిన ఈ బిల్లును వ్యతిరేకించడం ద్వారా ఇండి కూటమి చారిత్రక తప్పు చేసిందన్నారు. 2023లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఆమోదించిందని గుర్తుచేశారు. ఈ రిజర్వేషన్లను త్వరితగతిన అమలు చేయడానికి సవరణలు తీసుకొస్తే ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని విమర్శించారు. జనగణన ఆలస్యమవుతున్న నేపథ్యంలో 2029 నాటికి మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని, నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ ద్వారా ఎవరికీ అన్యాయం జరగకుండా బిల్లు రూపొందిం చారన్నారు. అయినా ప్రతిపక్షాలు దాన్ని వ్యతిరేకించాయని ధ్వజమెత్తారు. సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, కనిమొళి, డింపుల్ యాదవ్ వంటి నాయకులు చట్టసభల్లో ఉండొచ్చని, కానీ సాధారణ మహిళలకు అవకాశాలు ఇవ్వడంలో విపక్షాలు నిరక్ష ్యం ప్రదర్శిస్తున్నాయని ఆయన మండిపడ్డారు.

విపక్ష కూటమి పార్టీల కుటుంబసభ్యులు మాత్రమే రాజకీయాల్లో ఉండాలా? అని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. మహిళల హక్కులను విస్మరించిన ఈ వైఖరిని దేశ ప్రజలు గమనించారని చెప్పుకొచ్చారు. రానున్న రోజుల్లో ఎన్డీయే ఆధ్వర్యంలో మహిళా రిజర్వేషన్ల అమలు చేస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రతిపక్షాల వైఖరిని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్తామని తెలిపారు.

## సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్టీసీ కార్మిక సంఘాలు

**22 మొదటి డ్యూటీ నుంచి సంస్థలో సమ్మె**

**విరమింపజేసేందుకు యాజమాన్యం, ప్రభుత్వం సమాలోచనలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్‌ఆర్‌టిసి)లో మరోసారి సమ్మె సైరన్ మోగనుంది. ఈ నెల 22 మొదటి డ్యూటీ నుంచి సమ్మె చేయాలని ఆర్టీసీ కార్మికులు నిర్ణయించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఆర్టీసీలో గుర్తింపు సంఘ ఎన్నికలను నిర్వహించాలనే ప్రధాన డిమాండ్లతో ఆర్టీసీ జేఏసీ గత నెల 13న సమ్మె నోటీస్‌ను ఇచ్చింది. ఈ నేపథ్యంలో జేఏసీలోని కార్మిక సంఘాలతో లేబర్ కమిషనర్‌తో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఈ నెల 22 మొదటి డ్యూటీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్టు జేఏసీ ఈ నెల 13న ప్రకటించింది. ఈ నెల 14 నుంచి ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని డిపోల్లోనూ కార్మికులను కలిసి సమ్మెకు వెళ్లాల్సి వచ్చిన పరిస్థితులను వివరిస్తున్నారు. ఆర్టీసీలోని ఆరు ప్రధాన సంఘాలు జేఏసీగా ఏర్పాటయి సమ్మె నోటీసును ఇచ్చాయి. లేబర్ కమిషనర్ దగ్గర చర్చలు విఫలం కావడంతో సమ్మెలోకి వెళ్లాలని జేఏసీ నిర్ణయించింది. దీంతో ఈ నెల 14 నుంచి ఆర్టీసీలోని ఇతర సంఘాలు కూడా జేఏసీకి మద్దతు ప్రకటిస్తూ.. ఈ నెల 22 మొదటి డ్యూటీ నుంచి సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించాయి. మూడు రోజుల క్రితం ఆర్టీసీలోని ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ కూడా తాము సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలిపింది. దీంతోపాటు ఎస్‌డబ్ల్యూయు కూడా సమ్మెకు మద్దతు ప్రకటించింది. దీంతోపాటు రాజకీయ పార్టీలైన సీపీఐ, సీపీఎం కూడా ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు ఆయా పార్టీల రాష్ట్ర కార్యదర్శులు ప్రకటించారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కూడా ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్టు ఆదివారం ప్రకటించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం, ట్రేడ్ యూనియన్లకు గుర్తింపు ఎన్నికలను నిర్వహించడం ప్రధాన డిమాండ్లతో పాటు వేతన సవరణలు జరపడంతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఈ నెల 22 నుంచి సమ్మె చేపట్టనుంది. తెలంగాణ ఆర్టీసిలో గత 7 సంవత్సరాలుగా కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఎన్నిసార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదని ఆర్టీసి జాయింట్ యాక్షన్ కమిటీ చెబుతోంది. ఆర్టీసీ కార్మికుల సమ్మెను నివారించేందుకు అటు ఆర్టీసీ యాజమాన్యం ఇటు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఆర్టీసీ జేఏసీతో మొదటి విడత చర్చలు జరిగిన తరువాత ఈ నెల 10న ఆర్టీసీ ఉద్యోగులకు 2.1 శాతం డీఏ పెంచుతున్నట్టు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆ తరువాత ఈ నెల 13న ఆర్టీసీ జేఏసీతో యాజమాన్యం చర్చలు విఫలం కావడంతో ఈ నెల 22 నుంచి సమ్మెలోకి వెళుతున్నట్టు జేఏసీ ప్రకటించింది. సమ్మె ఆలోచనను విరమించుకోవాని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ యూనియన్లకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 22 నుంచి సంఘాలు సమ్మెలోకి వెళ్లడానికి సిద్ధపడిన నేపథ్యంలో ఆర్టీసీ కార్మికుల వేతనాలను సవరించాలనే యోచనలో కూడా యాజమాన్యం ఉన్నట్టు తెలుస్తోంది. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు 2021, 2025కు సంబంధించిన వేతన సవరణ జరగలేదు. ఈ నేపథ్యంలో 7 నుంచి 8 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేసి సమ్మె విరమణకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలను యాజమాన్యంతో ప్రభుత్వం చర్చించినట్టు తెలుస్తోంది.

## డ్రగ్స్ మాఫియా కట్టడిలో కానరాని సమష్టి వ్యూహాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** దేశంలో డ్రగ్స్ వినియోగం పెరిగిపోవడం అన్నివర్గాలను ఆందోళనకు గురిచేస్తున్న విషయం తెలిసిందే. పాఠ శాల విద్యార్థులను మొదలుకొని కార్పొరేట్ ఉద్యోగుల వరకు, బడా బాబుల నుంచి, చోటా కార్మికుల వరకు ఈ ఉచ్చులో చిక్కుకుని వారుండరంటే అతిశయోక్తి కాదు. డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదే పదే చెబుతున్నా క్షేత్రస్థాయిలో దానికి భిన్నమై న పరిస్థితులు నెలకొన్నాయి. మాదక ద్రవ్యాల నివారణకు కేంద్రంతో పాటు రాష్ట్రాల స్థాయిలో అనేక విభాగాలు వున్నా వాటిపై ఉక్కుపాదం మోపడ ంలో సమిష్టిగా వ్యూహాలు అమలు పరచడంలో ఘోరంగా విఫలమవడం గమనార్హం. దేశంలో పంజాబ్ రాష్ట్రం మాదకద్రవ్యాల వినియోగంలో మొ దటి స్థానంలో వుండగా గోవా, మహారాష్ట్ర, ఢిల్లీ, ఈశాన్య రాష్ట్రాల తరువాత దక్షిణాదిలో తెలుగు రాష్ట్రాలు ముందు వరుసలో వున్నాయని జాతీయ నేర గణాంకాల విభాగం చెబుతోంది. నైజీరియా, ఆఫ్రికా దేశాల నుంచి ఏటా వందలాది కిలోల మాదకద్రవ్యాలు దేశంలోకి దిగుమతి అవుతుండడం ఒక ఎత్తయితే దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాలలో పారిశ్రామికవాడల్లో సింథటిక్ డ్రగ్స్ పెద్ద ఎత్తున తయారవుతోంది. ఇక డ్రగ్స్ కేసులో వందల సంఖ్య లో నేరగాళ్లు పట్టుబడుతున్నా పదుల సంఖ్యలో కూడా శిక్షలు వుండడం లేదు.

మాదకద్రవ్యాలు అంటే ఒకప్పుడు గంజాయి వరకే పరిమితం అయ్యేది. గంజాయి స్థానంలో బ్రౌన్ షుగర్, హెరాయిన్, ఎపిడ్రిన్, కొకైన్‌లతో గ ంటల తరబడి నిషాలో వుంచే ఎల్ఎస్‌డి వంటి ఘాటైన మత్తు పదార్థాలు రెండున్నర దశాబ్దాలుగా మారె ్కట్లను ముంచెత్తుతున్నాయి. హైదరాబాద్ సహా దేశంలోని అనేక నగరాలలో డ్రగ్స్ వినియోగం పెరిగిందని కేంద్ర నార్కోటిక్ బ్యూరో తేల్చింది. ఇందులో పంజాబ్ రాష్ట్రంలోని అన్ని నగరాల లో డ్రగ్స్ వినియోగం ప్రమాదకర స్థాయిలో వుందని ఆ సర్వేలో తేలింది. హైదరాబాద్‌లో 2017లో వెలుగు చూసిన కెల్విన్ కమింగా ముఠాలు మొ దలుకొని రెండేళ్ల క్రితం రట్టయిన బ్లెసింగ్స్ అనే నైజీరియా మహిళ వరకు అనేక మంది నేరగాళ్లు సాగించిన అరాచకాలు సర్కారీ విభాగాల వైఫలా ్యలకు పరాకాష్టగా చెప్పాలి. మాదకద్రవ్యాలపై చర్యలకు దేశ వ్యాప్తంగా వున్న విభాగాలుండగా రాష్ట్రాలలోనూ పలు విభాగాలు న్నాయి. తెలంగాణ వ రకే వస్తే ఈగల్ పేరిట రాష్ట్ర స్థాయిలో వున్న విభాగం ఇక్కడ వెలుగుచూస్తున్న నేరాలకు సంబంధించిన నేరగాళ్లను ఇతర రా ష్ట్రాలలోనూ దాడులు చేసి అరెస్టు చేస్తోంది. దీంతో పాటు హైదరాబాద్‌లో నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ పేరిట మరో విభాగం వుంది.

జిల్లాలలో డ్రగ్స్ కట్టడికి ఈగ ల్‌కు అనుబంధంగా విభాగాలున్నాయి. ఈ విభాగాలకు అపరిమితమైన అధికారాలు వున్నాయి. మాదకద్రవ్యాలపై చర్యలకు ఇన్ని విభాగాలు వున్నా వీటి మధ్య సమన్వయం లేక పోవడం వల్లే డ్రగ్స్ మాఫియా రెచ్చిపోతోంది. మాదకద్రవ్యాలు స్మగ్లింగ్ చేసే వ్యక్తులు లేదా సంస్థలు ఒకసారి పట్టుబడినపుడు దీనికి సంబంధించిన సమాచారం అన్ని విభాగాలు పంచుకోవడం లేదనే విమర్శ వుంది. ఒక విభాగం ఒక ముఠా ను అరెస్టు చేసినపుడు ఈ సమాచారం మరో సర్కారీ విభాగానికి చేరడం లేదు.

**నేరగాళ్ల అరెస్టు సరే.. శిక్షల సంగతేమిటి**

ఇదిలావుండగా డ్రగ్స్ కేసులో గడచిన కొంత కాలంగా తెలంగాణలో వందల సంఖ్యలో నేరగాళ్లు అరెస్టయ్యారు. గ్రేటర్ పరిధిలోనే గడచిన రెండేళ్ల కాలంలో 500 మందికి పైగా అరెస్టయ్యారు. ఇందులో విదేశీయులతో పాటు సినీ రంగానికి చెందిన వారు కూడా వున్నారు. అయితే ఇలా అరెస్ట వుతున్న వారిలో అనేక మంది జైలు నుంచి నెల, రెండు నెలల వ్యవధిలో బెయిలుపై వచ్చి మళ్లీ డ్రగ్స్ దందా సాగిస్తున్నారు. వీరిలో నైజీరియన్లు కూడా వున్నారు. 2017లో అరెస్టయిన స్మగ్లర్లు కెల్విల్, కమింగా బెయిలుపై విడుదలయ్యాక తమ దేశాలకు పారిపోయారు. వారిపై నమోదైన కేసు లు ఏ దశలో వున్నాయో...? అధికారులే చెప్పాలి. వీరితో పాటు అనేక మంది నైజీరియన్లు ఐదారుసార్లు డ్రగ్స్ కేసులో అరెస్టయినా దర్జాగా దం దాలు సాగిస్తున్నారు. గంజాయికి కేరాఫ్‌గా వున్న ధూల్‌పేట్‌లో 50 మంది వరకు స్మగ్లర్లు అనేకమార్లు అరెస్టయినా ఇంకా ఇదే వ్యాపారంలో వున్నా రు. రెండేళ్ల క్రితం పట్టుబడ్డ అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా డాన్ బ్లెసింగ్స్ అనే మహిళ ఐదేళ్లకు పైగా నైజీరియా నుంచి కిలోల కొద్దీ కొకైన్‌ను భారత్‌కు తీసుకువచ్చి ఇక్కడి నగరాలలో తనకు పరిచయమున్న డాన్‌లకు అమ్ముతున్నా దీనిపై ఏ విభాగం అధికారులు కూడా సమాచారం సేకరించలేక పో యారు. డ్రగ్స్ కట్టడి విషయంలో సర్కారీ విభాగాలు సమిష్టి వ్యూహాలు అమలు పరిచి, నేరగాళ్లకు మరణశిక్షతో సమానమైన శిక్షలను విధించేలా చే సినపుడు మెరుగైన ఫలితాలు వచ్చే వీలుందని నిపుణులు చెబుతున్నారు.

**విదేశాల నుంచి యేటా వందల కిలోల మాదకద్రవ్యాల సరఫరా**

**పారిశ్రామికవాడల్లో సింథటిక్ డ్రగ్స్ తయారీ**

**వందల సంఖ్యలో నేరగాళ్లు అరెస్టవుతున్నా పదుల సంఖ్యలోనే శిక్షలు**



## లూసియానాలో కాల్పులు..

**ఎనిమిది మంది చిన్నపిల్లలు మృతి**

**లూసియానా, ఏప్రిల్ 19:** అమెరికాలోని లూసియానా ప్రాంతంలోని ఒక రద్దీ ద్రేశంలో ఒక సాయుధ ఆగంతకుడు జరిపిన కాల్పుల్లో ఎనిమిది మందిపిల్లలు మరణించారు. మరణించిన వారంతా చిన్నపిల్లలే. వీరంతా ఒకటినుంచి 14 ఏళ్లమధ్య వయసువారేనని ష్రీవ్‌పాట్ అధికారులు తెలిపారు. దాడుల అనంతరం నిందితుడు ఒక కారును చోరీచేసి పారిపోయే ప్రయత్నం చేసాడు. అయితే పోలీసులు వెంబడించి ఆతడిని పట్టుకునే ప్రయత్నంచేసారు. ఈ క్రమంలో కాల్పులుజరపడంతో నిందితుడు చని పోయాడని వెల్లడించారు. కాల్పులకు గురైనవారిలో కొందరు నిందితుడికి బంధువులని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు అయోవా యూనివర్సిటీ సమీపంలో కాల్పులు కలకలం సృష్టించాయి. ఆదివారం తెల్లవారుజామున స్థానికంగా జరిగిన విద్యార్థులమధ్య ఘర్షణ కాల్పులకు దారితీసింది. ముగ్గు రు విద్యార్థులు కాల్పుల్లో గాయపడగా ఒకరిపరిస్థితి విషమంగా ఉంది.

## మహిళా రిజర్వేషన్ల కోసమే డీలిమిటేషన్: ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 19:** లోకసభ స్థానాల పెంపుతో పాటు మహిళల రిజర్వేషన్లతో డీలిమిటేషన్ బిల్లు సరిసమానంగా ఉంటుందని చేవేళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో మహిళ రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న విపక్షాల తీరుపై ఆయన మండిపడ్డారు. గతంలో ఈ బిల్లును పలుమార్లు ప్రవేశపెట్టారని, 2023లో మహిళ రిజర్వేషన్ బిల్లు, డిలిమిటేషన్‌కు అసదుద్దీన్ ఓవైసీ, మరొకరు మినహా కాంగ్రెస్ పార్టీతో సహ అన్ని పార్టీలు ఏకాభిప్రాయంగా ఆమోదం తెలిపాయని ఆయన గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుపై కాంగ్రెస్ పార్టీ తొందరపెట్టడంతోనే ప్రధాని నరేంద్రమోడీ మరోసారి చట్టసభ ముందుకు బిల్లును తీసుకొచ్చినట్లు ఆయన చెప్పారు. 1963లో రెండవ డీ లిమిటేషన్‌లో దక్షి ణాది రాష్ట్రాలకు అన్యాయం చేసింది కాంగ్రెస్సేనని ఆయన ధ్వజమెత్తారు. ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ వ్యూహాత్మకంగా వ్యవహరించి బిల్లును అడ్డుకున్నారని విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు.

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ రిసెప్షన్‌కు హాజరైన సిఎం రేవంత్, గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 19:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ విప్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నర్సింగ్‌రావు వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ యువ నేత, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. జగిత్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న గడ్డం ఇందుజ రెడ్డితో ఆయన వివాహం ఏప్రిల్ 11న గోవాలో జరిగింది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వివాహ వేడుకను నిరాడంబరంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల కోసం ఆదివారం సాయంత్రం వివాహ రిసెప్షన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై, నూతన దంపతులు వెంకట్, ఇందుజలతో కాసేపు ముచ్చటించారు. ఈ రిసెప్షన్‌కు రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎంఎంటిఎస్ ఉచిత ప్రయాణంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు : ప్రభుత్వం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఏప్రిల్19:** హైదరాబాద్‌లోని ఎమ్ఎంటీఎస్ రైళ్లలో ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే ప్రతిపాదన పరిశీలనలో ఉందని, దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ అంశంపై సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ప్రచారంలో ఉందని, ప్రజలు వాటిని నమ్మవద్దని అధికారికంగా ఒక ప్రకటనలో కోరింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఏప్రిల్ 7న ఈ ప్రతిపాదనను దక్షి ణ మధ్య రైల్వేకు పంపింది. దీనిపై స్పందించిన రైల్వే శాఖ, ఈ పథకం అమలుకు సంబంధించిన నిబంధనలు, షరతులతో కూడిన అవగాహన ఒప్పందం సమర్పించాలని కోరినట్టు ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం ప్రయాణికుల రద్దీ, ఇతర అంశాల ఆధారంగా ఎమ్ఎంటీఎస్ సేవలు నడుస్తున్నాయని, ఈ ప్రతిపాదనను తదుపరి చర్యల కోసం రైల్వే బోర్డు ఆమోదానికి పంపాల్సి ఉంటుందని రైల్వే అధికారులు వివరించారు. ఎమ్ఎంటీఎస్ రైళ్ల సంఖ్య, సమయాలు, స్టేషన్లలో కల్పించాల్సిన సౌకర్యాలు వంటి అంశాలపై పూర్తి నిర్ణయాధికారం దక్షి ణ మధ్య రైల్వేకే ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. రైల్వే బోర్డు నిబంధనల ప్రకారమే ఈ సేవలు కొనసాగుతాయని పేర్కొంది.

ప్రస్తుతానికి ఈ ప్రతిపాదన పరిశీలన దశలోనే ఉందని, రైల్వే బోర్డు ఆమోదం తర్వాతే దీనిపై ఒక తుది నిర్ణయం వెలువడుతుందని ప్రభుత్వం తెలియజేసింది. అందువల్ల, ఈ విషయమై అధికారిక ప్రకటన వెలువడే వరకు వేచి చూడాలని, సామాజిక మాధ్యమాల్లోని అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## తిరుమల సమాచారం



### తిరుమల భక్తుల సేవలో తిరునామధారణలో శ్రీవారి సేవకులు

తిరుమల, ఏప్రిల్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: హైందవ సనాతన ధర్మంలో తిరునామాన్ని శుభసూచికంగా భావిస్తారు. తిరునామం సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ప్రతీక. తిరునామాన్ని ధరించిన భక్తులను తిలకించడం మనకు తోడుగా, అండగా ఉన్నాడన్న భావన కలుగుతుంది. తిరుమలలో ఇలాంటి భక్తిసంప్రదాయాన్ని పెంచేందుకు టిటిడి భక్తులకు తిరునామధారణ చేయిస్తోంది. తిరునామంలో ఎర్రటిరంగురేఖ కనిపించే ఆకారం ఆత్మను సూచిస్తుంది. కొంత మంది భక్తులు భుజాలు, ఛాతిపైన, వీపుపై కింది భాగాన తిరునామం ధరిస్తారు. భక్తులు కనుబొమల మధ్య నుంచి నుదుటిపై వరకు ధరిస్తారు. తిరునామం ధరించినవారు శ్రీవేంకటేశ్వరుని సేవకులని సులువుగా గుర్తించవచ్చు. నుదుటన గల ఆగ్నేయచక్రంలో తిలకధారణ చేసుకుంటే చెడుదృష్టి పడకుండా ఉంటుందని భక్తుల నమ్మకం. తిరునామం కోసం నామకోపు, ఎర్రసింధూరం వినియోగిస్తున్నారు. తిరునామం పెట్టుకుంటే చలువ చేస్తుందని కూడా కొందరు భక్తుల అభిప్రాయం. తిరునామధారణ కోసం ప్రత్యేకంగా రాగితో తయారుచేసిన కప్పు, మూడు నామాల ముద్రను ఉపయోగిస్తారు. పవిత్రతకు ప్రతీకగా కనిపించే ఈ తిరునామం శ్రీవారి ముఖారవిందాన్ని మరింత తేజస్సుతో ఆవిష్కరిస్తూంటుంది.

**తిరునామ సేవ:** తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1లో ,ప్రత్యేక ప్రవేశ దర్శన ప్రవేశ మార్గం, శ్రీవాణి దర్శన ప్రవేశ మార్గం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 2లో సర్వదర్శనం భక్తులకు, అదేవిధంగా గొల్ల మండపం, రామ్ భగీచా3, బేడి ఆంజనేయస్వామి ఆలయం, కల్యాణకట్ట, సుపథం, వరాహస్వామివారి ఆలయం, నాలుగు మాడ వీధులు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం, సప్తగిరి విశ్రాంతి గృహం, జీఎన్సీ, నందకం విశ్రాంతి గృహం, లేపాక్షి సర్కిల్, ఏటీజీహెచ్, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం పరిసర ప్రాంతాల్లో భక్తులకు తిరునామధారణ జరుగుతోంది. ఇందుకోసం రోజుకు రెండు షిఫ్టుల్లో దాదాపు 168 మంది శ్రీవారి సేవకులు సేవలందిస్తున్నారు. తిరునామం ధరించేందుకు భక్తులు ఎలాంటి పైకం చెల్లించాల్సిన అవసరం లేదు. శ్రీవారి సేవకుల ద్వారా పూర్తిగా ఉచితంగా అందిస్తున్న తిరునామాన్ని ధరించి స్వామివారి కృపా, కటాక్షాలకు పాత్రులు కావాలని టిటిడి భక్తులకు విజ్ఞప్తి చేసింది.



### మే 15న 'వివన్ ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' విడుదల

● శ్రీవారిని దర్శించుకున్న తమన్నా

తిరుమల, ఏప్రిల్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రస్తుతం పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నానని, సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి తొలిసారి నటిస్తున్న 'వివన్ ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' చిత్రం మే 15న థియేటర్లలో విడుదల కానుందని సినీనటి తమన్నా తెలిపారు. ఈ చిత్రంతో బాటు శశాంక ఘోష్ దర్శకత్వంలో వస్తున్న "రాగిణి 3" చిత్రంలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. ఈ సినిమాలో అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ కూడా నటిస్తుండటం విశేషమన్నారు. ఆదివారం తిరుమలకు వచ్చిన తమన్నా సంప్రదాయ వస్త్రధారణలో ఆలయంలోనికి చేరుకుని శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. త్వరలో మంచి చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నానని వెల్లడించింది. ఆలయంలోపల ఆమె స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ఆలయం వెలుపల ఆమెతో బాటు భక్తులు ఫోటోలు తీసుకున్నారు. అలాగే మరో సినీనటి మానస వారణాసి శ్రీవారిని దర్శించుకుంది. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కలియుగ ప్రత్యక్షదైవం ఆశీస్సులందుకోవడం తనకెంతో ఆనందంగా ఉందని అన్నారు.

### శ్రీవారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి



తిరుమల, ఏప్రిల్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని స్వామి వారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య కోరారు. ఆదివారం వేకువజామున సుప్రభాతసేవలో ఆయన కుటుంబంతో కలసి ఆలయం లోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలకడంతో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి జస్టిస్ ఎన్.జయసూర్యకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### భగవద్ రామానుజాచార్యుల అవతార మహోత్సవాలకు ఏర్పాట్లు



తిరుమల, ఏప్రిల్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో మూడురోజులు జరిగే శ్రీ భగవద్ రామానుజాచార్యుల అవతార మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మూడు రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు సాహితీ సదస్సులు, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించబడతాయి.


నేటి సాయంత్రం 5.30 గంటలకు తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి మంగళాశాసనాలతో మహోత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం "శ్రీ రామానుజాచార్ల వైభవం"పై ఉపన్యాసం, తరువాత భక్తి సంగీత కార్యక్రమం జరుగుతుంది.

21న "శ్రీ రామానుజాచార్లు తిరుమల కైంకర్యము"పై ప్రసంగం, తరువాత హరికథ కార్యక్రమం ఉంటుంది.

22న "శ్రీ రామానుజాచార్లు గ్రంథములు"పై ఉపన్యాసం, అనంతరం భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించబడుతుంది.

# అమ్మను తలపిస్తోన్న అన్న క్యాంటీన్ల సేవలు

● లక్షల మంది పేదల కడుపు నింపే మహోన్నత కార్యక్రమం ● చంద్రబాబు జన్మదినం సందర్భంగా అన్న క్యాంటీన్లకు రూ.76 లక్షల విరాళం ఇచ్చిన భువనేశ్వరి ● నేడు రాష్ట్ర వ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్లలో ఉచితంగా భోజనం



విజయవాడ, ఏప్రిల్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో అన్న క్యాంటీన్లు అన్నం పెట్టే అమ్మను తలపిస్తున్నాయని నారా భువనేశ్వరి అన్నారు. అన్న క్యాంటీన్ల సేవలు ఎంతో మన్నన పొందాయని, లక్షల మంది పేదల కడుపు నింపే మహోన్నత కార్యక్రమంగా కూటమి ప్రభుత్వం దీన్ని నిర్వహించడం గొప్ప విషయం అని భువనేశ్వరి అభిప్రాయపడ్డారు. రూ.5లకే పరిశుభ్ర వాతావరణంలో ప్రభుత్వం గౌరవంగా పేదలకు భోజనం అందిస్తోందని ఆమె అన్నారు. ఏప్రిల్ 20వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా నారా భువనేశ్వరి రూ.76 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు సిఎం క్యాంప్ కార్యాలయంలో చెక్కును అన్న క్యాంటీన్ల సిఇఓకు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినం అయిన ఏప్రిల్ 20న రాష్ట్ర వ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్లలో పూర్తి ఉచితంగా భోజనం అందించాలని భువనేశ్వరి కోరారు. చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా పేదలకు కడుపు నింపే అన్న క్యాంటీన్లకు విరాళం ఇవ్వడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని భువనేశ్వరి అన్నారు. అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో అన్న క్యాంటీన్లలో పౌష్టికాహారం అందించడం గొప్ప విషయం అని ఆమె అభిప్రాయ పడ్డారు. రోజువారీ కూలీలు, పేదలు ఈ పథకం ద్వారా ఎంతో లబ్ది పొందుతున్నారని, ఇలాంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. అన్న క్యాంటీన్లకు ఆర్థికంగా చేయూతనివ్వడం స్ఫూర్తి నింపేందుకు అంతా ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం కంటే సంతృప్తి ఏముంటుందని వ్యాఖ్యానించిన భువనేశ్వరి...తాను పలు సందర్భాల్లో అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు కలిగిన సంతృప్తిని, ప్రజల స్పందనను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. తమ మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా 12 ఏళ్లుగా ప్రతీ ఏటా తిరుమలలో అన్న ప్రసాదానికి రూ.44 లక్షల విరాళంగా ఇస్తున్న విషయాన్ని ఆమె ప్రస్తావించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నారా భువనేశ్వరి, అన్న క్యాంటీన్లకు రూ.76 లక్షల విరాళం ఈ ఏడాది మీ పుట్టిన రోజుకు మీకిచ్చే బహుమానం అంటూ వ్యాఖ్యానించారు. తన పేరు మీద అన్న క్యాంటీన్లకు ఒక రోజు అన్నదానానికి రూ.76 లక్షల విరాళం ఇచ్చిన తన సతీమణి భువనేశ్వరిని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "రాష్ట్రంలో అన్నదాన కార్యక్రమాన్ని ఒక గొప్ప కార్యక్రమంగా ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నాం. తిరుమలలో భక్తుల సహకారంతో 4 దశాబ్దాలుగా అన్నదానం జరుగుతోంది. అలాగే ప్రముఖ దేవాలయాల్లోనూ అన్నదానం నిర్వహిస్తున్నాం. పేదలకు రూ.5 లకే కడుపునింపే అన్న క్యాంటీన్ సేవలను మరింత విస్తరించాలి. నాణ్యతను పాటించడంతో పాటు పవిత్రంగా, గౌరవంగా, పరిశుభ్రంగా ఆహారం అందించే ఈ కార్యక్రమానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలి. పుట్టిన రోజు, పెళ్లి రోజు సహా తమకు నచ్చిన రోజు భోజనాలకు అయ్యే ఖర్చును విరాళంగా ఇచ్చేందుకు ప్రజలు ముందుకు రావాలి. ఇదొక స్ఫూర్తి దాయకమైన కార్యక్రమంగా మారి బ్రాండ్‌ను సృష్టించాలి" అని చంద్రబాబు అన్నారు.



## కాళ్ళు బొబ్బలెక్కుతున్నాయి.. వేణుగోపాలస్వామీ!

● నిలువ నీడలేదు... చలువపందిళ్ళు కరువు

తిరుమల, ఏప్రిల్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ వైకుంఠం తిరుమల అంటేనే ముందుగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామి గుర్తుకు వస్తాడు. ఆతరువాత కొండపై స్థానిక ఆలయాలుగా విరాజిల్లుతున్న పాపవినాశనం మార్గంలోని వేణుగోపాలస్వామి ఆలయం ఉంది. ఇక్కడకు భారీగానే భక్తులు స్వామివారి దర్శనార్థం వస్తుంటారు. ఈ ఆలయాన్ని హాథీరాంజీ మఠం నిర్వాహకులు నిర్వహిస్తున్నారు. భక్తుల నుండి కానుకల రూపంలో హుండీకి ఆదాయం సమకూరుతూన్నా భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంపై మఠం నిర్వాహకులు దృష్టి సారించలేదు. తిరుమలలో వేణుగోపాలస్వామి ఆలయానికి వస్తున్న భక్తులు ఆలయం ప్రవేశం చేయాలంటే అసలే ఇరుకైన నడకదారి మెట్లెక్కి వరుస క్రమంలో ముందుకు పోవాలంటే వేసవిలో మండుతున్న ఎండలకు అడుగు ముందుకు వేయలేకపోతున్నారు. పక్కకు నడవలేని పరిస్థితి. రెండువైపులా దుకాణాలు ముందుకు వచ్చిన స్థితిగా ఉంటుంది. ఇక్కడ ప్రత్యేకంగా వేసవి చలువ పందిళ్ళు ఏర్పాటు చేయకపోవడంతో విచ్చేసిన భక్తులకు నిలువ నీడ లేకుండా ఉక్కపోతలు భరిస్తున్నారు. త్రాగు నీరు కుండలు ఏర్పాటు లేవు. దాహార్తిని తీర్చే మార్గం లేదని భక్తులు ఆగ్రహం చెందుతున్నారు. ఉచిత దర్శనం అమలు చేయకపోగా ప్రవేశం రుసుం తప్పనిసరి ఐదు రూపాయలు టిక్కెట్ ప్రతిఒక్కరూ కొని వెళుతున్నా సౌకర్యాలు శూన్యంగా మారిపోయాయి.

## సన్నిధిగొల్ల పేరుతో తప్పుడు ప్రచారం

● నమ్మొద్దని టిటిడి విజ్ఞప్తి

తిరుమల, ఏప్రిల్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని స్థానిక ఆలయాలైన తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలోని అప్పలాయగుంటలో 'సన్నిధిగొల్ల' వివాదంపై అసత్య ప్రచారం చేయడం తగదని టిటిడి హెచ్చరించింది. ఆలయంలో లేని పదవిపై తప్పుడు కథనాలను భక్తులను నమ్మవద్దని తిరుమల తిరుపతి దేవస్థానాలు విజ్ఞప్తి చేసింది. కె. వెంకటేష్ పద్మావతి హాస్పిటాలిటీ ఫెసిలిటీస్ మేనేజ్మెంట్ సర్వీసెస్ ద్వారా ఆరోగ్య విభాగంలో కాంట్రాక్ట్ వర్కర్‌గా మాత్రమే పని చేస్తూ ఉండేవారని, భక్తుల నుండి అతనిపై ఫిర్యాదులు అధికం కావడంతో సదరు కాంట్రాక్టర్ అతనిని ఉద్యోగం నుండి తొలగించారని టిటిడి తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో కొంతమంది వ్యక్తులు అసత్య ప్రచారం చేస్తూ, విజిలెన్స్ అధికారులు అతనిని నిర్బంధించారని, సదరు వ్యక్తిని తామే బయటకు తీసుకెళ్లామని, ఇది అవమానకరమని ఆరోపించడం పూర్తిగా అవాస్తవమని టిటిడి తెలిపింది. అవాస్తవాలను ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది.

## మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుని వారికి తీరని అన్యాయం చేశారు

●కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ




విజయవాడ, ఏప్రిల్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: మహిళల ఆశలు, ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ చిదిమేసిందని కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ విమర్శించారు. బిజెపి ఎపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో కలసి దేశ రాజధానిలో మీడియా సమావేశం నిర్వహించారు. బిల్లును అడ్డుకుని కాంగ్రెస్ పార్టీ ఘోరమైన పాపం చేసిందని రామ్మోహన్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల ఆగ్రహాన్ని కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు రుచి చూస్తాయన్నారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికి, పార్టీకి, ప్రాంతానికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు. డీలిమిటేషన్‌ను ఎందుకు అడ్డుకుంటున్నారో విపక్షాలు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల హక్కులను కాంగ్రెస్ కాల రాసిందని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసనగా విజయవాడలో మహిళా ఆక్రోశ సభ నిర్వహిస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ప్రకటించారు.

## పవన్ త్వరగా కోలుకోవాలి: వైఎస్ జగన్

విజయవాడ, ఏప్రిల్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపి డిప్యూటీ సిఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ త్వరగా కోలుకోవాలని మాజీ సీఎంజగన్ ఆకాంక్షించారు. ఎక్స్‌వేదికగా ఆదివారం జగన్ చేసిన పోస్టులో పవన్ త్వరగా యాక్టివ్ కావాలని కోరారు.పవన్‌కు ఇటీవల సర్జరీజరిగింది. ఈ నేపథ్యంలో పవన్ త్వరగా కోలుకోవాలంటూ వైసిపి అధినేత వైఎస్ జగన్ ఆకాంక్షించారు.

## 28న తిరుచానూరు పద్మావతిదేవి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుమల, ఏప్రిల్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈనెల 28న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయంలో ఏప్రిల్ 30 నుండి మే 2వ తేదీ వరకు వార్షిక వసంతోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. వసంతోత్సవాల సందర్భంగా ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి ఉదయం 6 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేయనున్నారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. ఉదయం 9.30 గంటల నుండి భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. ఈ కారణంగా 28న కల్యాణోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దుచేసింది.

## మహిళా బిల్లుకు విపక్షాలు మోకాలడ్డటం బాధాకరం

మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆవేదన



విజయవాడ, ఏప్రిల్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: మహిళా బిల్లుకు విపక్షాలు మోకాలడ్డటం బాధాకరమని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేసారు. ఇండియా కూటమి భారత్‌లో ఉన్న మహిళలకు ద్రోహం చేసిందని సంధ్యారాణి తెలిపారు. మహిళా బిల్లు వీగిపోయేలా చేసి సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మంత్రి అసహనం వ్యక్తం చేశారు. మహిళా నేతగా రూ.400 కోట్ల నిధులు తెప్పించుకుని అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. మా సంఖ్య మరింత పెరిగితే ఎంత అభివృద్ధి జరుగుతుందో ఊహించుకోవచ్చుని మంత్రి సంధ్యారాణి ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రజలు ఇండియా కూటమి గట్టి గుణపాఠం చెబుతారన్నారు. మహిళలను అనేక సందర్భాల్లో కాంగ్రెస్ అణచివేతకు గురిచేసిందన్నారు. కాంగ్రెస్ అండ్ కంపెనీ మహిళా విరోధి అని మంత్రి అన్నారు. మహిళా బిల్లును అడ్డుకోవడమంటే వారి హక్కులను హరించడమేనని అభిప్రాయపడ్డారు. డీలిమిటేషన్‌ను అడ్డుకోవడం అంటే ఎస్సీ, ఎస్టీల ఎదుగుదలను ఆపడమేనని అన్నారు.

## నైపుణ్య శిక్షణ ఉంటే కొలువులకు కొదవలేదు

● మాతో కలిసి పని చేయండి ● సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డిఎన్ రావు




నెల్లిమర్ల, ఏప్రిల్ 19, ప్రభాతవార్త: యువతకు నైపుణ్యం ఉంటే ఉద్యోగాలకు కొదవలేదని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డిఎన్‌రావు అన్నారు. ఆదివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కౌశల్ సాది కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డిగ్రీలపై ఆధారపడి లభించే ఉద్యోగాలు తగ్గిపోతున్నాయని, నైపుణ్యాల మీద ఆధారపడి ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతుందని అన్నారు. అందువల్ల యువత నిరాశ చెందకుండా ఏదో ఒక రంగంలో నైపుణ్య శిక్షణ పొందాలన్నారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో పదో తరగతి నుంచి ఇంజనీరింగ్ వరకు, పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు కూడా నైపుణ్య శిక్షణలు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రామీణ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉద్దేశ్యం అన్నారు. రానున్న కాలంలో కూడా పరిశ్రమలకు అనుగుణంగా అవసరమైన శిక్షణను అందించేందుకు తాము 160 రకాల నైపుణ్య శిక్షణలను గుర్తించామన్నారు. డేటా సెంటర్ సబ్బవరంలో ఆర్సి మెటల్ తదితర కొత్త కొత్త పరిశ్రమలు రాబోతున్నాయన్నారు. వీటన్నింటికీ ఏ ఏ రకాల నైపుణ్యమైన శిక్షణ అవసరమో తాము గుర్తించామని ఆయా రంగంలో యువతకు శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కలిగేలా తీర్చిదిద్దతామని భరోసా ఇచ్చారు. అనంతరం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ కోర్సులతోపాటు నైపుణ్య కోర్సులను కూడా అందిస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి, రిజిస్ట్రార్ పల్లవి చేతుల మీదుగా పలువురికి కౌశల్ షాది ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్లు వివిధ రకాల కోర్సులు గురించి వివరించారు. ప్రొఫెసర్ ఎమ్.ఎల్.ఎన్. ఆచార్యులు, డాక్టర్ ఆర్ఎస్ వర్మ వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




## నేను ఏ తప్పు చేయలేదు.. కడిగిన ముత్యంలా వస్తా!

40 రోజుల తర్వాత ఏలూరు వచ్చిన ఎంపీ పుట్టా మహేష్

ఏలూరు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త బ్యూరో: తాను నిష్కళంకితుడననీ, హైదరాబాద్ డ్రగ్స్ కేసులో తన పాత్ర ఏమీ లేదని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. హైదరాబాద్ శివారులో ఒక ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ పార్టీకి వెళ్లారని ఆరోపణలు ఎదుర్కొన్న తరువాత ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ 40 రోజుల తర్వాత ఆదివారం మళ్ళీ ఏలూరులో అడుగు పెట్టారు. ఈ సందర్భంగా ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ డ్రగ్స్ కేసులో తాను ఏ తప్పు చేయలేదని స్పష్టం చేశారు. తనపై వచ్చిన ఆరోపణలన్ని తప్పని, డ్రగ్స్ కేసు విచారణలో కడిగిన ముత్యంలా బయటకు వస్తానని ఎంపీ విశ్వాసం వ్యక్తం చేశారు. కేసు ఇంకా విచారణ దశలోనే ఉన్నందున దానిపై ఎక్కువగా మాట్లాడలేనని, మీడియా సంయమనం పాటించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. తాను ఏ తప్పు చేయకపోయినా మీడియాలో వచ్చిన కథనాలతో మనస్థాపానికి గురయ్యాయని చెబుతూ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు తనకు మద్దతుగా నిలిచారన్నారు. కష్టసమయంలో తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. ఇకనుంచి మళ్ళీ ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవుతానని, ఏలూరు పార్లమెంటు అభివృద్ధికి అంకితమై పని చేస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, రోషన్ కుమార్, ధర్మరాజు, అప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు ఇతర నేతలు ఎంపీ మహేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు.

# అంతరిక్ష నిపుణుల కోసం మేధోమథనం

● ఐఐటిలో ముగిసిన రెండు రోజుల రౌండ్ టేబుల్ సమావేశం




సమావేశంలో పాల్గొన్న ఐఐటి, ఇస్రో ప్రతినిధుల బృందం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త: అంతరిక్ష నిపుణుల కోసం మేధోమథనం ఎంతో అవసరమని రెండు రోజుల పాటు సాగిన తిరుపతి ఐఐటి రెండు రోజుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఐఐటి, ఇస్రో ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఆదివారం సాయంత్రం మీడియా సమావేశంలో నిర్ణయాలను ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ వివరించారు. ఐఐటీ తిరుపతి, మెహతా ఫ్యామిలీ ఫౌండేషన్ సహకారంతో, "భారతదేశ అంతరిక్ష కార్యబలాన్ని నిర్మించడం" అనే అంశంపై రెండు రోజుల రౌండ్ టేబులు సమావేశం విజయవంతంగా ముగించిందని వివరించారు. ఐఐటి తిరుపతిలోని స్పేస్ సైన్స్ ఇంజనీర్లతోపాటు, భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే తదుపరి తరం అంతరిక్ష నిపుణుల కోసం ఒక రోడ్ మ్యాప్‌ను రూపొందించడానికి మేధోమథనం చేయడా నికి ఇస్రో, రక్షణ అంతరిక్ష సంస్థ (డిఎస్ఏ), ప్రముఖ విద్యాసంస్థలు, అభివృద్ధి చెందుతున్న ప్రైవేట్ అంతరిక్ష రంగం నుండి నాయకుల బలమైన కూటమి ఒకచోట చేరిందన్నారు. అంతరిక్ష రంగంలో మానవ వనరుల నుండి పరిశోధన, వ్యవస్థాపకత వరకు భారతదేశానికి సాంకేతిక ప్రతిభావం ఆవశ్యకతను నొక్కిచెబుతూ, ఐఐటి తిరుపతి డైరెక్టర్ డాక్టర్ కె.ఎన్. సత్యనారాయణ, సంస్థ వ్యూహాత్మక భౌగోళిక స్థానం, అలాగే పలు రంగాలలో బలమైన సాంకేతిక పరిజ్ఞానం ఉండటం వంటివి. అంతరిక్ష విద్యారంగంలోకి ఐఐటి తిరుపతి సకాలంలో ప్రవేశించడానికి దోహదపడుతు న్నాయని వివరించారు. 'అంతరిక్ష విజ్ఞానం, సాంకేతికత, అనువర్తనాలలో ఒక అగ్రగామి పాఠశాలను అభివృద్ధి చేయడానికి, అలాగే భవిష్యత్ వ్యోమగా శిక్షణ ఇచ్చే కీలక కేంద్రంగా పనిచేయడానికి ఐఐటి తిరుపతికి ప్రత్యేకమైన స్థానం ఉంది." అని ఆయన అన్నారు. ఈ సమావేశానికి ఐఐఎస్టి ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.ఎన్. సురేష్ విచ్చేసి, సంస్థ కీలకమైన ప్రాధాన్యతా రంగాలపై తన లోతైన అంతర్దృష్టులను పంచుకున్నారు. మెహతా ఫ్యామిలీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాహుల్ మెహతా, ఇస్రో శాస్త్రీయ కార్యదర్శి గణేష్ పిళ్ళై, అశోక చక్ర గ్రూప్ కెప్టెన్ శుభంశు శుక్లా, స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు నాగభరత్ డాకా. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం డైరెక్టర్ ఇ.ఎస్. పద్మకుమార్, యు.ఆర్.రావు శాటిలైట్ సెంటర్ ప్రతినిధి ఎం. శంకరన్, మిధాని సిఎండి ఎస్.వి.ఎస్. నారాయణ మూర్తి, మెహతా ఫ్యామిలీ ఫౌండేషన్ గ్లోబల్ డైరెక్టర్ నవీన్ ఝా తదితరులు పాల్గొని, తమ అనుభవాలను పంచుకున్నారు.

కునుకు పడితే

# మనసు కాస్త కుదుట పడతది!

'కునుకు' పడితే మనసు కాస్త కుదుట పడతది. ఔను.. మనసును ప్రశాంత పరుస్తుంది. ఒత్తిడి, అలసటలను తగ్గిస్తుంది. అందుకే నిద్రాభంగం లేని 'నిద్ర' కోసమే ప్రతిఒక్కరూ ఎదురు చూస్తుంటాం. ఈ నేపథ్యమే 'స్లీప్ డివోర్స్' ట్రెండ్ నడుస్తోంది. మూడింట ఒక వంతు మంది ఈ ట్రెండ్‌కే అంకితమవుతున్నారు. 'స్లీప్ డివోర్స్' అంటే తెలుసా? అదేదో వినకూడని మాట కాదు. అనకూడని విషయం అంతకన్నా కాదు. ఇప్పుడు ఎల్లెడలా ఇదే చర్చ కొనసాగుతోందంటే నమ్మండి.

ఇటీవల నిద్ర, నిద్ర లేమి, వాటి ప్రాముఖ్యత, 'స్లీప్ డివోర్స్' ట్రెండ్‌పై ప్రముఖ నటి సోహా అలీఖాన్ చర్చలో పాల్గొనడంతో మరింత విస్తృతంగా అతివల చెవులకెక్కింది. నిద్రలేమి వల్ల డయాబెటిస్, హైపర్ టెన్షన్ వంటి వ్యాధులు పెరుగుతున్నందున పెద్దలకు ప్రతిరోజూ కనీసం 7–8 గంటల నిద్ర అవసరముంది. అయితే నిద్రమాత్రలను వైద్యుల సలహాతో వాడటం ఉత్తమం. నిద్రలోనే మెదడు శుభ్రపడటంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుంది.



ఆధునిక జీవనశైలిలో శరీరానికి విశ్రాంతి, స్వస్థత, నూతనోత్తేజం అందించడంలో నిద్ర అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. అయినప్పటికీ, ఆధునిక జీవనశైలిలో చాలామంది నిద్రను నిర్లక్ష్యం చేసేవారే ఎక్కువ. టీవీ సీరియల్స్ చూడటం, స్నేహితులతో పార్టీలు చేసుకోవడం, సోషల్ మీడియాలో గంటల తరబడి గడపడం వంటి కారణాలతో నిద్ర సమయం తగ్గిపోగా తీవ్ర ఆరోగ్య సమస్యలు మీద పడుతున్నాయి.

ఈ నేపథ్యంలో నిద్ర ప్రాముఖ్యతపై ప్రముఖ నటి సోహా అలీ ఖాన్ తన పాడ్ కాస్ట్‌లో ఒక ఆసక్తికరమైన చర్చను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో నటి కల్కి కోచ్లిన్, ఢిల్లీ అపోలో హాస్పిటల్‌కు చెందిన పల్మనాలజీ నిపుణురాలు డాక్టర్ వినీ కంత్రూ పాల్గొన్నారు. ఈ మధ్య కాలంలో ప్రాచుర్యం పొందుతున్న 'స్లీప్ డివోర్స్' అంటే ప్రశాంతమైన నిద్ర కోసం భార్యాభర్తలు వేర్వేరు పడకలపై లేదా గదుల్లో నిద్రపోవడాన్నే ఇలా పిలుస్తారు.

దీనిపై డాక్టర్ కంత్రూ ఏమన్నారంటే "గురక వంటి సమస్యలు ఇందుకు ప్రధాన కారణమని, 'స్లీప్ అప్నియా'కు సంకేతం. ఇది చికిత్స ద్వారా నయం చేయడం తేలికే. గురక ఉన్నవారు నిద్రకు ముందు మద్యం సేవించకపోవడం, ఒకవైపు తిరిగి పడుకోవడం వంటివి.. చేయడం ద్వారా సమస్యను తగ్గించుకోవచ్చు.

"శరీరానికి నిద్ర చాలా చాలా ముఖ్యం. మెదడులోని అనవసర విషయాలను తొలగించడం (డీక్లటరింగ్), జ్ఞాపకశక్తిని పదిలపరచడం, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం వంటివన్నీ నిద్రలోనే జరుగుతాయి" అని డాక్టర్ కంత్రూ స్పష్టం చేశారు. కండరాల మరమ్మతు, శరీర స్వస్థతకు కూడా నిద్ర అవసరమని తెలిపారు. రాత్రిపూట మెదడులో ఒక ప్రత్యేక ద్రవం చురుగ్గా ఉండి, విష పదార్థాలను బయటకు పంపిస్తుందని, శరీరం శుభ్రపడే ప్రక్రియ కూడా నిద్రలోనే జరుగుతుందని ఆమె వివరించారు.

**నిద్రలేమితో అనర్థాలు:** ఒక వ్యక్తికి కొన్ని రోజులు లేదా వారాల పాటు నిద్ర సరిగా లేకపోతే 'టాకీకార్డియా' (గుండె వేగంగా కొట్టుకోవడం) సమస్య ఎదురవుతుందని డాక్టర్ కంత్రూ హెచ్చరించారు. ఏకాగ్రత లోపించడం, మెదడు మొద్దుబారడం, ఆలోచనలకు, మాటలకు మధ్య సమన్వయం లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు.

భారత్‌లో సరైన నిద్ర లేకపోవడం వల్ల 'మెటబాలిక్ మహమ్మారి' వేగంగా విస్తరిస్తోంది. ఇదే ఆందోళన పడవలసిన విషయం. డయాబెటిస్, హైపర్టెన్షన్ (అధిక రక్తపోటు), అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా వంటి సమస్యలు ఎక్కువవు తున్నాయని తెలిపారు. దీర్ఘకాలిక నిద్రలేమి శరీరంలో ఇన్సులిన్ సెన్సిటివిటీని దెబ్బతీస్తుందని, దీనివల్ల శరీరం ఎక్కువ ఇన్సులిన్ను ఉత్పత్తి చేసి, చివరికి బరువు పెరగడానికి కారణమవుతుందని వివరించారు.

"అప్పుడప్పుడు, వైద్యుల పర్యవేక్షణలో వాడితే ఈ మాత్రలు సురక్షితమే. కానీ, తరచుగా వాడటం ప్రమాదకరం. నిద్ర సమస్యల్లో చాలా రకాలున్నాయి. వయోజనులు (20–40 ఏళ్ల మధ్య) రోజుకు కనీసం 7–8 గంటలు, చిన్నపిల్లలు వారి ఎదుగుదలకు అనుగుణంగా 18 గంటల వరకు నిద్రపోవడం అవసరమని ఆమె సూచించారు.

భారతీయ జంటల్లో ఇపుడు నిద్రరోగ్యం కోసం 78 శాతం మంది ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. మరి మనుకెంతైనా నిద్రతోనే ఆరోగ్యసిరి!

# అల్లరి పిల్లల్ని అదుపు చేద్దామిలా!

ఇప్పుడంతా పిల్లలదే రాజ్యం. వాళ్ళ మీద కస్సుబుస్సులు కుదరవు. కాలం మారింది. తరాలు మారాయి. నా చిన్నప్పుడు అమ్మ చెబితే నేను వినలేదా!? వీడికేం పోయే కాలం వచ్చింది? అని అనుకునే రోజులు కావు. ఏదైనా అడిగితే చాలు కారణం లేకుండానే కోపం వచ్చేస్తుంది.. ఈ కాలపు పిల్లల్లో. ఏదైనా చేస్తానని చెప్పి, ఇంకా కాలేదంటే కోపం పెల్లుబికి వస్తుంది. పూర్వం ఐతే కోపం మాటల్లో చెప్పలేక చేతల్లో చూపించేవారు. గట్టిగా అరవడం, కళ్ళకు కనపడినవన్నీ విసిరేయడం, ఇలాంటప్పుడు ఎక్కడ ఏది తగులుతుందో, దేనికి తగులుతుందో కూడా ఆలోచించే విచక్షణ ఉండదు. ఇవన్నీ మామూలుగా వచ్చేవే. అరచి అరిచి అలసిపోయినప్పుడు మాత్రమే వాళ్ళు తగ్గుతారని నమ్మి రెచ్చగొడితే, నీతి వాక్యాలు చెబితే ఇక అంతే. ఇల్లు కిష్కింధాపురే! అంత కన్నా ముందే సంయమనంతో తల్లులు పిల్లలతో సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తే వాళ్లే అదుపులోకి వస్తారు.



ఒకసారి ఆ సమయంలో అమ్మలు వాళ్ళ మీద తిరుగుబాటు చేయకుండా సాధ్యమైనంత వరకు వాళ్ళని అదుపులో పెట్టేందుకు శాంతి వచనాలు చెప్పొచ్చు.

అంతేతప్ప వాళ్ళు ఊరికే ఏదో కొన్ని ఊతపదాలతో రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే ఇక అంతే. మాట వినరు. తన కోపానికి కారణం ఏంటో నెమ్మదిగా అడిగి తెలుసుకోవాలి. వాళ్ళ దారిలోకి వెళ్లి వాళ్ళను మన దారిలోకి తెచ్చుకోవాలి. కోపంగా ఉన్నారు కదా? అని వాళ్ళు అడిగిందల్లా చేయడం కూడా తప్పే. అలవాటు పడితే రేపు ఎప్పుడో మనం దగ్గర లేనిదేది అడిగి ప్రాణం తీస్తారు. 'కొండ మీద కోతినీ దింపగలం' అనుకుంటే పిల్లలు కోరరానివి కోరితే ఇబ్బంది పడతాము.

ఆ పైన పిల్లలు తల్లుల మాట వినరు. వాళ్ళను దగ్గరికి తీసి చాకచక్యంగా కంట్రోల్‌లోకి తీసుకోవడం తల్లుల బాధ్యతగా ఉండాలి. ఒకసారి కోపగించినప్పుడు అమ్మ అడిగిందల్లా ఇస్తుంది.. అనే విషయాన్ని పసిగడితే మరొకసారి మాట వినడం కల్ల. మళ్ళీ మళ్ళీ అదే రకం అల్లరి. అమ్మను విసిగిస్తే పని అయిపోతుందని ధోరణి రానీయద్దు. బ్లాక్ మెయిలింగ్ నేచర్ బాగా అలవాటు పడిపోతుంది. కనుక పిల్లలతో తస్మాత్ జాగ్రత్త సుమీ!

## పరవశమే.... పరవశమే!

పచ్చిక బయళ్ళు, గుబురు పొదలు, చెట్టూ చేమలు, మొక్కలు, గడ్డి, చెట్ల మధ్య గడిపితే గుండె వేగం, ఒత్తిడి స్థాయిలు తగ్గుతాయని శాస్త్రీయ పరిశోధనలలో తేలింది. ప్రతి రోజూ పచ్చపచ్చని వాతావరణంలో కాస్సేపు గడిపితే చాలు గర్భిణులకి కూడా స్వాంతన చేకూరుతుంది. అలాంటి వారికి తెలివైన, ఆరోగ్యవంతులైన పిల్లలు జన్మిస్తారని స్పెయిన్ పరిశోధకులు గుర్తించారు. వీరికి పుట్టే పిల్లల ఆరోగ్యవంతమైన బరువుతో ఉంటారని గుర్తించారు. వీరికి తెలివి తేటలూ అధికంగానే సంక్రమిస్తాయిట. బుద్ధికుశలత (ఐక్యూ)లో వారికి మించిన వారు ఉండరట. ఎవరైనా సరే కాసేపు పచ్చని చెట్లు, మొక్కలు, పూల చెట్ల మధ్య తిరిగితే వచ్చే ప్రశాంతత వేరు. వ్యాయామం చేసినట్లు అవుతుంది. ఇలాంటి ప్రశాంత వాతావరణమే భావోద్వేగాలను నియంత్రణలో ఉంటాయి. అందుకే గర్భిణులను ఇంట్లోనే ఉంచకుండా పచ్చికలో తిప్పడం, ప్రకృతిని వీక్షి ంచే పరిస్థితి కల్పించే బాధ్యత ఆమె జీవిత భాగస్వామిదే. కుటుంబ సభ్యులతో ఆహ్లాదకరంగా గడపడం కూడా మేలు




## నిమ్మతోనే ఆరోగ్యం!

నిమ్మకాయలో 'సి' విటమిన్ అధికంగా ఉంటుందని తెలిసిందే. ఇది రక్తహీనతతో బాధపడే మహిళలు రోజూ ఎంతో కొంత తమ ఆహారంలో తీసుకోవడం మేలు. శరీరంలోని ఇతరత్రా ఆహార పదార్థాల్లోని ఐరన్‌ను గ్రహిస్తుంది. నిమ్మరసం తాగితేనో, నిమ్మకాయ రుచి తగిలితేనే అబ్బో! జలుబు.. కదా! అనుకుంటారు. అదేమీ ఫర్వాలేదు. వేసవిలో డీహైడ్రేషన్‌ను పోగొడుతుంది. ఉదయాన్నే గోరువెచ్చని నీళ్లలో అరచెక్క నిమ్మరసం కలుపుకొని తాగితే జీర్ణవ్యవస్థ మెరుగు పడుతుంది. రక్తపోటు, అధిక బరువూ అదుపులో ఉంటాయి. ఊబకాయులకు కూడా నిమ్మరసం శరీరాన్ని తేలికపరుస్తుంది. అందుకే విటమిన్ 'సి' తగ్గితే ముందుగా గుర్తొచ్చేది నిమ్మకాయే!



## యౌవన వేళ...

యౌవన దశలో భావోద్వేగ మార్పులు సహజం. కోపం, భయం, ఆందోళన వంటి భావనలు రావచ్చు. సరైన మార్గదర్శనం, ఆరోగ్యకరమైన అలవాట్లు, కుటుంబ సహకారం ఎంతో అవసరం. ఈ దశలో బాలికలు పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతిరోజూ స్నానం చేయడం, శుభ్రమైన దుస్తులు ధరించడం, ముఖ్యంగా నెలసరి (మాసిక ధర్మం) సమయంలో శానిటరీ న్యాప్కిన్లు లేదా పరిశుభ్రమైన వస్త్రాలు ఉపయోగించడం అవసరం. ప్రతి 4–6 గంటలకు మార్చడం మంచిది. పోషకాహారం ముఖ్యమైనది. ఇనుము, కాల్షియం, ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. పాలు, గుడ్లు, ఆకుకూరలు, పండ్లు, గింజలు వంటి ఆహారాలు శరీర వికాసానికి సహాయపడతాయి. రోజూ కొంతసేపు వ్యాయామం చేయడం శరీరాన్ని దృఢంగా ఉంచుతుంది. యోగా, నడక, ఆటలు ఆరోగ్యానికి మంచివి. అలాగే 7–8 గంటల నిద్ర కూడా చాలా అవసరం. అపరిచితులతో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఆన్లైన్లో కూడా వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దు. సరైన మార్గదర్శనం, మద్దతుతో బాలికలు ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో ఎదుగుతారు.



## శ్రీకృష్ణ నిర్యాణం!

భారతీయ ఇతిహాసాల్లో ఎంతో హృదయానికి హత్తుకునే ఘట్టం. ద్వారకా నగరంలో రాజ్యాన్ని పాలిస్తూ, ధర్మాన్ని స్థాపిస్తూ, భక్తులను రక్షి స్తూ ఉన్న శ్రీకృష్ణుడు తన అవతార కార్యం పూర్తయ్యే సమయం దగ్గరపడింది. మహాభారత యుద్ధం ముగిసి, యాదవ వంశంలో అహంకారం, కలహాలు పెరిగాయి. ఒక రోజు యాదవులు పరస్పరం కలహించి, శాప ప్రభావంతో ఒకరినొకరు సంహరించుకున్నారు.




ఈ సంఘటనలన్నీ చూసిన కృష్ణుడు, భూమిపై తన కార్యం పూర్తయిందని గ్రహించాడు. ద్వారకను విడిచి, అడవిలోకి వెళ్లి ఒక చెట్టు క్రింద ధ్యానంలో కూర్చున్నాడు. అతని దివ్యమైన రూపం ప్రశాంతంగా, లోకానికి అతీతంగా కనిపించింది.

అదే సమయంలో, జర అనే వేటగాడు అక్కడికి వచ్చాడు. దూరం నుండి కృష్ణుని పాదాలను జింకగా భావించి బాణం విడిచాడు. ఆ బాణం కృష్ణుని పాదాన్ని తాకింది. దగ్గరకు వచ్చి చూసిన జర, తన తప్పును గ్రహించి భయంతో వణికిపోయాడు.

కృష్ణుడు చిరునవ్వుతో, "ఇది నీ తప్పు కాదు. ఇది నా అవతారాంతం కోసం జరిగే దైవలీల" అని అతన్ని ధైర్యం చెప్పాడు. అతనికి మోక్షం ప్రసాదించి, తన దివ్య స్వరూపాన్ని ప్రదర్శించాడు.

అలా, శ్రీకృష్ణుడు తన భౌతిక శరీరాన్ని విడిచి, వైకుంఠానికి తిరిగి వెళ్లాడు. అతని నిర్యాణంతో ద్వారక నగరం సముద్రంలో మునిగిపోయింది.

ఈ కథ మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది. అవతారాలు కూడా ఒక లక్ష్యంతోనే వస్తాయి, ఆ లక్ష్యం పూర్తయిన తర్వాత తిరిగి తమ దివ్య లోకాలకు చేరుకుంటారు. శ్రీకృష్ణుడు చూపించిన ధర్మం, ప్రేమ, జ్ఞానం యుగయుగాల పాటు మనకు మార్గదర్శకంగా నిలుస్తాయి.



# రెటీనా.. షూటింగ్ షురూ

సినీ రంగంలో వైవిధ్యమైన కథాంశాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. అదే కోవలో టెక్నికల్ అంశాలకు భావోద్వేగాలను జోడించి రూపొందుతున్న సరికొత్త చిత్రం రెటీనా. అల్లం రాజు దర్శకత్వంలో పార్వతి సినిమాస్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రం ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్ర ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టి చిత్ర యూనిట్‌కు ఆశీస్సులు అందించారు. రజాకార్ చిత్రంతో గుర్తింపు పొందిన దర్శకుడు యాట సత్యనారాయణ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, కమిటీ కుర్రోళ్ళు ఫేమ్ యశ్వంత్ పెండ్యాల తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించడం విశేషం. ఈ సందర్భంగా దర్శకుడు అల్లం రాజు మాట్లాడుతూ.. కష్టపడితేనే ఫలితం వస్తుందని నమ్మి ఈ సినిమాను మొదలుపెట్టాం. రెటీనా అనేది ప్రతి మనిషి జీవితంలో ఎంత ముఖ్యమో, ఈ సినిమా కథ కూడా అంతే సహజంగా, ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. టెక్నికల్ వాల్యూస్‌తో పాటు హార్ట్ టచింగ్ ఎమోషన్స్ ఈ సినిమాలో హైలైట్‌గా నిలుస్తాయి అని ధీమా వ్యక్తం చేశారు. అతిథిగా వచ్చిన యాట సత్యనారాయణ మాట్లాడుతూ కథలోని కొత్తదనాన్ని మెచ్చుకోగా, నటుడు యశ్వంత్ పెండ్యాల మాట్లాడుతూ ఈ చిత్రంలో యువత తమను తాము చూసుకునేలా పాత్రలు ఉంటాయని తెలిపారు. మనీష్, సోనియానాయుడు, ప్రీతీ హెస్సోనా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి పార్వతి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.





## అధర్మాన్ని ఎదుర్కొనే శక్తి

యానిమేషన్ రూపంలో విష్ణుమూర్తి దశావతారాలను వెండితెరపై ఆవిష్కరిస్తూ రూపొందుతున్న మహావతార్ సినిమాటిక్ యూనివర్స్ ప్రస్తుతం సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ యూనివర్స్ నుంచి వచ్చిన మొదటి చిత్రం మహావతార్ నరసింహ సృష్టించిన సంచలనం నేపథ్యంలో తాజాగా వస్తున్న రెండో సినిమా మహావతార్ పరశురామ్. పరశురామ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం చిత్ర బృందం మహావతార్ పరశురామ్ ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేసింది. లోకంలో ధర్మం నశించినప్పుడు, అధర్మాన్ని ఎదుర్కొనే శక్తిగా పరశురాముడు సమతుల్యతను తిరిగి స్థాపిస్తాడు.. అనే క్యాప్షన్ సినిమా నేపథ్యాన్ని స్పష్టం చేస్తోంది. హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని దర్శకుడు అశ్విన్ కుమార్ పక్కా ప్రణాళికతో ముందుకు తీసుకెళ్తున్నారు.

# తెర

## మాది స్వచ్ఛమైన గోదావరి ప్రేమకథ

మేమ్ ఫేమస్ ఫేమ్ సుమంత్ ప్రభాస్ హీరోగా, సుభాష్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం గోదారి గట్టుపైన. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రం మే 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు నాగ వంశీ విలేకరుల సమావేశంలో పంచుకున్న విశేషాలు ఆయన మాటల్లోనే..వారసత్వంగా వచ్చిన సంగీతం"మాది వరంగల్‌లోని హానుమకొండ. మా నాన్నగారు ఫ్లూట్, కీబోర్డ్ ప్లేయర్. ఆయన దగ్గరే నేను సంగీత ఓనమాలు నేర్చుకున్నాను. సాయి కార్తీక్, అనూప్ రూబెన్స్, జి.వి. ప్రకాష్ వంటి ప్రముఖ సంగీత దర్శకుల దగ్గర కీబోర్డ్ ప్లేయర్‌గా పనిచేయడం వల్ల నాకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మీద మంచి పట్టు వచ్చింది. పెళ్లి పుస్తకం గుర్తింపు దర్శకుడు సుభాష్



గారితో నాకు 15 ఏళ్ల అనుబంధం ఉంది. మేము కలిసి చేసిన పెళ్లి పుస్తకం షార్ట్ ఫిలిం సాంగ్ ఎంత పెద్ద సెన్సేషన్ అయ్యిందో అందరికీ తెలిసిందే. ఆ నమ్మకంతోనే ఆయన నాకు ఈ భారీ ప్రాజెక్ట్ ఇచ్చారు.

ఈ సినిమాలో మొత్తం 7 పాటలు ఉన్నాయి. ఒక ప్రత్యేకమైన రెట్రో సాంగ్ కోసం లెజెండరీ సింగర్స్ చిత్ర , ఎస్పీ చరణ్ పాడారు. చిత్ర నా ట్యూన్ విని మెచ్చుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను. అలాగే బ్రేకప్ యాంథమ్, కాలభైరవ పాడిన ఎమోషనల్ సాంగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి.

నిర్మాత అభినవ్ ఎక్కడా రాజీ పడకుండా సంగీతం కోసం భారీ ఖర్చు చేశారు. ఈ సినిమా కోసం మేము ఖరీదైన లైవ్ స్ట్రింగ్స్ ఉపయోగించాం. దీనివల్ల ఆర్కెస్ట్రా సౌండింగ్ చాలా సహజంగా, అద్భుతంగా వచ్చింది. ఇది అందరికీ కనెక్ట్ అయ్యే ఒక స్వచ్ఛమైన గోదావరి ప్రేమకథ. నా కెరీర్‌లో ఈ సినిమా ఒక టర్నింగ్ పాయింట్ అవుతుందని ఆశిస్తున్నాన్ను అని వివరించారు.

## గాయపడ్డ సింహం అంతర్మథనం



టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్, యాక్టర్ తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ గాయపడ్డ సింహం. విభిన్నమైన కథా చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఈసారి రైటర్‌డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి ఒక డిఫరెంట్ ఎంటర్టైనర్‌తో ముందుకు వస్తున్నారు. పవన్ సదినేని సమర్పణలో సప్తస్వ మీడియా వర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి జింగాలా అనే ఎనర్జిటిక్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాట తరుణ్ భాస్కర్ పోషిస్తున్న పాత్రలోని అంతర్మథనాన్ని, ఆవేశాన్ని.. తిరిగి లేచే శక్తిని అద్భుతంగా ఆవిష్కరిస్తోంది. స్వీకర్ అగస్తి అందించిన ఎలక్ట్రిఫైయింగ్ మ్యూజిక్, నకాష్ అజీజ్ హైవోల్టేజ్ వాయిస్ ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కశ్యప్ శ్రీనివాస్, సునీల్ కరంకంటి, శ్రీని జోస్యుల రాసిన సాహిత్యం.. హీరో మనసులోని గాయాలను, ప్రతీకారాన్ని ఒక ఫన్ నోట్‌లో ప్రెజెంట్ చేయడం విశేషం. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ మరియు బ్రైడ్ సాంగ్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచగా, తాజా జింగాలా సాంగ్ సోషల్ మీడియాలో ఇన్‌స్టెంట్ హిట్‌గా నిలిచింది. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి విద్యా సాగర్ చింతా సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, విప్లవ్ నైషదం ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## తీరంలో అన్నదమ్ముల సవాల్..

టాలీవుడ్‌లో క్రీడా నేపథ్యం ఉన్న చిత్రాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. అయితే, ఇప్పటివరకు రాని విధంగా మొట్టమొదటిసారి వాలీబాల్ ఆట నేపథ్యంలో ఒక పవర్‌ఫుల్ స్పోర్ట్స్ డ్రామా తెరకెక్కుతోంది. అదే వాలీ. ఫైర్‌వాటర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికరమైన టైటిల్ మోషన్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు క్రిష్ జగర్లమూడి తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా అధికారికంగా విడుదల చేశారు. దిలీప్ కె. మనుకొండ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఆంధ్రప్రదేశ్‌లోని ఉప్పాడ తీరప్రాంత గ్రామీణ నేపథ్యంలో సాగుతుంది. ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఉండే భావోద్వేగాలు, వాలీబాల్ క్రీడలో ఉండే తీవ్రమైన పోటీని మేళవించి ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇప్పటికే ఉప్పాడ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఈ సినిమాతో రోనిత్ జీఆర్‌జీ హీరోగా పరిచయం అవుతుండగా, నిపుణ్ సత్య కీలక పాత్రలో కనిపిస్తున్నారు. అభిగ్న్య వుత్తలూరు హీరోయిన్‌గా నటిస్తోంది. రవి వర్మ, కల్పలత, లక్ష్మణ్ మీశాల వంటి అనుభవజ్ఞులైన నటులు ఈ చిత్రంలో ఉన్నారు. జి రోహన్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఔరానోవా స్టూడియోస్ సంగీతాన్ని, అరుణ్ విజేకే సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు.



## తర తర తోరణాలే కట్టేద్దాం..

యంగ్ హీరో విరాట్ కర్ణ కథానాయకుడిగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ సోషియో ఫాంటసీ చిత్రం నాగబంధం. ఇప్పటికే టీజర్, మొదటి పాటతో అంచనాలను పెంచేసిన చిత్ర బృందం, తాజాగా ఆదివారం సినిమాలోని రెండో పాటను విడుదల చేసింది. సుర సుర సుక్కలు తేరా సుట్టేదాం.. తర తర తోరణాలే కట్టేదాం.. అంటూ సాగే ఈ పాట పూర్తిగా పెళ్లి నేపథ్యంలో సాగుతోంది. ప్రముఖ గీత రచయిత కాసర్ల శ్యామ్ ఈ పాటకు తనదైన శైలిలో మాస్, జానపద సొగబులు అద్దిన సాహిత్యం అందించారు. ఈ పాట ప్రత్యేకత ఏమిటంటే, ఏకంగా ఏడుగురు ప్రముఖ గాయకులు దీనికి గళం అందించారు.



# రింకూ తీన్ మార్

## ఎట్టకేలకు కోల్‌కతా గెలుపు బోణీ




*కోల్‌కతా నైట్ రైడర్స్ ఇన్నింగ్స్‌లో 13.3 ఓవర్లు ముగిశాయి. ఇంకా 39 బంతులు మాత్రమే మిగిలాయి. చేయాల్సిన పరుగులు 71. చేతిలో నాలుగు వికెట్లు. క్రీజ్‌లో ఉంది ఏకైక స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్ రింకూ సింగ్. రింకూ కూడా ఫామ్‌లో లేకపోవడంతో కోల్‌కతాకు మరో ఓటమి తప్పదని అంతా డిసైడయ్యారు. ఈ తరుణంలో అనుకుల్‌రాయ్(16 బంతుల్లో 29నాటౌట్)తో కలిసి రింకూ సింగ్ (34 బంతుల్లో 53).. అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. సిక్స్‌తో మ్యాచ్ విన్నింగ్ షాట్ ఆడి కేకేఆర్‌కు అద్భుత విజయాన్ని అందించాడు. గెలుపు బోణీ చేశాడు.*

**కోల్‌కతా:** బౌలర్లు డామినేట్ చేసిన ఐపీఎల్ మ్యాచ్‌లో ఎట్టకేలకు కోల్‌కతా నైట్‌రైడర్స్ బోణీ కొట్టింది. ఆద్యంతం మలుపులు తిరిగిన ఈ మ్యాచ్‌లో రింకూ (34 బంతుల్లో 53నాటౌట్) మ్యాచ్ ఫినిషర్‌గా మారాడు. దీంతో సొంతగడ్డపై మరో రెండు బంతులుండగానే రాజస్థాన్ రాయల్స్‌పై కేకేఆర్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది.

156 పరుగుల టార్గెట్‌తో బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతాను ఇన్నింగ్స్ తొలి బంతికే జోఫ్రా ఆర్చర్ దెబ్బతీశాడు. టిమ్ సీఫర్ట్‌ను డకౌట్‌గా వెనక్కి పంపాడు. రెండో ఓవర్‌లో మరో ఓపెనర్ అజింక్యా రహేను కూడా గోల్డెన్ డక్‌గా బర్గర్ అవుట్ చేశాడు. జడేజా, రవిబిష్ణోయ్ స్పిన్ తిప్పడంతో రఘువంశీ(10), కామరూన్ గ్రీన్ (27), రోవ్‌మన్ పావెల్(23), రమణ్ దీప్ సింగ్(10) వికెట్లను కూడా వేగంగా వికెట్లను కోల్పోయింది. దీంతో కేకేఆర్ 85 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి ఓటమి దారిలో నిలిచింది.

కేకేఆర్ ఇన్నింగ్స్‌లో 13.3 ఓవర్లు ముగిశాయి. ఇంకా 39 బంతులు మాత్రమే. చేయాల్సిన పరుగులు 71. చేతిలో నాలుగు వికెట్లు. క్రీజ్‌లో ఉంది ఏకైక స్పెషలిస్ట్‌బ్యాట్స్‌మెన్ రింకూ సింగ్. రింకూ కూడా ఫామ్‌లో లేకపోవడంతో కోల్‌కతాకు మరో ఓటమి తప్పదని అంతా డిసైడయ్యారు. ఈ తరుణంలో అనుకుల్ రాయ్ (16 బంతుల్లో 29నాటౌట్)తో కలిసి రింకూ.. అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు.

15వ ఓవర్లో పరాగ్ బంతికి బౌండరీ బాదిన రింకూ... 16వ ఓవర్లో రవి బిష్ణోయ్ బంతికి డీప్ స్క్వేర్ లెగ్ మీదుగా సిక్స్ బాదాడు. ఆ ఓవర్ చివరి బంతికి అనుకుల్ కూడా సిక్స్ సాధించడంతో 13 రన్స్ వచ్చాయి. 17వ ఓవర్ వేసిన అర్చర్ బంతుల్లో బ్యాక్ టు బ్యాక్ బౌండరీలతో రింకూ 12 రన్స్ పిండుకున్నాడు. చివరి 12 బంతుల్లో 21 పరుగులు చేయాల్సిన దశలో అర్చర్ బంతికి అనుకుల్ లాంగ్‌ఆన్ సిక్స్‌తో కలిసి 12 రన్స్ వచ్చాయి. చివరి ఓవర్లో విజయానికి 9 పరుగులు కావాల్సిన పరిస్థితి. ఆ ఓవర్ వేసిన బ్రిజేష్ శర్మ మొదటి రెండు బంతులకు రెండు ఫోర్లు బాదిన రింకూ.. ఆ తర్వాత డాట్ ఆడినా, నాలుగో బంతికి సిక్స్‌తో విన్నింగ్ షాట్ ఆడాడు. దీంతో కేకేఆర్‌కు అనూహ్య విజయం లభించింది. రింకూ సింగ్ 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 53 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడి కేకేఆర్‌ను విజయతీరాలకు చేర్చాడు.

అంతకుముందు మొదట బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్‌కు డాషింగ్ ఓపెనర్లు యశస్వి జైస్వాల్(29 బంతుల్లో 39), వైభవ్ సూర్య



వంశీ(28 బంతుల్లో 46) ఫ్లయింగ్ స్టార్ ఇచ్చాడు. ఇద్దరూ విధ్వంసకర ఆటతో కేకేఆర్ బౌలర్లను భయపెట్టారు. పవర్ ప్లేలో 63 పరుగులు సాధించిపెట్టారు. వైభవ్ ఆరు ఫోర్లు, 2 సిక్స్‌లతో.. జైస్వాల్ 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో తొలి వికెట్‌కు 8.4 ఓవర్లలోనే 81రన్స్ జోడించారు.

**మిస్టరీ మ్యాజిక్**

ఈ దశలో మొదట మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి(3/14), తర్వాత కార్తీక్ త్యాగి(3/22) మ్యాజిక్ చేశారు. దీంతో రాజస్థాన్ బ్యాటింగ్ పేకమేడలా కూలింది. ఆ తర్వాత వచ్చిన రాయల్స్ బ్యాట్స్‌మెన్ ఎవరూ క్రీజ్‌లో నిలవలేకపోయారు. ఫలితంగా ఓపెనర్ల జోరుతో రెండొందలకు పైగా కొట్టేలా కనిపించిన రాజస్థాన్ ఆశ్చర్యంగా 155 పరుగులకే పరిమితమైంది.





# ముంబైకి గుజరాత్ టెస్ట్

**అహ్మదాబాద్:** ఐపీఎల్‌లో భాగంగా నేడు మరో ఆసక్తికర మ్యాచ్ జరగనుంది. సొంతగడ్డ అహ్మదాబాద్ మోదీ స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్‌తో గుజరాత్ టైటాన్స్ తలపడనుంది. రాత్రి ఏడున్నరకు మ్యాచ్ మొదలవుతుంది.

ఆరంభ రెండు మ్యాచ్‌ల్లో పరాజయాలతో ఐపీఎల్ సీజన్‌ప్రారంభించిన గుజరాత్ టైటాన్స్... హ్యాట్రిక్ విజయాలతో ఫుల్ జోష్‌లో ఉంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్... అన్ని విభాగాల్లో రాణిస్తోంది. బ్యాటింగ్‌లో వారి కీలక ఆటగాళ్లు సూపర్ ఫామ్‌లో ఉన్నారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వరుసగా మూడు అర్థసెంచరీలతో టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. జోస్ బట్లర్ కూడా దూకుడుప్రదర్శిస్తున్నాడు. ఓపెనర్ సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్, రాహుల్ తెవాటియా పరుగుల ట్రాక్‌లో ఉన్నారు. ఇక బౌలింగ్ విషయానికి వస్తే గత సీజన్‌కంటే బాగా మెరుగుపడింది. ప్రసిద్ధ్ కృష్ణ చక్కగా వికెట్లు తీస్తుండగా, రషీద్ ఖాన్ మధ్య ఓవర్లలో ఆధిపత్యం చెలాయిస్తున్నాడు. కేకేఆర్ మ్యాచ్‌లో మహమ్మద్ సిరాజ్, కగిసో రబాడా కొత్త బంతితో అద్భుతంగా రాణించగా, యువ ఆటగాడు అశోక్ శర్మ మెరుపు వేగంతో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను బోల్తా కొట్టిస్తున్నాడు. సొంతగడ్డపై మరో విక్టరీతో జైత్రయాత్రను కొనసాగించడంపై గుజరాత్ టైటాన్స్ ఫోకస్ పెట్టింది.

**ఐపీఎల్‌లో నేటి మ్యాచ్**

| | |
|---|---|
| గుజరాత్ టైటాన్స్ V/S ముంబై ఇండియన్స్ | రాత్రి 7.30 గం.లకు |

మరోవైపు హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. 13 ఏళ్ల తర్వాత తొలి మ్యాచ్‌లో నెగ్గిన ముంబై ఆ తర్వాత ఆడిననాలుగు మ్యాచ్‌లూ ఓడింది. పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో ఉంది. రోహిత్ శర్మ స్థానంలో వచ్చిన క్వింటాన్ డికాక్ వస్తూనే సెంచరీ మోత మోగించినా మిగతా బ్యాట్స్‌మెన్ వైఫల్యం వెంటాడింది. సూర్యకుమార్, తిలక్ వర్మ, కెప్టెన్ హార్దిక్ పాండ్యా, రూథర్ ఫర్డ్ బ్యాటింగ్‌లో నిరాశపరుస్తున్నారు. గత మ్యాచ్‌లో నమన్‌ధీర్ అర్థసెంచరీతో రాణించడం ముంబైకు ఊరటనిచ్చే అంశం. బౌలింగ్‌లోనూ ముంబై రాణించాల్సి ఉంటుంది. భారీ ఆశలు పెట్టుకున్న బుమ్రా.. వికెట్ లెస్‌గా కొనసాగడంతో పాటు భారీగా పరుగులిస్తున్నాడు. దీపక్ చాహర్, హార్దిక్ పాండ్యా, శార్దూల్ ఠాకూర్, ఘజన్‌ఫర్ ఎంతవరకు సూపర్ ఫామ్‌లో ఉన్న గుజరాత్‌ను కట్టడిచేయడం పైనే ముంబై గెలుపు అవకాశాలున్నాయి. వరుస పరాజయాలకు చెక్ పెట్టి మళ్లీ గెలుపు ట్రాక్‌లో పడాలని ముంబై ఇండియన్స్ చూస్తోంది.

**హెడ్ టు హెడ్**

ఇరుజట్లు ఇప్పటివరకు 8 మ్యాచ్‌ల్లో తలపడగా గుజరాత్ టైటాన్స్ ఆధిక్యం చాటింది. అయిదు మ్యాచ్‌ల్లో గెలుపొందింది. ముంబై ఇండియన్స్ మూడు మ్యాచ్‌ల్లో నెగ్గింది. చివరిసారి మే30, 2025న తలపడినపుడు విజయం ముంబై ఇండియన్స్‌ను వరించింది.

**పిచ్ రిపోర్ట్**

నరేంద్ర మోదీ స్టేడియంలో ఛేజింగ్ చేసే జట్లకు ఒకింత అనుకూలం. స్పిన్నర్లు పిచ్‌పై స్పిన్ రాబట్టవచ్చు. నెమ్మదిగా ఉండే అవుట్‌ఫీల్డ్, పెద్ద బౌండరీలతో భారీ స్కోర్లు కష్టమే. సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్‌కు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. తొలి మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఓటమి పొందిన గుజరాత్... రెండో మ్యాచ్‌లో కేకేఆర్‌పై నెగ్గింది. సొంతగడ్డపై ఈ సీజన్‌లో ముచ్చటగా మూడోమ్యాచ్ ఆడనుంది.

**గుజరాత్ టైటాన్స్ :** గిల్(కెప్టెన్), సుదర్శన్, జోస్ బట్లర్ (వికెట్ కీపర్), వాషింగ్టన్, గ్లెన్ ఫిలిప్స్, తెవాటియా, రషీద్ ఖాన్, రబడ, అశోక్ శర్మ, ప్రసిద్ధ్, సిరాజ్; **ఇంపాక్ట్ ప్లేయర్:** షారుక్ ఖాన్

**ముంబై ఇండియన్స్:** డికాక్ (వికెట్ కీపర్), సూర్యకుమార్, నమన్, తిలక్, రూథర్‌ఫోర్డ్, హార్దిక్(కెప్టెన్), రావత్, సాంట్నర్, శార్దూల్ , అశ్వనీ, బుమ్రా; **ఇంపాక్ట్ ప్లేయర్:** ఘజన్‌ఫర్.

# ఐపిఎల్‌లో పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర

**న్యూచండీఘర్:** ఐపీఎల్ 2026సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జోరు కొనసాగుతోంది. ఓటమనేది లేకుండా అజేయ జైత్రయాత్ర చేస్తున్న పంజాబ్... లక్నో సూపర్ జెయింట్స్‌పై ఘనవిజయం అందుకుంది. అయిదో విజయం ఖాతాలో వేసుకుంది. 255 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో ఏ స్థాయిలోనూ చేజింగ్ కనబరచలేదు. ఓపెనర్లు ఆయుష్ బదోని(21 బంతుల్లో 35), మిచెల్ మార్ష్(28 బంతుల్లో 40) తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించారు. ఈ జోడీని వైషఖ్ విడదీశాడు. ఆతర్వాత కూడా స్కోరు వేగం పెరగలేదు. 11ఓవర్లో వందమార్కు దాటింది. రిషబ్ పంత్ 23 బంతుల్లో 43 రన్స్ చేశాడు. పూరన్(9) మరోసారి నిరాశపరిచాడు. మార్క్‌రమ్(42) తర్వాత వచ్చిన బ్యాట్స్‌మెన్ మొక్కుబడిగా ఆడడంతో నెట్ రన్‌రేట్ పెరుగుతూ పోయింది. నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్లకు 200 పరుగులు చేయగలిగింది. చాహల్, వైషఖ్, అర్షదీప్, జాన్సెన్ తలా ఓ వికెట్ పడగొట్టారు.



# లక్నోపై ప్రియాన్ష్, కూపర్ పంజా

**న్యూచండీఘర్:** ముల్లనూర్ స్టేడియం సిక్సర్ల మోతతో దద్దరిల్లింది. లక్నో బౌలర్లపై పంజాబ్ కింగ్స్ జోడీ ప్రియాన్ష్ ఆర్య(93), కూపర్ కొన్నొల్లీ(87) ఆకాశమే హద్దుగా విధ్వంసం సృష్టించింది. తొలి ఓవర్లో ప్రభుసిమ్రాన్(0) వికెట్ తీసిన ఆనందం కూడా లక్నో బౌలర్లకు నిలవలేదు. ప్రతి బౌలర్‌పై సిక్స్‌లతో విరుచుకుపడ్డారు. ఆరో ఓవర్ మోసిన్ ఖాన్ బౌలింగ్‌లో 4, 6, 6తో 20 రన్స్... 11వ షమీ ఓవర్‌లో 6, 6, 4తో 19 రన్స్, 12వ ఓవర్ అవేష్ బౌలింగ్‌లో 6, 6, 4తో 18 రన్స్ ఇలా వీరి జోరు కొనసాగింది. 13వ ఓవర్‌లోనైతే వీరి ధాటికి మార్క్రమ్ బలయ్యాడు. 13వ ఓవర్ స్ట్రైకింగ్ తీసుకున్న కూపర్ కన్నోలి మార్క్రమ్ మొదటి బంతిని సిక్సర్‌గా మలిచాడు. రెండో బంతిని లాంగాన్ దిశగా సిక్సర్ కొట్టిన కన్నోలి మూడో బంతిని కూడా సిక్సర్‌గా మలిచాడు. ఆ తర్వాతి బంతిని వైడ్ వేయగా, నాలుగో బంతికి కూపర్ సింగిల్ తీయడంతో ప్రియాన్ష్ స్ట్రైక్‌లోకి వచ్చాడు. ఇక ప్రియాన్ష్ కూడా చివరి రెండు బంతులకు సిక్సర్లు కొట్టాడు. దీంతో ఆ ఓవర్లో 32 రన్స్ వచ్చాయి. ఇద్దరూ సెంచరీ ఊపులో కనిపించినా తృటిలో చేజార్చుకున్నారు. రెండో వికెట్‌కు 80 బంతుల్లో 182 రన్స్ జోడించారు. ఆతర్వాత వచ్చిన స్టోయినీస్(29), వధేరా(13), శశాంక్ సింగ్(17) ఓ చేయి వేయడంతో పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్లకు 254పరుగులకు చేరుకుంది. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఇదే అత్యధిక స్కోరు. ఈ మ్యాచ్‌లో మొత్తం 21 సిక్స్‌లు నమోదయ్యాయి. ప్రియాన్ష్ 9, కూపర్ 7, స్టోయినీస్ 2, శశాంక్ 2, వధేరా ఓ సిక్స్ బాదారు. అలాగే మరో 16 బౌండరీలు వచ్చాయి. లక్నో సూపర్ జెయింట్ బౌలర్లు చేష్టలుడుగిపోయారు.




# పెన్షన్ రంగంలోకి వందశాతం ఎఫ్‌డిఐలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 19:** జీవితబీమారంగం తరహాలోనే ఇపుడు పెన్షన్‌ఫండ్స్ రంగంలోకి కూడా విదేశీ పెట్టుబడులను నూరుశాతం అనుమతించేందుకు కేంద్రం కసరత్తులు షురూచేసింది. వచ్చే పార్లమెంటు సమావేశాల్లోనే ఈ బిల్లును ప్రవేశపెట్టేందుకు ఎన్డీయే సర్కారు నిర్ణయించింది. ఈ బిల్లు అమలుకువస్తే బీమారంగం తరహాలోనే ఇపుడు పెన్షన్ల రంగంలోకి కూడా నూరుశాతం విదేశీ పెట్టుబడులను కేంద్రం అనుమతిస్తుంది. గత ఏడాదే బీమారంగంలోకి ప్రస్తుతం ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితులను 74శాతంనుంచి 100శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. 2015లోనే బీమాచట్టం 1938కి సవరణలు తెచ్చి ఎఫ్‌డిఐ పరిమితులను 49 నుంచి 74కు పెంచారు. ఆ తర్వాత గత ఏడాదే నూరుశాతానికి పెంచుతూ నిర్ణయించారు. ఇపుడు పెన్షన్‌లరంగంలోకి ఎఫ్‌డిఐలకోసం పెన్షన్‌పండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ పిఎఫ్ఆర్‌డిఎ చట్టం 2013కు సవరణలు తీసుకురావాలని చూస్తోంది.

ఈ సవరణ బిల్లు వచ్చే వర్షాకాల సమావేశాల్లోకానీ లేదా శీతాకాల సమావేశాల్లోకానీ ప్రవేశపెట్టవచ్చని అంచనా. ప్రస్తుతం పెన్షన్‌ఫండ్‌లలో ఎఫ్‌డిఐ 49శాతం వరకూ మాత్రమే అనుమతి ఉంది. సవరణ బిల్లులో ఎన్పీఎస్ ట్రస్టును పిఎఫ్‌ఆర్‌డిఎనుంచి వేరుచేస్తారు. ఎన్‌పిఎస్ ట్రస్టుకు సంబంధించి అధికారాలు, విధులు, విధినిర్వహణ పిఎఫ్ఆర్డీయే క్రమబద్ధీకరణ నిబంధనలు 2015ప్రకారమే ఉన్నాయి. ఇపుడు ఈ ఎన్పీఎస్‌ట్రస్టును ఛారిటబుల్‌ట్రస్టులపరిధిలోకి కానీ, కంపెనీల చట్టంపరిధిలోకి కానీ తీసుకు రావాలనిచూస్తున్నారు. ఇందుకోసం ఒకప్రత్యేక ట్రస్టును ఏర్పాటుచేసి బోర్డులో కూడా 15 మంది సభ్యులకు తక్కువ కాకుండా ఏర్పాటుచేస్తారు. కేంద్రసర్వీసుల్లో కొత్తగా నియమితులవుతున్న అందరికీ కూడా ఎన్పీఎస్‌ను తప్పనిసరిచేసింది. 2004 జనవరి ఒకటవ తేదీనుంచే ఈ నిబంధనలు తెచ్చింది. ఆ తర్వాత అందరు పౌరులకు 2009మే ఒకటవ తేదీనుంచి స్వచ్ఛందపద్ధతిలో అమలుకు నిర్ణయించింది. సామాజిక ఆర్థిక అభివృద్ధిని పరిగణనలోనికి తీసుకుని ఈ పెట్టుబడుల పరిమితులు నిర్ణయిస్తారు.

# అక్షయ తృతీయ టర్నోవర్ 20వేల కోట్లు

**ముంబయి, ఏప్రిల్ 19:** బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నా అక్షయ తృతీయ నాడు పసిడి కొనుగోలు చేయాలనే సెంటిమెంట్ ఏమాత్రం తగ్గలేదు. ఈ ఏడాది అక్షయ తృతీయ సందర్భంగా దేశవ్యాప్తంగా బంగారం, వెండి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అక్షయతృతీయరోజు సుమారు రూ. 20వేల కోట్ల విలువైన వ్యాపారం జరుగుతుందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ కెయిట్ అంచనా వేసింది. గతేడాది ఇదే రోజున జరిగిన రూ. 16వేల కోట్ల వ్యాపారంతో పోలిస్తే ఇది 25 శాతం అధికంగా ఉంటుందని అంచనావేసింది. గతేడాది 10గ్రాముల బంగారం ధర సుమారు లక్ష రూపాయలు ఉండగా, ప్రస్తుతం అది రూ. 1.58 లక్షలకు చేరింది. వెండి ధర కూడా కిలోకు రూ. 85వేలనుంచి ఏకంగా రూ. 2.55 లక్షలకు ఎగబాకింది. ఈభారీ ధరల పెరుగుదల వినియోగదారుల కొనుగోలు సరళిపై స్పష్టమైన ప్రభావాన్ని చూపింది. ప్రజలు భారీ ఆభరణాలకు బదులుగా తక్కువ బరువున్న, నిత్యం ధరించేందుకు వీలైన నగల వైపే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ధరలు పెరగడంతో వ్యాపారం విలువ పరంగా పెరిగినట్లు కనిపిస్తున్నా, విక్రయించిన బంగారం పరిమాణం తగ్గిందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈసారి దేశవ్యాప్తంగా సుమారు 10 టన్నుల బంగారం, 157టన్నుల వెండి అమ్ముడవుతాయని అంచనా. మరోవైపు, భౌతిక బంగారానికి బదులుగా డిజిటల్ గోల్డ్, సావరిన్ గోల్డ్ బాండ్లవైపు ముఖ్యంగా యువత ఆసక్తి కనబరుస్తున్నారు. ఇక పసిడి వెండి పరిశీలిస్తే.. హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,780 వద్ద ఉండగా, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,42,800గా నమోదైంది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రూ.1,55,930, చెన్నైలో రూ.1,56,660 వద్ద ట్రేడ్ అవుతోంది. మరోవైపు వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్, చెన్నైలలో కిలో వెండి ధర రూ.2.8 లక్షలుగా ఉంది.



# బ్యాంకింగ్‌లో రిటైల్ రుణాలకే డిమాండ్

## జూన్ నాటికి 11-13శాతం రుణాల్లో వృద్ధి అంచనా




**ముంబయి, ఏప్రిల్ 19:** భారత్‌లోని బ్యాంకింగ్‌రంగంలో భౌగోళిక ఉద్రిక్తతలు, పశ్చిమాసియా వార్ టెన్షన్లు ఉన్నప్పటికీఈ ఏడాది జనవరి జూన్ కాలంలో 11 నుంచి 13శాతం ఆహారేతర రుణాల కేటగిరీలో వృద్ధి ఉంటుందని అంచనా. ఫిక్కి ఐబిఎ బ్యాంకర్స్ సర్వే వివరాలప్రకారం బ్యాంకులకు బ్యాలెన్స్‌షీట్లు మెరుగుపడ్డాయని, స్థిరంగా ఆర్థిక కార్యకలాపాలున్నాయని, ఆర్థికవ్యవస్థలోని విభిన్నరంగాల్లో రుణాలకు డిమాండ్ వస్తోందని, ఆర్థికవ్యవస్థలో రిటైల్, ఎస్ఎంఇ క్రెడిట్ తీరు క్రమేపీ పెరుగుతున్నదని సర్వేలో తేలింది. అంతేకాకుండా ప్రైవేటు మూలధన వ్యయంలో రికవరీ కూడా పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

ఇక పారిశ్రామిక రుణాల వృద్ధి వ్యూహాత్మకంగా పెరుగుతుందని అంచనా వేసారు. అలాగే రికవరీ కూడా క్రమేపీ మెరుగుపడుతుందని అంచనావేసారు. మౌలికవసరుల అభివృద్ధి, ఉత్పత్తి అనుసంధానిత రంగాలు, ప్రభుత్వ పరిధిలో మూలధన వ్యయం అధికంగా ఉండే రంగాలకు రుణాల వృద్ధిపెరుగుతుంది. ఇన్‌ఫ్రా, రియల్ ఎస్టేట్, ఆటో, ఆటోవిడిభాగాలు, ఫార్మా, డేటా సెంటర్లు, రక్షణ రంగ సంబంధిత కంపెనీలనుంచి రుణాలకు డిమాండ్ పెరుగుతుందని ఫిక్కీ అంచనావేసింది. అయితే బ్యాంకింగ్‌కార్యకలాపాల వృద్ధికి ఇపుడు కృత్రిమ మేధ కూడా కొంతమేర ఆటంకం కలుగుతోంది. ఎందుకంటే సైబర్ సెక్యూరిటీ రిస్క్ ఇపుడు బ్యాంకులకు సవాలుగా మారుతోంది.

ఇక పునరుత్పత్తిరంగంలో ఫైనాన్సింగ్‌కూడా ఇటీవలి కాలంలోపెరుగుతోంది. ఆహారేతర రంగాల్లో బ్యాంకర్ల రుణాలు 11నుంచి 13శాతం ఉంటుందని 46శాతం మంది సర్వే ప్రతినిధులు వెల్లడించారు. 13శాతానికిపైగా వృద్ధి ఉంటుందని 29శాతం వెల్లడించారు. అలాగే 9 నుంచి 11శాతం వృద్ధి ఉంటుందని 17శాతం మంది సర్వేలో పాల్గొన్నవారు తెలిపినట్లు తేలింది. 9శాతంకంటే తక్కువగానే రుణాల వృద్ధి ఉంటుందని 8శాతం మంది తెలిపారు. ఇక విదేశీ బ్యాంకులు మాత్రం 11-13శాతం వృద్ధి ఉంటుందని వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు, విదేశీ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, సహకార బ్యాంకులు మొత్తం 24 సంస్థలు ఈ సర్వేలో పాల్గొన్నాయి. జనవరి ఫిబ్రవరి నెలలమధ్యలోనే ఈసర్వే జరిగింది. సేవలరంగం, రిటైల్ రంగాల్లోనే ఎక్కువ రుణ వృద్ధి ఉంటుందని అంచనా. రియల్ ఎస్టేట్; ఆర్థికసేవలు, రవాణా, పర్యాటకరంగ సంబంధిత రంగాల్లో సేవలవిభాగానికి ప్రాధాన్యత పెరిగింది. రిటైల్ రుణాలే ఎక్కువగా పెరుగుతాయని, బ్యాంకింగ్‌రంగ వృద్ధికి రిటైల్ రంగమే కీలకమని సర్వేలోనిర్ధారించారు.

ఇక ఎస్ఎంఇ రుణ డిమాండ్‌కూడా పటిష్టంగా ఉంటుందని అంచనా. టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్స్, ఫార్మాక్యూటికల్స్, ఇంజినీరింగ్‌గూడ్స్, ఆహారశుద్ధిరంగాల్లో ఎంఎస్ఎంఇ రంగానికి మూలధన పటిష్టతకోసం రుణ డిమాండ్ పెరుగుతుందని వెల్లడి అయింది.

# టాప్-8 కంపెనీల్లో 1.88 లక్షల కోట్లు పెరిగిన టర్నోవర్

**ముంబయి, ఏప్రిల్ 19:** ఈక్విటీ మార్కెట్లలోని టాప్ పది కంపెనీల్లో ఎనిమిది కంపెనీల మార్కెట్ విలువలు రూ.లక్షా 87 వేల 497.45 కోట్లు పెరిగాయి. వీటిలో భారతి ఎయిర్‌టెల్ అత్యంత ఎక్కువ లాభపడిందిఈక్విటీ ట్రేడింగ్‌లో లాభాలతో ర్యాలీ తీసింది. గతవారంలో బిఎస్ఇ బెంచ్‌మార్క్ సూచీ 943.29 పాయింట్లు పెరిగితే ఎన్ఎస్ఇ నిఫ్టీకూడా 302.95పాయింట్లుపెరిగింది. వరుసగా రెండోవారంలో కూడా మార్కెట్లు లాభాల్లోనే దౌడు తీసాయి.

భౌగోళిక ఉద్రిక్తతలు సడలింపులు కనిపించడం, రిస్క్ సెంటిమెంట్ బలహీనపడటం వంటివి సూచీల పెరుగుదలకు దారితీసాయి. అలాగే అమెరికా ఇరాన్‌శాంతి ఒప్పందంపై ఆశలు పెరగడం కూడా ఒక కారణం అయిందని రెలిగేర్‌బ్రోకింగ్ సీనియర్‌వైస్‌ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా అన్నారు. భారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువలు రూ,58,831.52 కోట్లుపెరిగిరూ.11,25,125.21కోట్లకు చేరింది.



జీవితబీమా సంస్థ కూడా రూ.27,608.62 కోట్లుపెరిగి రూ.5,32,691.31 కోట్లకు చేరితే టిసిఎస్ రూ.20,731.64 కోట్లుపెరిగి మొత్తంగా రూ.9,34,063.56కోట్లకు చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువలు కూడా రూ.20,231.05 కోట్లుపెరిగి రూ.18,47,317.84 కోట్లకు చేరితే ఎల్‌అండ్‌టి రూ.18,577.91 కోట్లుపెరిగి రూ.5,63,314.50కోట్లకు చేరింది. ఐసిఐసిఐ ఎంక్యాప్ 18,266.82కోట్లుపెరిగి 9,65,008.67 కోట్లకు చేరినట్లు స్టాక్ ర్యాలీ స్పష్టంచేస్తోంది. ఇక భారతీయ స్టేట్ బ్యాంకు మార్కెట్ విలువలు కూడా రూ.12,599.79 కోట్లుపెరిగి రూ.9,97,229.77 కోట్లకు చేరింది. ఇన్ఫోసిస్ విలువలు కూడా రూ.10,650.01కోట్లుపెరిగి రూ.5,34,774.50 కోట్లకు చేరింది. ఇక హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఎంక్యాప్ మాత్రం రూ.16,163.04 కోట్లు క్షీణించి రూ.12,31,315.53 కోట్లకు చేరితే బజాజ్‌ఫైనాన్స్ రూ.9769.3 కోట్లు క్షీణించి రూ.5,65,437.17 కోట్లకు చేరింది. ఇక టాప్ కంపెనీలుగా రిలయన్స్ ఇప్పటికీ టాప్‌వన్‌లోనే నడిస్తే హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంకు, టిసిఎస్, బజాజ్‌ఫైనాన్స్, ఎల్‌అండ్‌టి, ఇన్ఫోసిస్; ఎల్‌ఐసిలు వరుసస్థానాల్లో కొనసాగాయి.

# హార్ముజ్ మూసివేతతో రూపీపై ఒత్తిడి



**ముంబయి, ఏప్రిల్ 19:** హార్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేస్తున్నట్లు ఇరాన్‌ప్రకటించడంతో భారత కరెన్సీపై ఆప్రభావం ఎక్కువ పడింది. చమురు దిగుమతుల్లోచెల్లింపులు ఎక్కుడా డాలర్లతోనే చేయాల్సిరావడంతో రూపాయిపై ఒత్తిడి పెరుగుతోంది. అలాగే భారత వాణిజ్యలోటు కూడా పెరిగేప్రమాదం లేకపోలేదు. మార్చి నెలలో నాలుగు శాతానికిపైగా క్షీణించిన రూపాయి ఏప్రిల్‌లో ఇప్పటివరకూ 2.1శాతం బలపడింది. ఇపుడు జలసంధి మూసివేతతో రూపాయి మార్పిడిపై ఒత్తిడి పెరుగుతుందని అంచనా. ఎందుకంటే ముడిచమురుధరలు అంతర్జాతీయ మార్కెట్లలో ఒక్కసారిగా పెరుగుతాయి. ఆప్రకారం డాలర్లలోనే చెల్లింపులు చేయాల్సి రావడంతో రూపాయిపై ఒత్తిడి మరింతపెరుగుతుంది. జలసంధి మూసివేతవల్ల సరఫరా సమస్యలుపెరిగి ధరలు అమాంతంపెరుగుతాయి. మార్చిలో 4శాతం క్షీణించడంతో రిజర్వుబ్యాంకు వెంటనే కట్టడిచర్యలుచేపట్టింది. ప్రత్యేక డాలర్ గవాక్షం ఏర్పాటుచేసి ఆయిల్ కంపెనీలు ఈ అనిశ్చితిని అధిగమించేవిధంగా చర్యలు తీసుకుంది. భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గితే మళ్లీరూపాయి పుంజుకుంటుంది. ప్రస్తుతం 92.60గా కొనసాగుతున్న ఈ కరెన్సీ మార్పిడి ఇదే అనిశ్చితి కొనసాగితే మళ్లీ 93నుంచి 95 రూపాయలకు చేరినా ఆశ్చర్యపోనవసరంలేదు. ఇదే అనిశ్చితి కొనసాగితే అమెరికా ఇరాన్‌ల ఒప్పందం కొలిక్కిరానిపక్షంలో డాలరుకు రూపాయి విలువలు 100ను కూడా చేరుకోవచ్చని ఫోరెక్స్ మార్కెట్ నిపుణులు అంచనావేస్తున్నారు.

# లిస్టింగ్‌ను వ్యతిరేకిస్తున్న నోయెల్ టాటా




**ముంబయి, ఏప్రిల్ 19:** టాటాట్రస్ట్స్, బాయి హీరాబాయి జెమ్‌షెడ్జీ నవ్‌సారి ఛారిటబుల్ సంస్థల ట్రస్ట్ డీల్‌లోని కొన్ని నియమాలను పరిమితులను సవరించేందుకు ఛైర్మన్ నోయెల్ టాటా ఆధ్వర్యంలోని ట్రస్టు కసరత్తులుచేస్తోంది. ఇప్పటివరకూ ఈ విధానాలు ట్రస్టీ పదవులు కేవలం పార్సీలకే పరిమితంచేయడం జరిగింది. పూర్వ బాంబే ప్రెసిడెన్సీలో నివసించేవారికే ఈ ట్రస్టుల్లో డైరెక్టర్ పదవులకు అర్హత ఉండేది. ఇపుడు ట్రస్ట్ డీడ్‌లో ఉన్న అసమానతలు సరిచేసేందుకు ఈనెల 17న జరిగిన సమావేశంలో ట్రస్టీలు పరిమితుల విధానాలు సవరించే చర్యలు ప్రారంభించాలని నిర్ణయించింది టాటా గ్రూప్ మొత్తంలోనే 66.4శాతం వాటాలు కలిగి ఉన్న ఈ ట్రస్టులు రతన్‌టాటా మరణానంతరం నోయెల్ టాటా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి వరుస వివాదాల్లో కొనసాగుతోంది. ట్రస్టీలు కొందరు పారదర్శకత లేకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తారు. హోల్డింగ్‌ఎంపెనీ అయిన టాటాసన్స్‌ను స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ చేయాలని కూడా పట్టుబడట్టారు. అయితే వీటిపై ట్రస్టులు కొంత విముఖంగా ఉన్నాయి. గడచిన పాతికేళ్లుగా జొరాస్ట్రియన్ మతానికి చెందని వారిని కూడా ట్రస్టుల్లో నియమించారు. హీరాబాయి ట్రస్టు బోర్డులో తొలిసారి పార్సీయేతర వ్యక్తిని నియమించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.